విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
సంవత్సరం	రు. 31 00	రు 34 00
ఆరు మాసాలు	15.50	17 00
మూడు మాసాలు	7 75	8 50
ఒక మాసం	2:65	2 90

VISALAANDHRA, VIJAYAWADA 4· Phone 376 • • • Regd No. H 203

విశాలాంధ్ర

7-1937

సంపుటి 14 సంచిక 346] విజయవాడ • 4-3-1965 గురువారం [6 పేజీలు 8 పై

కుష్ఠు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
లెప్రసిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రాడక్ట్స్ మారెళ్ళపురం. కర్నూలు జిల్లా.

నెల్లూరు, హిందూపురం కాల్పులపై విచారణకు ప్రభుత్వ నిరాకరణ

పోలీసు కవ్వింపు చర్యలను గర్హిస్తూ శాసనసభలో పలువురి ప్రసంగాలు

తెలుగుభాషపట్ల ప్రభుత్వ అనాదరణే ప్రజల కోపానికి కారణమని వివరణ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, మార్చి 3

ఆంధ్రప్రదేశ్‌లో హిందీ వ్యతిరేక ప్రదర్శకులపై పోలీసులు జరిపిన విచక్షణారహితమైన కాల్పులు, లాఠీ చార్జీలను గురించి న్యాయ విచారణ జరిపించాలని నేడుశాసనసభలో 'సభాదృష్టికి తెచ్చేతీర్మానం'పై మాట్లాడిన సభ్యులంతా డిమాండ్ చేశారు

హిందీ వ్యతిరేకోద్యమంపట్ల పోలీసులు అవలంబించిన వైఖరి దారుణంగాను, విచక్షణా రహిత పూరితంగాను ప్రదర్శకులను కవ్వించేదిగాను వున్నదని సభ్యులంతా నిశితంగా విమర్శించారు.

ఈ తీర్మానంపై సభ్యులు మాట్లాడిన పిమ్మట, ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి సభలో ఒక ప్రకటనచేస్తూ, న్యాయవిచారణ జరుపవలసిన అగత్యం ఏమాత్రం లేదని తిరస్కరించారు

70 వ నిబంధన ప్రకారం శాసనసభలో ప్రతిపాదించిన ఈ తీర్మానంపై కమ్యూనిస్టు పక్షసభ్యులు శ్రీ స్వర్ణ వేమయ్య మాట్లాడుతూ యిలా అన్నారు

ముఖ్యంగా నెల్లూరులో పోలీసు కాల్పుల వల్ల పరిస్థితి మరింత విషమించింది. అసలే పరిస్థితులు ఉద్రిక్తంగా వున్న సమయంలో పోలీసులు కాల్పులు జరపడంతో సాంఘిక విద్రోహ శక్తులకు చక్కని అవకాశం కల్పించినట్లు అయింది.

"హిందీ వ్యతిరేక ఆందోళనోద్యమం మొదట్లో విద్యార్థులకు మాత్రమే పరిమితమై వున్నది. అయితే, పోలీసులు దమననీతికి దిగడంతో సాంఘిక విద్రోహశక్తులు కూడా ఆ ఉద్యమంలో జొరబడడానికి వీలుకలిగింది.

ప్రదర్శకులను చెదరగొట్టడానికి పోలీసులు ప్రాథమిక చర్యలేవీ తీసుకోలేదు. విచక్షణా రహితంగా అరెస్టులు సాగించారు. దానితో పరిస్థితి మరింత విషమించినదని శ్రీ స్వర్ణ వేమయ్య విమర్శించారు

"హిందూపురంలో పోలీసుల ప్రవర్తన మరింత దారుణంగావుంది. వారు విద్యార్థులను కవ్వించారు, విద్యార్థులపై తమ కసి తీర్చుకోవడానికి పోలీసులు కాల్పులు సాగించారని ఆయన ఖండించారు.

ఈ సంఘటన లన్నింటిపైన నిష్పాక్షికమైన న్యాయవిచారణ జరిపించాలి. పోలీసు అత్యాచారాలపై న్యాయవిచారణ ఏర్పాటు చేయాలి.

భాషాసమస్యపై ప్రజలలో గల తీవ్ర అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి, ప్రజల మనస్సులలోని అనుమానాలను తొలగించడానికి ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవలసి వుంటుందని శ్రీ స్వర్ణ వేమయ్య వక్కాణించారు.

మరొక కమ్యూనిస్టుపక్ష సభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ ప్రసంగిస్తూ, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే హిందీవ్యతిరేకోద్యమ సందర్భంలో సాంఘిక విద్రోహ శక్తులకు చక్కని అవకాశాలు కల్పించాయని పేర్కొన్నారు.

మన దేశం స్వాతంత్ర్యం పొందక పూర్వమే, స్వదేశీ జాతీయ భాషగా హిందీ యోద్యమం గుర్తించింది. అయినప్పటికీ, అలాంటి జాతీయ భాషను ప్రజలలో ప్రచారం చేయడానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలేమిటని నేను ప్రశ్నిస్తున్నాను.

జాతీయ భాషపట్ల ప్రభుత్వం నిర్లక్షపై ఖరి ప్రదర్శించింది. అలాగే మన మాతృభాషయైన తెలుగు విషయంలోను ప్రభుత్వం చేసిందేమీ లేదు. విద్యాలయాలలో తెలుగుబోధనాభాషగా ప్రవేశపెట్టలేదు. అధికార భాషగా చేయలేదు

ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్టమైన ఈ రెండు విధానాల ఫలితమే అంటూ ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల హిందీ వ్యతిరేకోద్యమం వృద్ధి చెందినదని శ్రీ వంకా సత్యనారాయణ వివరించారు.

హిందూపురంలో పోలీసుల అమానుష ప్రవర్తనను పేర్కొంటూ, శ్రీ వంకా సత్యనారాయణ యిలా వివరించారు:

కాల్పులు జరిగిన తరువాత అరగంటల పాటు గాయపడి నేలకొరిగిన అభాగ్యుడు అక్కడేపడివున్నాడు. గాయపడినవారికి వైద్య సౌకర్యం కల్పించాలన్న ఇంగితజ్ఞానం కూడా పోలీసులకు లేక పోయింది.

ఈ దారుణ సంఘటనకు ప్రభుత్వం తన బాధ్యతను కప్పిపుచ్చుకోవడానికి నెపాన్నంతా పోటీ కమ్యూనిస్టుపార్టీపై నెట్టజూస్తున్నదని శ్రీ వంకా సత్యనారాయణ విమర్శించారు హిందీని జాతీయ భాషగా పోటీ కమ్యూనిస్టు పార్టీ కూడా అంగీకరించిన సంగతిని ఆయన పేర్కొన్నారు.

ప్రదర్శకులను చెదరగొట్టడానికి, అనవష్టం కల్పించని తుపాకి కాల్పులు సాగించడానికి బదులు, పోలీసులు ప్రజల ప్రాణాలను హరించే కాల్పులు సాగించారని ఆయన ఆరోపించారు. ఆ కాల్పులలో గాయపడిన వారు చనిపోయిన వారు అందరికీ కూడా మోకాళ్ళ పైభాగంలోనే తుపాకి గుళ్ళు దూసుకు పోయాయని ఆయన ఉదాహరించారు.

డిటెన్యూల విడుదల కోరుతూ మహిళల రాయబారం

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి పత్ర సమర్పణ

హైదరాబాద్, మార్చి 2

పోటీపార్టీ డిటెన్యూల కుటుంబాలకు చెందిన 80మంది స్త్రీలు, 20 మంది బిడ్డలు నేడు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని శాసనమండలి భవనంలో కల్సుకొని తమవారిని విడుదల చేయవలసినదిగా అభ్యర్థిస్తూ విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.

డిటెన్యూలపై కేసులు పెట్టి న్యాయ విచారణ జరపాలనీ, దేశ రక్షణ నిబంధనలను రద్దుచేయాలనీ, జబ్బు పడిన డిటెన్యూలను పెరోల్‌పై విడుదలచేయాలని, రోజు భత్యం రు 3.50 నుండి రు. 5.00 లకు పెంచాలనీ డిటెన్యూల కుటుంబాలకు అలవెన్సు ఇవ్వాలని, డిటెన్యూలను వారివారి జిల్లాలలోని జైళ్ళకు పంపాలని ప్రతినిధివర్గం సమర్పించిన విజ్ఞప్తి పత్రంలో పేర్కొన్నారు.

ఈప్రతినిధివర్గంతోబాటు శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు శాసనమండలి కమ్యూనిస్టు పక్షనాయకులు శ్రీ మగ్దుంమొహియుద్దీన్‌గారలు కూడా ముఖ్యమంత్రిని కల్సుకున్నారు.

విజయవాడనుండి ఈ మహిళా ప్రతినిధులు వ్యాన్‌లో ఇక్కడకు వచ్చారు పబ్లిక్ గార్డెన్ వద్ద వ్యాన్ ఆపివేయబడింది. ప్రతినిధుల వద్దనున్న జెండాలను అధికారులు తీసుకున్నారు. తర్వాత జెండాలులేకుండా, ముఖ్యమంత్రిని కల్సుకునేందుకు ప్రతినిధులు లోపలికి వెళ్ళటానికి అధికారులు అనుమతిచ్చారు.

డిటెన్యూల కుటుంబాలకు అలవెన్సు ఇచ్చే విషయాన్నిమాత్రం తీవ్రంగా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రతినిధివర్గంతో చెప్పారు డిటెన్యూలకు రోజుభత్యం పెంచటం సాధ్యం కాదని ఆయన తెల్పారు.

విషమిస్తున్న వియత్నామ్ సంక్షోభం;

అలీన రాజ్యాల మధ్య సమాలోచనలు

భారత్, యుగోస్లావ్, ఐక్య అరబ్ రిపబ్లిక్, అల్జీరియా ప్రభుత్వాలు సమిష్టి చర్య గైకొనే సూచన

అల్జీర్స్, మార్చి 2

వియత్నామ్ సంక్షోభ పరిష్కారానికి అలీన రాజ్యాలన్నీ కలిసి సమిష్టి చర్యలు తీసుకొనే విషయమై భారత ప్రభుత్వం అల్జీరియా ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు నేడిక్కడ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

ఈ సమస్యపై భారత ప్రభుత్వం ఐక్య అరబ్ రిపబ్లిక్ యుగోస్లావ్ ప్రభుత్వాలతో కూడా సంప్రతిస్తున్నట్లు రూఢిగా తెలియవస్తున్నది

ఇదే సమస్యపై యుగోస్లావ్ అధ్యక్షులు టిటో, అల్జీరియా అధ్యక్షులు బెన్‌బెల్లాకు ఒక సందేశం పంపారు.

ఈ వేళ ఉదయం అమెరికా క్రొత్తగా ఉత్తర వియత్నామ్‌పై జరిపిన విమానదాడులతో పరిస్థితి త్వరగా విషమిస్తున్నట్లు భావించిన అలీన రాజ్యాలు త్వరగా దౌత్యమార్గాలలో ఉమ్మడి చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని గుర్తించిన్నట్లు కన్పిస్తున్నది.

అయూబ్‌ఖాన్‌కు లీషావ్‌చీ ప్రశంస

పాక్-చైనా మైత్రి దీర్ఘకాలికమైనదని వివరణ

పెకింగ్, మార్చి 2

చైనాకు సంబంధించినంతవరకు, పాకిస్థాన్‌తో స్నేహదీర్ఘకాలిక విధానంగామాత్రమే వుంటుందని, కేవలం అక్కర గడుపుకోవడానికిది ఉద్దేశించబడలేదని చైనా అధ్యక్షులు లీషావ్‌చీ నేడిక్కడ పాక్ అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్ గౌరవార్థం ఏర్పాటుచేసిన అధికార విందులో ప్రకటించారు.

పాకిస్థాన్, చైనాదేశాలమధ్య స్నేహాన్ని పెంపొందించడానికి అయూబ్‌ఖాన్ గట్టి పట్టుదలతో, వివేక దృష్టితో అనేక చర్యలు తీసుకొన్నందుకు ఆయన అభినందనలు తెలిపారు

కేరళ ఎన్నికల సందర్భంలో ఎర్నాకుళంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు విద్యార్థులకు మధ్యజరిగినఒక కొట్లాట సందర్భంలోముగ్గురికి గాయాలు తగలగా వారిని ఆసుపత్రిలో చేర్చారు

ప్రభుత్వాన్ని విమర్శించే ఉద్యోగులపై నిఘా

ఉత్తర ప్రదేశ్‌లో

లక్నో, మార్చి 2

ప్రభుత్వ విధానాలను విమర్శించే ఉద్యోగుల్ని జాగ్రత్తగా గమనించ వలసిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ కార్యాలయ అధిపతులకు, ముఖ్య అధికారులకు ఒక సర్క్యులర్ జారీచేసినట్లు [illegible] తెలుస్తున్నది.

భారత దేశంలో ప్రస్తుతం పర్యటిస్తున్న సోవియట్ పార్లమెంటరీ ప్రతినిధివర్గనాయకురాలు సుప్రీం సోవియట్ ఉపాధ్యక్షురాలు అయిన వై. యస్. నస్రిద్దినోవా

టీచర్ల వేతనాలు పెంపుదలకోరుతూ ప్రధానికి విజ్ఞప్తి

7 గురు పార్లమెంటు సభ్యులచే లేఖ

న్యూఢిల్లీ, మార్చి 2

ప్రాథమిక సెకండరీ ఉపాధ్యాయుల వేతనాలు పెంచడానికి వీలుగా ప్రణాళికా పరిధి వెలుపల రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం అదనంగా గ్రాంట్లు యిచ్చే విషయమై తీవ్రంగా పరిశీలన జరపాలని ఏడుగురు పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఈ విషయాన్ని అత్యవసర జాతీయ సమస్యగా పరిగణించాలని వారు ప్రధానమంత్రికి వ్రాసిన లేఖలో కోరారు.

వారి లేఖలో యిలా వుంది.

"ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలనే కోర్కె సమంజసమైనదేనని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అంగీకరించుచున్నాయి నాల్గవ ప్రణాళిక కాలంలో, ప్రణాళికా పరిధిలోపలనే అవసరమయిన నిధులు లభ్యంకాకపోతే, ఆ ఐదేళ్ళలో విద్యాభివృద్ధికి కృషిచేయలేమని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి

ఉపాధ్యాయుల పరిస్థితులను మెరుగుపర్చనిదే విద్యారంగంలో సంక్షోభాన్ని పరిష్కరించ లేము

ఏ. పి. టి. యు. సి. పట్ల ప్రభుత్వ వివక్ష

జీవనవ్యయ సూచికల దర్యాప్తు సంఘ నిర్మాణంపై శాసనసభలో విమర్శ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, మార్చి 2

రాష్ట్రంలో అత్యధిక సంఖ్య కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని కమ్యూనిస్టు సభ్యులు నేడు శాసనసభలో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

జీవనవ్యయ సూచికలను పరిశీలించేందుకు ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీలో అల్ప సంఖ్యకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న మజ్దూర్ సంఘ్‌కు యేప్రాతిపదికపై సభ్యత్వం యిచ్చారని కమ్యూనిస్టు ప్రతిపక్ష నాయకులపై శ్రీయుతులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఉపనాయకులు వేములపల్లి శ్రీ కృష్ణ పంచాయతీరాజ్ మంత్రిని ప్రశ్నించారు.

ఇండిపెండెంటు సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగా రడిగిన ఒక ప్రశ్నకు పంచాయతీరాజ్ మంత్రి సమాధానం చెబుతున్న సందర్భంగా వారీ ప్రశ్న అడిగారు

ప్రభుత్వం లేబర్ డిపార్టుమెంటుకు యీ కమిటీలోనికి కార్మిక ప్రతినిధిని సూచించవలసిందిగాకోరిన మీదట, ఆ డిపార్టుమెంటు మజ్దూర్ సంఘ్‌కు చెందిన శ్రీ మహదేవ్‌సింగ్ పేరును సూచించిందని మంత్రి చెప్పారు.

ఇటీవల జరిసింది కార్మిక సంఘాల సభ్యత్వ తనిఖీలో ఆంధ్ర ప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కు రాష్ట్రంలో ప్రధమ స్థానమూ, ఐ. యన్. టి. యు సికి ద్వితీయ స్థానమూ, మజ్దూర్‌సంఘ్‌కు చివరి స్థానం మాత్రమే లభించినవిషయం ప్రభుత్వానికి తెలియనా అని వారు మంత్రిని ప్రశ్నించారు.

పంచాయతీరాజ్ మంత్రి యీ ప్రశ్నలకు సూటిగా సమాధానం యివ్వలేకపోయారు. లేబర్ డిపార్టుమెంటు శ్రీ సింగ్ పేరును సూచించిందని ఆయన తన పూర్వపు సమాధానాన్నే పునరుద్ఘాటన చేశారు.

ఈ ప్రశ్నోత్తరాలు జరుగుతున్న సమయంలో కార్మికమంత్రి శ్రీ బి. వి గురుమూర్తి సభలోనే వున్నారు. ఆయన మూకీభావం వహించారు.

ఐ యన్ టి యు సికికూడా ఆ నిపుణుల సంఘంలో సభ్యత్వం వుండాలనుకొంటే కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే అన్ని పక్షాల వారికి అందులో ప్రాతినిధ్యం ఇవ్వవచ్చుకదా? అని కమ్యూనిస్టు ప్రతిపక్ష ఉపనాయకుడు శ్రీ శ్రీకృష్ణ ప్రశ్నించారు.

కమిటీ ఒక నెలరోజుల్లోనే తన తుది నివేదిక సమర్పించబోతున్నది. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. అందుకని యిప్పుడు కొత్తవారిని చేర్చే సమస్య ఉత్పన్నం కాదని మంత్రి చెప్పారు.

ఇకముందు యిలాంటి కమిటీల నేర్పాటు చేసేటప్పుడు యీ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలని స్పీకర్ సూచించారు

“తుచ్ఛ శ్రద్ధాంజలి”

హైదరాబాద్, మార్చి 3

సంస్కృత పదాలను హిందీ తమ చిత్తం వచ్చినట్లు వాడుతుండటంవల్ల ఎటువంటి అపహాస్యమయిన అర్థాలు వస్తున్నవో నేడు శాసనసభలో శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు వెల్లడించారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారి, ఇంగ్లీషులో నెహ్రూకు "హంబుల్ ట్రిబ్యూట్" అని వాడితే దానికి "తుచ్ఛ శ్రద్ధాంజలి"అని అధికార రికార్డ్లో హిందీ అను వాదంచేశారని, "తుచ్ఛ శ్రద్ధాంజలి" అను పదం ఎంత హాస్యాస్పదమో వేరే చెప్పనవసరం లేదని శ్రీ విశ్వనాధంగారు అన్నారు.

ఇటువంటి అర్థం వచ్చేవిధంగా సంస్కృత పదాలు అనేకంహిందీ భాషా వాదులుప్రచారం లోకి తీసుకువస్తున్నారనీ వీటిని ఇతరభాషా ప్రాంతాలవారిపై రుద్దితే అది [illegible] తత్వం అనిపించుకుంటుందని శ్రీ విశ్వనాథం గారు అన్నారు.

రష్యన్ ట్రాక్టర్ల బ్లాక్ మార్కెటు

ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభకోణం

లక్నో, మార్చి 3

రష్యన్ ట్రాక్టర్లకు దేశంలో మంచి డిమాండ్ ఉన్నది దీనిని పురస్కరించుకొని ఉత్తర ప్రదేశ్‌లో ఈ ట్రాక్టర్ల అమ్మకంలో పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెటు కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది.

ఈ ట్రాక్టర్లను సోవియట్ నుండి స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ దిగుమతి చేసుకున్నది. వీటిని కేవలం వ్యవసాయ పనులకోసమే వినియోగించాలని కేంద్రవ్యవసాయ మంత్రిత్వశాఖ ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చినప్పటికి వీటిని ఇతర విధాలయిన పనుల కోసం కూడా ఉపయోగిస్తున్నారు. దీని ఫలితంగా ఈ ట్రాక్టర్ల అమ్మకం విషయంలోభారీఎత్తున బ్లాక్ మార్కెట్ సాగుతున్నది.

ఈ ట్రాక్టర్ ఒక్కొంటికి అధికార ధర రు 3500/- దేశంలో అతిచౌకగా లభ్యమయ్యే ట్రాక్టర్లు ఇవే కాని ఒక్కొక ట్రాక్టరును ఆరువేల రూపాయలకు పైగా బ్లాక్ మార్కెట్టులో అమ్ముతున్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో మున్సిపాలిటీలన్నీ ఈ ట్రాక్టర్లను చెత్త మోసుకుపోయేందుకుగా వినియోగిస్తున్నట్లు బి. పి. ఐ వార్తా సంస్థ తెలుపుతున్నది.

[illegible] పరికరాలను ఒకచోటనుండి మరొకచోటికి తీసుకెళ్ళడానికి వీటివాడుదురు. పబ్లిక్ వర్క్స్ శాఖకూడా ఈ ట్రాక్టర్లను కొన్నాయి.

ఇటీవల ప్రధాని శాస్త్రి లక్నోలో పర్యటించిన సందర్భంలో భారతదేశంలో 'కృషిపండిట్'కు ఒక ట్రాక్టరును బహూకరించారు. ఈ ట్రాక్టరును ఇక్కడ స్థానికాధికారులు స్వాధీనం చేసుకోలేదు. ఇది ప్రదర్శనశాలలో యింకా అలాగే వుంది.

ఈ ట్రాక్టరును బహూకరించే సమయంలో జరిగిన సభలో ప్రధాని శాస్త్రి ప్రసంగిస్తూ ఈ ట్రాక్టర్ల ఉపయోగాన్ని గురించి తాను దర్యాప్తు చేస్తానని మాటయిచ్చారు. ఈ ట్రాక్టర్లు చౌకే గాదు, వాటి ధరనుకూడా రూపాయలలోనే చెల్లించవచ్చు. సోవియట్ సహకారంతో ఒక ప్రయివేటు ఫ్యాక్టరీ ఈ ట్రాక్టర్లను భారత దేశంలోనే తయారు చేయడానికి పూనుకొన్నది. ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలం కేటాయించి, దానికి కావలసిన విద్యుచ్ఛక్తి వగైరా సరఫరా చేసినప్పటికీ ఈ ఫ్యాక్టరీ నిర్మాణం మాత్రం ప్రారంభమవలేదు.

పాకిస్తాన్‌చే అమెరికా ఆయుధాల వినియోగం

న్యూఢిల్లీ, మార్చి 2

పాకిస్తాన్ మన సరిహద్దులలో అమెరికా తన కిచ్చిన ఆయుధాలను వినియోగిస్తున్నదని భారత ప్రభుత్వం చేసిన ఫిర్యాదును అమెరికా వారింకా పరిశీలిస్తూనే వున్నారని నేడు లోక్‌సభలో విదేశాంగ శాఖ ఉప మంత్రి చెప్పారు.

ముతకరకం వస్త్రాల ధరలు

న్యూఢిల్లీ, మార్చి 2

ముతక, మధ్యరకాల కంట్రోలువస్త్రాలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ ఫిబ్రవరి 27 న కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి చేసిన ప్రకటనవల్ల నిన్నటి నుండి ఉత్పత్తి కాబడే అద్దకం, రంగు, ఫెనిషింగ్, బ్లీచింగ్ కంట్రోలు వస్త్రాల ధరలు 2 శాతం నుండి 7 శాతంవరకు తగ్గుతాయని తలుస్తున్నారు.

మరో వారంలోనే చైనా చే ఆటంబాంబు పరీక్ష?

గౌహతి మార్చి 2

మరోవారం పదిరోజులలోనే జన చైనా మరొక ఆటంబాంబు పాటవ పరీక్ష జరిపినా తనకు ఆశ్చర్యం కలుగబోదని అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ నేడిక్కడ అన్నారు.

బౌల్స్ నేడిక్కడ ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ,చైనా గత అక్టోబరులో జరిపిన అణ్వస్త్ర పరీక్ష ఆకాశంలోగానీ భూమిలోగానీ జరిపిందిగాదని స్థిరంగా ఒక ప్రదేశంలో ఉంచి ప్రేల్చారనీ అన్నారు.

అయితే మరో వారం పదిరోజుల్లోనే చైనా నిజమైన ఆటంబాంబును పరీక్షించ వచ్చునని చెప్పారు.

పంజాబ్ కాంగ్రెస్‌లో ముఠాతగవులు

శాసనసభ పార్టీసమావేశంలో తీవ్ర వాగ్యుద్ధం

చండీఘర్, మార్చి 2

పంజాబ్ కాంగ్రెస్ శాసన సభా పక్షం సమావేశంలో ఆరోపణలు - ప్రత్యారోపణలతో వాగ్యుద్ధం చెలరేగి గల్లంతుగా తయారైంది.

నేటి సాయంత్రం 2 గంటల 15 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో చర్చించడానికి ఎజెండా అంటూ ఏమీ లేదు. ఈ సమావేశానికి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ టి మనియన్ హాజరయ్యారు.

పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ భగవత్ దయాళ్‌శర్మ ప్రసంగిస్తూ శ్రీ రామకిషన్ మంత్రివర్గంలోని కొంతమంది సభ్యులు రాష్ట్రకాంగ్రెస్ కమిటీని 'తందాన తాన' సంఘ అని అపహాస్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు మంత్రివర్గంతో ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ సహకరించలేదని తరచుగా ఆరోపణలు చేస్తున్నారనీ అన్నారు.

రాష్ట్రంలో జరిగిన రెండు ఉపఎన్నికలలో కాంగ్రెసు గెలవడం కాంగ్రెసు సంస్థకున్న చరిత్ర ప్రభుత్వకృషి మూలంగానే కానీ, రాష్ట్ర కాంగ్రెసు కృషివల్ల కాదనికూడా అంటున్నారని, ఇది ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ ప్రతిష్ఠను తగ్గిస్తున్నదనికూడ ఆయన అన్నారు.

సమావేశం సవాళ్ళు, అడ్డు సవాళ్ళతో గల్లంతుగా తయారైంది. సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి పలుమార్లు సభ్యులను ప్రశాంతంగా ఉండవలసినదిగా కోరినప్పటికీ ఉపయోగంలేకపోయింది.

రామకిషన్ మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో కూడా రాష్ట్రకాంగ్రెస్ సభ్యులకు ముఖ్యమంత్రి ఆహ్వానంపంపలేదని శ్రీ భగవత్‌దయాళ్‌శర్మ ఆరోపించారు.

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీని కైరాన్ ముఠాగా చిత్రిస్తున్నట్లు ఆరోపించారు.

మాజీ హోంమంత్రి శ్రీ మోహన్‌లాల్ మాట్లాడుతూ కైరాన్ హత్యకేసు దర్యాప్తును కేంద్ర రహస్య పరిశోధకశాఖకుఅప్పగించవలసిందిగాకోరుతూప్రధానమంత్రికి 60మందిశాసన సభ్యుల సంతకాలతోకూడిన రాయబారం పంపిన సందర్భాన్ని పురస్కరించుకొని తన పేరు ఎత్తకుండా శ్రీ రామకిషన్ ఒక మీటింగులో తనపై దాడి సాగించారని అన్నారు.

కొంతమంది కాంగ్రెసు సభ్యులు ప్రతిపక్షాలతో మిలాఖతైనట్లు శ్రీరామకిషన్ ఆరోపించారని కానీ కొంతమంది మంత్రులే ప్రతిపక్షంతో మిలాఖతైనారని ప్రత్యారోపణ చేశారు.

సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీరామచంద్ర మాట్లాడుతూ పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ 'తందానతాన'సంఘ అన్నారు. కైరాన్ కీర్తి ప్రతిష్ఠలపై విమర్శ సాగడమే ఈ హత్యకు మూలమని తాను అంగీకరించనన్నారు. ఈ ఘటనకు కైరాన్ ప్రభుత్వం అనుసరించిన దమననీతి కారణమన్నారు.

[illegible] కైరాన్ [illegible]

మిలాఖత్ అవుతున్నారనీ గవర్నరు ప్రసంగం సమయంలో కొంతమంది సభ్యులు చేసిన విమర్శలు మంత్రివర్గంపై అవిశ్వాస ప్రకటన తరహా వెళ్ళాయనీ ఆయన అన్నారు.

విద్యామంత్రి శ్రీ ప్రబోధచంద్ర మాట్లాడుతూ కొంతమంది కైరాన్ ముఠా వారు తనపైనా, ముఖ్య మంత్రిపైనా కేంద్రానికి ఫిర్యాదులు చేశారనీ, వాటిలో శతాంశమైనా వారు రుజువు చేయగలిగితే తన మంత్రి పదవికీ, శాసనసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేయగలనని సవాల్ చేశారు

పి. సి. సి 'తందానతాన' సంస్థేననికూడా ఆయన అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో వున్నసభ్యుల్లో ఎక్కువమంది అసలు కాంగ్రెస్ వారేనా అనికూడా అన్నారు.

తిరిగి రాత్రి మరొక సమావేశం జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

మద్రాసు రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సప్లయికి ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వం రు 186 లక్షలు కేటాయించింది.

స్టెయిన్‌లెస్ స్టీల్ కోటాలలో బ్లాక్ మార్కెట్

పరిశీలనకు అనధికార కమిటీని నియమించాలని శాసనసభలో పలువురి డిమాండ్

('విశాలాంధ్ర' విలేకరి)

హైదరాబాద్, మార్చి 3

స్టెయిన్‌లెస్ స్టీల్ కోటాలలో పెద్ద ఎత్తున బ్లాక్‌మార్కెట్ జరుగుతున్నదని శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో నేడు పలువురు సభ్యులు ఆరోపించారు.

పరిశ్రమల శాఖలోని కొందరు అధికార్ల వత్తాసుబ్లాక్ మార్కెట్టుదార్లకులభిస్తున్నదని కొందరు సభ్యులు ఆరోపించారు ఈ అవినీతి, అవకతవకలను గురించి విచారించడానికి అనధికార కమిటీని ఒక దానిని నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు.

శ్రీ సి. అయ్యపురెడ్డి అడిగిన ప్రశ్నకు ఆర్థిక, పరిశ్రమలశాఖ మంత్రి చెన్నారెడ్డి సమాధానం చెపుతూ, రాష్ట్రావసరాలకు 69 లక్షల టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్ అవసరమని అన్నారు. అయితే ఖచ్చితంగా ఇంత కోటా అని రాష్ట్రానికి కేటాయించలేదని చెప్పారు.

సాధారణంగా ప్రతిరాష్ట్రానికి కొంత విదేశీ మారక ద్రవ్యం కేటాయించటం జరుగుతుందని, దానినుండి స్టెయిన్‌లెస్ స్టీల్ కోసం కేటాయింపు జరుగుతుందని అన్నారు.

1963-64 సంవత్సరంలో రాష్ట్రానికి 34 లక్షల రూపాయల మేరకు విదేశీ మారకం కేటాయించటం జరిగింది, అందులో 19 లక్షలు స్టెయిన్‌లెస్‌స్టీల్‌కు కేటాయించారని అన్నారు.

1958-59 లో వున్న అవసరాలను ప్రాతిపదికగా తీసుకొని 1963-64కు ఈ కేటాయింపు జరిపామని అన్నారు

ప్రశ్న : రాష్ట్రానికి వస్తున్న స్టెయిన్‌లెస్ స్టీల్ బ్లాక్ మార్కెట్టుకు పోతున్న సంగతి ప్రభుత్వానికి తెలుసా? స్టెయిన్ స్టీల్ సామాగ్రి తయారీకి దానిని వినియోగించడని సంగతి ప్రభుత్వ దృష్టికి వచ్చిందా?

మంత్రి : ఈ విషయమై ప్రభుత్వం ఎటువంటి దర్యాప్తు చేయలేదు. అసలు కేటాయించిన స్టెయిన్‌లెస్‌స్టీల్, ఉత్పత్తి అవసరాలకు కనీసంగానయినా చాలదు. అందువల్ల దిగుమతి లైసెన్సులు ఉన్నవారు దిగుమతి చేసుకుంటే వారి దగర ఉత్పత్తిదార్లు తమ కవసరమయిన స్టెయిన్‌లెస్‌స్టీల్‌ను మార్కెట్‌లో కొనుక్కొంటున్నారు.

ప్రశ్న : దిగుమతి చేసుకున్న ధరకంటే దానిని నాల్గయిదురెట్లు అధికంగా అమ్ముతున్న సంగతి తెలుసా?

మంత్రి: దిగుమతిరేటు టన్నుకు 8.6 వేల రూపాయలు, స్టెయిన్‌లెస్‌స్టీల్ వస్తువుల ధర టన్ను 18 22 వేలు వుంది. ప్రభుత్వం కేటాయించిన విదేశీ మారకం 7 వేలటన్నుల వస్తువులకు సరిపడ ముడిసరుకు కొనడానికే సరిపోయింది. అందువల్ల ఉత్పత్తిదార్లు బయట మార్కెట్టులో ముడిసరుకు కొనవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. లేకపోతే ఫ్యాక్టరీలు సంవత్సరం అంతా పనిచేయలేవు.

వావిలాల : ఆంధ్రరాష్ట్రానికని కోటాయిస్తే, అవి బయట అమ్మటం జరుగుతున్నది.

మంత్రి : నిర్దిష్టంగా ఏమైనా కొన్ని సందర్భాలు చెబితే విచారణ చేస్తాం.

శ్రీకృష్ణ : సామర్లకోట పారిశ్రామిక వాటికలోని ఒక పరిశ్రమకు కేటాయించిన స్టెయిన్‌లెస్‌స్టీల్ మద్రాసులో అమ్మిన సంగతి మంత్రిగారికి తెలుసునా? స్టెయిన్‌లెస్‌స్టీల్‌కు బ్లాక్‌మార్కెట్టులో మంచి గిరాకీ ఉన్న దృష్ట్యా ఇతరత్రా ప్రత్యేక రకం ఉక్కును దిగుమతి చేయనిమాట వాస్తవమా? అందువల్ల ప్రత్యేక రకం ఉక్కు కావలసిన పరిశ్రమలు ఇబ్బందులకు గురికావటంలేదా?

మంత్రి: సామర్లకోటలోని పారిశ్రామికవాడ విషయంలో ప్రత్యేకంగా నోటీసు యిస్తే విచారణ జరుపుతాను. ఈసంవత్సరంస్టెయిన్ లెస్‌స్టీల్ కోటాపై అంకుశం పెట్టడం జరిగింది.

శ్రీకృష్ణ: స్టెయిన్‌లెస్‌స్టీల్ బ్లాక్‌మార్కెట్ గురించి విచారణ జరపడానికి ప్రభుత్వం అనధికార కమిటీని నియమిస్తుందా?

మంత్రి: అవసరంలేదు పారిశ్రామిక సలహాసంఘం ఈవిషయాన్ని పరిశీలించగలదు. ఏమయినా శాసనసభ్యులు ఎవరయినా ఒక నిర్దిష్ట ఆరోపణ చేస్తే, పరిశ్రమల అధికారిని వెంటనే ఆ విషయమై దర్యాప్తు జరపమని కోరతాను.

వావిలాల: ఆరోపణలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినపుడు ప్రభుత్వం ఎలా విచారణ జరుపుతుంది?

స్పీకర్: ఉత్పత్తిదార్లు కూడా చాలా తెలివైనవాళ్ళు. వాళ్ళకు ఒకఉత్పత్తిపరిశ్రమ అంటూ వుంటుంది. అధికార్లు దర్యాప్తుకు వెళ్ళినప్పుడు అక్కడ ఏవో కొన్నివస్తువులు చూపిస్తారు. అంతేగాకుండా అధికారులు ఎప్పుడు వచ్చేదీ వాళ్ళకు ముందే తెలియజేసే

(మిగతా 6వ పేజీలో)

విశాలాంధ్ర

ధరల పెరుగుదలకనుగుణంగా కరువు భత్యం

ప్రదేశ్ శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదనలను చేస్తూ ఆర్థిక మంత్రి డాక్టరు చెన్నారెడ్డి, ఎన్. జి. వోల వేతనాల పరిశీలనకై ఏకసభ్య కమిషన్‌ను నియమించనున్నట్లు ప్రకటించారు. 1964 లో రెండు దఫాలుగా ఎన్. జి. వోల కరువుభత్యం పెంచామని కూడా ఘనంగా చెప్పుకున్నారు

ఎన్. జి. వోల కోర్కెలకు ప్రభుత్వ ప్రతిపాదనలకు ఎట్టి సామ్యమూ లేదు. రోజు రోజుకూ పెరిగిపోతున్న ధరల కనుగుణంగా కరువుభత్యం నిర్ణయించాలని, ఈలోగా కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్న కరువుభత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు కూడా ఇవ్వాలనేది వారి కోర్కె. ఇది ఎంతో సవ్యమైనది

వేతనాల పరిశీలనకై ఏకసభ్య కమిషన్‌నుగాక, ఉద్యోగుల ప్రతినిధులతోకూడా కలుపుకొని, ముగ్గురు లేక అయిదుగురు సభ్యులతో కమిషన్‌ను నియమించాలని ఎన్. జి. వోల సంఘం కోరుతున్నది

ఎన్. జి. వో. లకు కరువుభత్యాన్ని మంజూరుచేసే విషయంలో పొరుగు రాష్ట్రాలకంటె కూడా ఆంధ్రప్రభుత్వం ఎంతో వెనుకబడి ఉంది. మద్రాసు ప్రభుత్వం ఈ ఏటి బడ్జెట్‌లో అన్నిస్థాయిలలోనూ రాష్ట్రఉద్యోగుల కరువుభత్యాన్ని పెంచింది. నూరు రూపాయల నెలసరివేతనం ఉన్న ఉద్యోగి మొదలుకొని వేయిరూపాయల ఆఫీసరువరకు - అందరికీ ఈ పెరుగుదల వర్తిస్తుంది. ఈ పెరుగుదల రేట్లు ఆంధ్రప్రభుత్వం మంజూరు చేసినవాటికంటె - 8 రూపాయల నుండి 22 రూ॥ల వరకు హెచ్చుగా ఉన్నాయి.

అంతేకాదు. ఒకే నగరంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు కరువుభత్యానికి సంబంధించినంతవరకూ ఎట్టి వ్యత్యాసమూ ఉండరాదనే సూత్రాన్ని మద్రాసు ప్రభుత్వం ఆమోదించింది ఆ సూత్రాన్ని అమలు జరపటానికి అవసరమైన ధన సహాయాన్ని చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నామని కూడా మంత్రి వెంకట్రామన్ మద్రాసు శాసనసభలో ప్రకటించారు

మైసూరు, మహారాష్ట్రవంటి ఇతర రాష్ట్రాలలో సైతం, ఉద్యోగుల కరువుభత్యం రేట్లు ఆంధ్రకంటె మెరుగుగా వున్నాయి.

కనుక గత సంవత్సరం రెండు పార్లు ఉద్యోగుల కరువుభత్యం పెంచామని ఆంధ్ర ప్రభుత్వం సంతృప్తిపడి లాభంలేదు పొరుగు రాష్ట్రాలకంటె మన రాష్ట్రంలో ఎన్. జి. వోల కిస్తున్న కరువుభత్యం తక్కువగా ఉన్న విషయం గుర్తించాలి

ధరల పెరుగుదల సమస్య కేవలం ఆంధ్రకు మాత్రమే పరిమితమైనది కాదు యావద్దేశానికి సంబంధించినది ధరల పెరుగుదల దుష్ఫలితాలను ఎన్. జీ. వో. లు, ఉపాధ్యాయులు మాత్రమే గాక, నెలసరి వేతనాలు పొందే యావత్ ప్రజానీకం అనుభవిస్తున్నారు.

కనుకనే ఈ సమస్యపై దేశవ్యాపిత ఆందోళన సాగుతున్నది.

పశ్చిమబెంగాల్ శాసనసభ ఎదుట, రాష్ట్ర ఉపాధ్యాయులు తమకు కనీసం 50 రూపాయల కరువుభత్యమైనా పెంచాలనే కోర్కెపై ప్రదర్శనలు, పైకాయింపు సమ్మెలు చేస్తున్నారు.

అన్ని రాష్ట్రాలలోనూ, ఉద్యోగులలోనూ, పారిశ్రామిక కార్మికులలోనూ ఈ సమస్యపై తీవ్ర ఆందోళన ఏర్పడుతున్నది

కేంద్ర ఆర్థికమంత్రి కృష్ణమాచారి లోకసభలో సమర్పించిన నివేదికలోనే ధరల పెరుగుదల స్వరూపం కొంతవరకు వ్యక్తమైంది.

ఆయన సమర్పించిన నివేదిక ననుసరించి, అన్ని వస్తువుల టోకు ధరలు 1962 నుండి 1965 వరకు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. 1964 సెప్టెంబరులో ఈ సూచి 159 7కు చేరుకున్నది అక్టోబరుకు 155 8 కి తగ్గింది తిరిగి డిసెంబరు వెలకల్లా 159 2 కు చేరుకున్నది

ధరల పెరుగుదల శాతాలను లెక్కగట్టటంలో ప్రభుత్వం నిజాయితీని ప్రదర్శించటంలేదు అక్టోబరులో 155 8 గా ఉన్న ధరల సూచి ఆధారంగా, ఆర్థిక మంత్రి లెక్కలు గడుతున్నారు. ఆ క్రితంనెల సూచిని గాని, డిసెంబరు సూచినిగాని పరిగణించటం లేదు

అదే విధంగా వినిమయవస్తువుల ధరల సూచిని లెక్కగట్టడంలో వివిధ నగరాలలోనూ ప్రభుత్వం నియమించిన కమిటీలు లోపభూయిష్టమైన విధానాలు అవలంబిస్తున్నాయి ఈ లోపాలను తొలగించి, సక్రమ పద్ధతిలో ధరలసూచిని లెక్కగట్టాలనే కోర్కెను సాధించేందుకు, బొంబాయి అహమ్మదాబాద్‌లలో కార్మికవర్గం 1963-64లో తీవ్ర పోరాటాలు చేయవలసివచ్చింది. ఆ పోరాటాల ఫలితంగా ఆ రెండు నగరాలకు సంబంధించినంతవరకు లోపం సవరించబడ్డదేగాని, ఇతర రాష్ట్రాలలోనూ, నగరాలలోనూ ఈ మోసం కొనసాగుతూనే ఉంది.

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన లెక్కల ననుసరించే వినిమయ వస్తువుల ధరల సూచి, 1962-64 లో 28 శాతం పెరిగింది అందులోనూ ఆహార పదార్థాల ధరలసూచి పెరుగుదల 35 శాతం వరకూ ఉన్నది

సక్రమమైన అంచనాల ప్రకారమైతే, ఈ అంకెలు ఇంకా ఎక్కువగానే ఉంటాయి.

ధరల పెరుగుదలను నిరోధించడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎట్టి చర్యలూ తీసుకోవటంలేదు

పంట తరుణంలో ఆహార ధరలు తగ్గవలసి ఉన్నప్పటికీ, సరుకు మార్కెట్లోకి తగినంతగా రానందున ధరలు తగ్గుముఖం పట్టడంలేదని ఒక వైపున కేంద్ర ఆర్థిక మంత్రి అంగీకరిస్తున్నారు, ఐనా ఆహార కార్పొరేషన్ స్థాపనవంటి కొద్దిపాటి చర్యలద్వారానే ధరలు తగ్గుముఖం పట్టగలవంటూ మోసపు ప్రకటనలు చేస్తున్నారు.

ప్రభుత్వ విధానాలు ఇలాగే సాగినంతవరకు ధరలు పెరుగుతూనే ఉంటాయి. ధరలు పెరుగుతున్నంత వరకూ, ఆ పెరుగుదల కనుగుణంగా కరువుభత్యాన్ని పెంచాలనే న్యాయమైన కోర్కె కొరకు కార్మికులు, ఉద్యోగులు, తదితర మధ్యతరగతి ప్రజానీకం ఆందోళన సాగిస్తూనే ఉంటారు

ఈ విషవలయంనుండి బైట పడాలంటే, ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని బ్యాంకులను, ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని జాతీయం చేయడంవంటి గుత్త వ్యతిరేక చర్యలను ప్రభుత్వం చేపట్టాలి కాని ఆ ధోరణి కేంద్రంలో కనపడటంలేదు

కనుక ధరల పెరుగుదల కనుగుణంగా కరువుభత్యాన్ని మంజూరు చేయటం, ఒకే ప్రాంతంలో పనిచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఒకే రకమయిన కరువుభత్యాన్ని మంజూరుచేయటం అనే రెండు కనీస కోర్కెలను ప్రభుత్వం తక్షణమే అంగీకరించాలి.

వినిమయ వస్తువుల ధరలసూచిని తయారు చేయటంలో జరుగుతున్న మోసాన్ని సవరించటానికి ప్రభుత్వం కృషి చేయాలి.

ఇందుకుగాను ఆంధ్రరాష్ట్రప్రభుత్వం ఒకసంఘాన్ని నియమించింది కాగా అందులో కార్మిక ప్రతినిధిగా, అధిక సంఖ్యాక కార్మికులకు ప్రాతినిధ్యం వహించే ఎ ఐ టి.యు సి.కి కాక మూడో స్థానంలో వున్న హింద్ మజ్దూర్ సంఘానికి స్థానం కలిగించింది

ఏ పనిచేసినా అరకొరగా, వివక్షతో బలవంతాన, తప్పనిసరై చేయటమే కాని, ఒక సూత్రమూ, ఒక పద్ధతీ ప్రభుత్వానికి లేనేలేవు.

పై న్యాయమైన కోర్కెల సాధనకై కార్మిక, మధ్యతరగతి ప్రజానీకం అంతా ఐక్యంగా ఆందోళన చేసినపుడే, ప్రభుత్వం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానాలను మార్పించటం సాధ్యం.

శ్రీ సుబ్రహ్మణ్యం ఆస్ట్రేలియా పర్యటన

న్యూఢిల్లీ మార్చి 2

కేంద్ర ఆహారశాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం ఏప్రిల్ మొదటివారంలో ఆస్ట్రేలియా పర్యటనకు వెడతారు.

బడ్జెట్ "లో వెలుగులు":

రాష్ట్రంలో నిరుద్యోగ తీవ్రత: ఆర్థిక మంత్రి ఆత్మ సంతృప్తి వైఖరి

నిరుద్యోగంతో విసిగి వేసారి యువకులు ఆత్మహత్యలు చేసుకుంటూంటే "నిరుద్యోగ పరిస్థితి "కొంత మెరుగైంద"ని రాష్ట్ర ఆర్థిక మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి ఈనెల 24 వ తేదీన తమ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఇది ఆత్మ వంచనే కాదు. రాష్ట్ర ప్రజలనే వంచించటం అవుతుంది

(విశాలాంధ్ర ప్రత్యేక విలేకరి)

కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టడంతో రాష్ట్రంలో వివిధ సమస్యల పరిష్కారానికి కొత్త సంవత్సరంలో జరిగే ప్రయత్నాలు ఏమిటి? ప్రభుత్వం అందుకు ఏ విధంగా కృషిచేయదలచుకుంది? అందుకు ఎంతనిధి కేటాయించ బోతున్నది మున్నగు ఆలోచనలు ప్రజలందరి దృష్టిలోను ఉంటాయి,

గత సంవత్సరం జరిగిన కృషిని వివరించి జరపబోయే కార్యక్రమాలను వివరించటం ప్రభుత్వవిధి వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచడంకూడా ప్రభుత్వాధిపతుల కర్తవ్యం.

కాని ఆర్థికమంత్రి శ్రీ చెన్నారెడ్డిగారు తమ బడ్జెట్ ప్రసంగంలో నిరుద్యోగ సమస్యను ప్రస్తావించిన విధమూ, ఆ విషయంలో ప్రభుత్వం కృషిని చేసిన ఉటంకించిన విధమూ చూస్తే ప్రజల సమస్యలపట్ల ప్రభుత్వం ఎంత అలక్ష్యంగానూ, ఏమరుపాటుగానూ ప్రవర్తిస్తుందో బోధపడుతుంది, రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను మరుగుపరచడానికి, అసలు సమస్యను దాటవేయడానికి ప్రభుత్వాధినేతలు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతూంది.

"నిరుద్యోగ పరిస్థితి కొంతవరకు మెరుగు పడిందని చెప్పవచ్చు" అని ఆర్థిక మంత్రి తమ ప్రసంగంలో అన్నారు. ఆ మరుగాను ఆయన చిన్న అంకెలగారడీచేశారు. ఉద్యోగ సాధక కేంద్రాల ద్వారా 37 వేల 577 మందికి ఈ సంవత్సరం ఉద్యోగాలు దొరికాయనీ, గత సంవత్సరం 28 వేల 683 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయనీ, అంటే 9 వేల మందికి పైగా ఉద్యోగాలు అదనంగా లభించాయనీ అన్నారు దీనిని ఒక అభివృద్ధిగా ఆర్థికమంత్రి చెప్పుకోవటం నిజంగా సాహసమేనని చెప్పాలి.

చిన్న ఉద్యోగానికి వేల దరఖాస్తులు

ఒక చిన్న ఉద్యోగానికి వేలకు వేలు దరఖాస్తులువచ్చి పడుతున్న ఉదంతాలు నిత్యం మనం పత్రికలలో చూస్తున్నాము. సెకండరీ విద్యవరకు చదివిన బాలురువారి [illegible] గ్రాడ్యుయేట్లు, కొల్లలుగా దరఖాస్తులు పెడుతున్నారు. రాష్ట్రంలో యింటికొక నిరుద్యోగి ఉన్నాడంటే అందులో అతిశయోక్తి ఏమున్నట్లు? నిరుద్యోగులతో విసిగివేసారి ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలుకూడా ఎన్నో ఉన్నాయి ఇటీవల విజయవాడలో ఇటువంటి ఆత్మహత్య ఒకటి జరిగింది.

ఇది విద్యాధికులైన వారి సంగతి సాంకేతిక శిక్షణకలిగిఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో దరఖాస్తులు పెట్టగల్గిన వారిసంగతి. విద్య నేర్వనివారు శారీరక పనిచేసేవారు. గ్రామసీమల్లో సంవత్సరానికి ఆరునెలలు పని ఉంటే ఆరునెలలు పనిలేని అసంఖ్యాకమైనవారిసంగతి వేరే చెప్పనవసరంలేదు.

ప్రధానంగా వ్యవసాయిక రాష్ట్రంగా ఉన్న మన రాష్ట్రాన్ని పారిశ్రామిక వంత మొనర్చి, తద్వారా నిరుద్యోగ సమస్యనుమూలంగా పరిష్కరించవలసిందిపోయి సమస్యను ఆ దృష్ట్యా పరిశీలించడం పోయి మంత్రి ఆత్మ సంతృప్తి వెలిబుచ్చడం శోచనీయం

రాష్ట్రంలో నిరుద్యోగ పెనుభూతం ఏ విధంగా విజృంభించిందో ప్రభుత్వ లెక్కలను బట్టే రుజువు అవుతూంది.

మూడవ ప్రణాళికలో

రాష్ట్రంలో నాల్గవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా తయారుచేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నివేదికలను తయారు చేయించింది. (వర్కింగ్ పేపర్స్ ఆన్ ది ఫోర్త్ ఫైవ్ ఇయర్ ప్లాన్)

రాష్ట్ర ప్రణాళిక సంఘం తరపున విడుదల చేసిన ఈ సమాచార పత్రాల ప్రకారం మూడవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభానికి మన రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 3 లక్షల 75 వేలు. మూడవ ప్రణాళిక అయిదేళ్ళలోను మరో 12 లక్షల 50 వేల మంది.

ఉద్యోగాల అన్వేషకులుగా తయారవుతారు. అంటే తృతీయ ప్రణాళిక అవధిలో 16 లక్షల 34 వేల మందికి ఉద్యోగాలు చూపించాలి. కాని ప్రభుత్వ అంచనాల ప్రకారమే మూడవ ప్రణాళిక కాలంలో 10 లక్షల 79 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు చూపించగలుగుతారు. అంటే మూడవ ప్రణాళికా కాలానికి 5 లక్షల 55 వేల మంది నిరుద్యోగులుంటారు. అంటే 1లక్ష80 వేలమంది నిరుద్యోగులు అభివృద్ధి చెందుతారన్నమాట.

పంచవర్ష ప్రణాళికలవల్ల దేశంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో నిరుద్యోగసమస్యా పరిష్కారం ఈషణ్మాత్రం జరగటంలేదనే, రాష్ట్ర ప్రణాళికా సంఘం లెక్కలు నిరూపించుతూంటే, రాష్ట్ర ఆర్థిక మంత్రి తమ బడ్జెట్ ప్రసంగంలో పరిస్థితి కొంత మెరుగైందని చెప్పటానికి మరి ఎవరిని వంచన చేయడానికే అని ప్రశ్నించక తప్పదు.

గ్రామసీమలలో మరింత ఘోరపరిస్థితి

పట్టణాల, మధ్యతరగతి ప్రజల సంగతి ఇలా ఉంటే, ఇక గ్రామసీమల సంగతి ఎలా ఉందో చూదాం. నేషనల్ శాంపుల్ సర్వేవారు ఆంధ్రప్రదేశ్ గురించి వివరించిన విషయాలు ఇదే ప్రచురణలో ఇలా ఉన్నాయి.

ఆంధ్ర ప్రదేశ్ గ్రామసీమల్లో 15-59 సంవత్సరాలమధ్య వయస్సుగల్గిపనిచేసుకోగల దారుఢ్యం ఉన్నవారు 1 కోటి 14 లక్షల 36 వేలమంది ఉన్నారు. (1961 జనాభా లెక్కల ప్రాతిపదికపై) ఇందులో దాదాపు కోటి మందికి పని ఉన్నట్లు అనుకుంటే, అందులో 3 లక్షల 40 వేలమందికి ఇంచుమించు పనిపాట లేకుండా ఉన్నారట ఒక మోస్తరుగా పని తక్కువైనవారు 4 లక్షల 80 వేలమంది ఉన్నారట. 13 లక్షల 70 వేల మంది అదనపు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారట, కాని వారికి పని దొరకటంలేదట.

అంటే 22 లక్షల మందికి ఒకపూట పని ఉంటే మరోపూట పనిలేదన్నమాట. సంవత్సరంలో ఆరునెలలు పని ఉంటే ఆరునెలలు పనిలేదు. అంటే వీరు అర్ధాకలితో, పస్తులతో జీవించుచున్నారు

గ్రామసీమల్లో చేదామంటే పనిలేని వారి సంఖ్య ఇంత ఎక్కువగా ఉందన్నమాట.

ఇక పట్టణాలలో ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలలో ఉద్యోగాలకోసం దరఖాస్తులు పెట్టుకొంటున్న లెక్కలు చూసినా రాష్ట్రంలో నిరుద్యోగ పరిస్థితి నానాటికి విషమించు చున్నట్లే స్పష్టమవుతూంది.

ప్రణాళికా సంఘం ప్రచురించిన ఈ సమాచార పత్రాల ప్రకారమే 1961 మార్చి 31 తేదీనాటికి ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి రిజిష్టర్లలో ఉద్యోగాన్వేషకుల సంఖ్య 1 లక్ష 2 వేలు. 1962 మార్చి 31 నాటికి ఈ సంఖ్య 1 లక్ష 8 వేలకు పెరిగింది. 1963 మార్చి 31 వ తేదీనాటికి 1 లక్ష 31 వేలకు పెరిగింది

1961-62 ఉద్యోగాన్వేషకుల సంఖ్య 3 4 శాతం హెచ్చితే 1962-63 24 3 శాతం అంటే దాదాపు 7½ రెట్లు ఎక్కువైందన్నమాట, విశాఖ, శ్రీకాకుళం, హైదరాబాద్‌లలో ఈ నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా హెచ్చిపోవడంవలన ఇంత ఎక్కువ శాతం పెరిగిందట

నాల్గవ ప్రణాళిక ప్రారంభానికి (1965-66) రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 6 లక్షల 65 వేలు అయితే నాలవ ప్రణాళికా కాలంలో మరో 19 లక్షల 70 వేల మంది అదనంగా ఉద్యోగాన్వేషకులు తయారవుతారని రాష్ట్ర ప్రణాళిక సంఘం అంచనా. అంటే నాలవ ప్రణాళికాంతానికి 19 లక్షల 26 వేల మందికి ఉద్యోగాలను కల్పించాలి.

ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలలో పేర్లు నమోదు చేసుకుంటున్న దానిని బట్టి వేసిన అంచనా ఇది వాస్తవపరిస్థితులు, ఇంతకంటె అధ్వాన్నంగా ఉంటాయనడం నిస్సందేహం.. మరి రాష్ట్ర ఆర్థికమంత్రి వాస్తవ పరిస్థితిని తెలియజేస్తున్నారో, మరుగుపరచుస్నారో వేరే చెప్పనవసరంలేదు. అసలు ఏ ఉద్యోగానికి రికమండేషన్లబాధ అనేకసందర్భాలలో లంచాలబాధలేదో [illegible]

కేరళ ఓటర్లలో ఉత్సాహ శూన్యత

అతివాద ఐక్యసంఘటన సమారోహంలో శ్రీ ఎం. ఎన్. గోవిందన్‌నాయర్ హెచ్చరిక

త్రివేంద్రం, మార్చి 2

రాష్ట్రమంతటా నిన్నరాత్రి అన్నిపార్టీలవారూ తమ తమ ప్రచారాన్ని ముగిస్తూ బ్రహ్మాండమైన ప్రజాసమారోహాలు జరిపారు మార్చి 4 న ఉదయం 7 గంటలకు కేరళ అంతటా ఎన్నికలు ప్రారంభమవుతాయి. నేటి మధ్యరాత్రి తర్వాత ఎన్నికల ప్రచారం జరపరాదని చట్టం నిషేధిస్తుంది

త్రివేంద్రం ఒకటవ నియోజకవర్గంలో అతివాద ఐక్యసంఘటన ఆధ్వర్యాన జరిగిన సమారోహంలో కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ ఎం ఎన్. గోవిందన్ నాయర్ ప్రసంగించారు. "కాంగ్రెసుకువోటు వేయడం రాష్ట్రంలో అస్థిర స్థితిని కోరుకోవడమే"నన్నారు. ఆయన, స్వాతంత్ర్యానంతరం రాష్ట్రంలో కాంగ్రెసు పరిపాలన చూస్తే అది సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పరచ లేదని తేలిపోయింది ఈ ఎన్నికలలోకాంగ్రెసుకు చెందని అభ్యర్థులను అధికసంఖ్యలోనిలిపినదిఅతివాదఐక్యసంఘటన ఒక్కటే. ఆ సంఘటన అభ్యర్థికే వోటువేసి విజయావకాశం కలిగించవలసింద"ని కోరారు శ్రీ నాయర్.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"గత ఎన్నికలలో మాదిరిగా కాదు. ఈ మారు ప్రజలలో ఉత్సాహం కనబడదు. ఎన్నికలలో పోటీచేస్తున్న ప్రధానమైన పార్టీలలో చీలికలు ఏర్పడటంచేతనయుండవచ్చు ఆ నిరుత్సాహం ఎన్నికల ఫలితాలను గురించి ఇదమిత్థమనిచెప్పలేకపోవడంకూడాకారణ కావచ్చు. 'కాని వయోజన వోటింగు హక్కు వుంది. ప్రతిఓటరూ తన వోటును వుపయోగించుకోవాలి. బాధ్యతాయుతంగాచేస్తారని కోరుతున్నాను."

సర్వారాయ టెక్స్టైల్స్ మేనేజ్‌మెంటుకూ, కార్మిక సంఘానికి ఒప్పందం

కాకినాడ మార్చి 1

కాకినాడలోని సర్వారాయ నూలు మిల్లు మేనేజ్‌మెంటుకూ, కార్మిక సంఘానికి ఒప్పందం కుదిరి. కార్మికసంఘం సమ్మెనోటీసు నుపసంహరించుకొంది

విశాఖపట్నం అసిస్టెంటు లేబరు కమిషనర్ ఫిబ్రవరి 27 న కాకినాడ వచ్చారు. ఫిబ్రవరి 8 వ తేదీన కార్మిక సంఘం ఇచ్చిన సమ్మె నోటీసులోని డిమాండ్లను(పారిశ్రామిక తగాదాల చట్టానికి చెందిన వానిని) ఐచ్ఛికమధ్యవర్తిత్వానికి పెట్టడానికి ఉభయ పక్షంవారూ అంగీకరించి 27 వ తేదీన ఒప్పందం మీద సంతకాలు పెట్టారు.

మేనేజిమెంటు తరపున ఫ్యాక్టరీ మేనేజరు శ్రీ యం. అచ్యుతరామయ్య స్పిన్నింగ్ మాస్టరు శ్రీ హుస్సేన్, చీఫ్ ఎక్కౌంటెంట్ శ్రీ నారాయణరావుగార్లు కార్మికుల తరపున సంఘం అధ్యక్షులు శ్రీ ఎం. భావనాచారి, ఉపాధ్యక్షులు శ్రీ వి. వి. ఎస్. డి. ప్రసాదరావు, కార్యదర్శి. సహాయ కార్యదర్శులు శ్రీ సి. హెచ్ వీరరాజు, శ్రీ కె కృష్ణారావు గార్లు ఒప్పందంమీద సంతకాలు పెట్టేరు

'గిరిజనుల ఇళ్లకు కోటి రూపాయలు కేటాయించాలి'

శాసనసభలో శ్రీ పనస రామన్న డిమాండ్

హైదరాబాద్. మార్చి 2

ప్రభుత్వం వాస్తవంగా గిరిజనుల సంక్షేమాన్ని కాంక్షించే పక్షంలో వారి గృహవసతికి కనీసం ఒక కోటిరూపాయల నైనా కేటాయించాలని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ పాలచర్ల పనసరామన్న నేడు శాసనసభలో డిమాండ్ చేశారు

నేడు శాసనసభలో రెండవరోజు బడ్జెట్‌పై చర్చ జరిగే సందర్భంలో శ్రీ పనసరామన్న మాట్లాడుతూ గిరిజనుల గృహవసతిపట్ల ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇలాగే కొనసాగితే ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి కనీసం వంద సంవత్సరాలైనా పడుతుందని అన్నారు ఇళ్లస్థలాల కేటాయింపుకు 20 సంవత్సరాల క్రితం దరఖాస్తులు పెట్టుకున్నా ఇంతవరకూ అతీగతీ లేని ఏసిద గ్రామ హరిజనుల ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంలో ప్రస్తావించారు.

"ఒక గుడిసెలోనే రెండు మూడు కుటుంబాలు తలదాచుకొంటున్న ఉదాహరణలు కొల్లలుగా వున్నాయి ఈ పరిస్థితి అమానుషం అసహ్యం. హరిజన పేటలలో పూరి పాకలు ఎక్కువగా క్రిక్కిరిసి వుండడం మూలంగా తరచుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి" అని అన్నారు.

ప్రభుత్వ విధానాల మూలంగా పేద ప్రజానీకం ఏలా ఇక్కట్లను గురిఅవుతున్నదీ ఆయన సోదాహరణంగా వివరించారు.

అంగర, ఇంజరం గ్రామాలలోని స్వర్ణకారుల దైన్య పరిస్థితిని ఉదహరిస్తూ ఆ గ్రామాలలో స్వర్ణకారులు అత్యధిక సంఖ్యలో కలసి ఏర్పరచుకొన్న సొసైటీకి ప్రభుత్వం ఏలాంటి సహాయం చేయలేదనీ, కానీ ధనవంతులైన 8 మంది స్వర్ణకారులకు మాత్రమే ప్రభుత్వం సకల సహాయమూ చేస్తున్నదని విమర్శించారు ఈ ఎనిమిదిమంది అధికారంలోవున్న పార్టీని బలపరుస్తున్నందునే వారికి సౌకర్యాలను పాలకపక్షం పక్షపాతంతో సమకూరుస్తున్నందుకు విమర్శించారు.

గోదావరి బ్యారేజ్

గోదావరి బ్యారేజ్ నిర్మాణం ఉభయ గోదావరుల రైతాంగానికేకాక ఆంధ్ర ప్రజానీకానికంతటికీ జీవన్మరణసమస్య.

గోదావరి ఆనకట్ట జీవితకాలం ఎప్పుడో పూర్తి అయిపోయింది. అదనంగా మరో నూరు నాలుగు చోట్ల బీటలు పడింది. అందువల్ల ప్రభుత్వం వెంటనే బ్యారేజి నిర్మాణం ప్రారంభించాలి, రైతుల వద్దనుండి అభివృద్ధి పన్ను కావాలని కోరుతూ ఈవిషయంలో ఇకనెంత మాత్రం జాగు చేయరాదు ఈ నిర్మాణంవల్ల రైతులకు ప్రభుత్వం అదనంగా నీరు కూర్చేది మాత్రంలేదు. రైతాంగానికి నష్టం కలగకుండా రక్షించడమే ప్రస్తుత సమస్య ఎందువలనంటే ఈ నిర్మాణంతో అదనంగా భూమి సాగయ్యేదీలేదు, అదనపు ఆదాయం వచ్చేదీ లేదు.

రాజమండ్రివద్ద నిర్మించ తలపెట్టిన రైలు వంతెనను రైలు రోడ్డు బ్రిడ్జిగా మార్చడానికి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలి అదనపు వ్యయాన్ని ఆంధ్ర ప్రభుత్వం భరించ లేదని ఢిల్లీనుండి వెలువడుతున్న ప్రకటనలు ఎంతవరకు యధార్థమో ప్రభుత్వంవివరించాలి" అని డిమాండ్ చేశారు.

చెరకు పండే భూములపై అదనపు పన్ను విధింపులను వ్యతిరేకిస్తూ ఒక వైపున రైతాంగంపై పన్నులభారాన్ని పెంచుతూ, మరొక వైపున పంచదార ధర పెంచి పంచదార ఫ్యాక్టరీల యజమానులకు లాభాలు కలిగించే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్నదని తీవ్రంగా విమర్శించారు.

లచ్చన్న విమర్శ

స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ గౌతు లచ్చన్న ప్రసంగిస్తూ బడ్జెట్ ప్రతిపాదనల్లో పరస్పర వైరుధ్యమైన అంశాలున్నాయన్నారు.

1960-61 నుండి వ్యయం 90 శాతం పెరిగిందని ఆర్థిక మంత్రి తమ ప్రసంగంలో చెప్పారు. కానీ 1965-66 నాటికి హరిజనుల గిరిజనులతదితర వెనుకబడినజాతులసంక్షేమానికిఅయ్యే ఖర్చు మొత్తం వ్యయంలో20శాతంమాత్రమే పెరిగింది. హరిజన గిరిజన తదితర వెనుకబడిన జాతుల ప్రజానీకం జనాభాలో 30 శాతం ఉన్నదనే విషయాన్ని గమనంలోకి తీసుకొని ఈ వ్యయాన్ని పరిశీలించాలి.

కేవలం వెనుకబడిన జాతుల పరిస్థితినే తీసుకొంటే ప్రభుత్వం వాటి అభివృద్ధికి కృషి చేయడ లేదు సరిగదా వీరిని దెబ్బతీసే విధానాలనే అవలంబిస్తూ వున్నది. వీరి సంక్షేమానికి 1964-65 లో రు. 14 లక్షల 40 వేలు కేటాయిస్తే ప్రస్తుతం రివైజుడు ఎస్టిమేట్లలో ఈ సంఖ్యను రు. 11 లక్షల 84 వేలకు కుదించారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల ప్రజలను అణగద్రొక్కుతున్న దనేందుకు ఇది దర్పణం.

ప్రాథమిక విద్య

ప్రాథమికవిద్యకు 1964-65 లో 99లక్షలు కేటాయిస్తే ఆ మొత్తాన్ని 1965-66 లో రు. 81 లక్షలకు తగ్గించారు ఇదికూడా వెనుకబడ్డ వర్గాల పిల్లలను దెబ్బతీస్తుంది వెనుకబడిన వర్గాలను అణకొట్టడమే ఈప్రభుత్వ ధ్యేయంగా వున్నది అన్నారు.

శ్రీ లచ్చన్న తన పార్టీ మితవాదఅభివృద్ధి నిరోధకతత్వాన్ని ఏకరువుపెడుతూ ప్రణాళికను రద్దుచేయాలన్నారు.

ప్రణాళికను బంగాళాఖాతంలో పడేయండి ఆహార కార్పొరేషన్ అరేబియా సముద్రంలో వేయండి. కంట్రోళ్ళు, ప్రణాళికలు, ప్రభుత్వ వ్యాపారాలే ప్రస్తుత కష్టనష్టాలన్నింటికి మూలం అని విమర్శించారు.

అవినీతికి, అధిక ధరలకూ, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ప్రజానీకంలో వున్న ఆందోళనను ప్రస్తావిస్తూ శ్రీ లచ్చన్న అనేక ఉదాహరణలిచ్చారు.

ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను, పంచాయతీరాజ్ సంస్థలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు తమ స్వార్థానికి ఇష్టమొచ్చినట్లు వినియోగించుకొనడాన్ని శ్రీ లచ్చన్న నిశితంగా విమర్శించారు. విద్యకూ పంచాయతీరాజ్ సంస్థలకూ సంబంధం ఉండరాదనీ, విద్యను పంచాయతీ సమితుల పెత్తనంనుండివేరుచేయాలని ఆయనడిమాండ్ చేశారు పంచాయతీ సమితులు, జిల్లాపరిషత్తుల పరిపాలన ముఠారాజకీయాలతో అధ్వాన్నంగా వుంది అని విమర్శించారు తంగెడార ప్రాజెక్టును బడ్జెట్ ప్రసంగంలో పూర్తిగా విస్మరించి నందుకు విచారం ప్రకటించారు వాల్తేరు, గుంతకల్లు డివిజన్లను కొత్తగా ఏర్పరచబోయే దక్షిణ మధ్య రైల్వేమండలంలో చేర్చాలని డిమాండ్ చేశారు.

శ్రీ కాకాని వెంకటరత్నం (కాం) బడ్జెట్ ప్రతిపాదనలను బలపరుస్తూ సెకండరీ విద్యకు ఇంకా ఎక్కువ డబ్బు కేటాయించాలనీ. స్కూలుఫైనలు వరకూ మగపిల్లలకు కూడా ఉచిత విద్య ఏర్పరచాలనీ చెప్పారు.

ఏటా వరదలు వచ్చినప్పుడు హడావుడిగా సంచారాలు చేయడం, ప్రకటనలు చేయడం తప్పితే తరువాత దానిని గురించి మరచిపోతున్నామని అన్నారు. ఈ ఏడు బడ్జెట్‌లో వరద నివారణకు ఏమీ కేటాయించనందుకు విమర్శించారు. ఈ బడ్జెట్‌లో మురుగు నివారణ పథకాలకు కూడా ఏమీ కేటాయించలేదన్నారు.

చెరకు పన్ను సక్రమంగా వినియోగించడం లేదని తాను విమర్శించడం లేదనీ, కంకిపాడు గుడివాడ, తేలప్రోలు ఉయ్యూరు, కైకలూరు ఏలూరు రోడ్లు మరమ్మత్తులు లేక అధ్వానంగా వున్నాయనీ అన్నారు

చెరకు పండించే భూములపై ఆంధ్రలో పన్ను హెచ్చించబోతున్నందుకు విమర్శించారు ఇది అన్యాయమనీ ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలనీ అన్నారు. మహారాష్ట్రలో ఎకరానికి 80 టన్నులు చెరకు పండుతుంటే 80 రూపాయలు పన్నువున్నదనీ తెలంగాణాలో 50 టన్నులు పండుతూవుంటే 70 రూపాయలు పన్ను ఉన్నదని, ఆంధ్ర ప్రాంతంలో ఎకరానికి 30 టన్నులు అవుతూవుంటే 40 రూపాయలు పన్నుఉన్నదని, దీనిని తెలంగాణా స్థాయికి పెంచితే రు 30 లు అదనపు పన్ను పడుతుందని అందుచేత ఇది అన్యాయమనీ అన్నారు.

శ్రీ మూర్తిరాజు (కాం) మాట్లాడుతూ ప్రాథమిక విద్యపట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. వరద నష్టంవల్ల పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్ల మరమ్మత్తులకే ఒకకోటి రూపాయలు కావలసి వున్నదన్నారు అదనపు భూమి శిస్తువల్ల చిన్న రైతులపై ఎంతో భారం పడిందనీ అందుచేత దీనిని తొలగించాలనీ అన్నారు. [illegible] జిల్లాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని గురించి కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు.

శ్రీ కె. గురుస్వామిరెడ్డి (కమ్యూ) మాట్లాడుతూ నెల్లూరుజిల్లా కనిగిరి ప్రాంతానికి నాగార్జున సాగర్‌నీరు అందించే ఉపాయం ఆలోచించాలని అన్నారు దర్శి, పొదిలి కనిగిరి ప్రాంతాలు జమీందారీ పాలనలో చాలా వెనుకబడి వున్నాయనీ, అందుచేత వాటి అభివృద్ధికి ప్రత్యేక కృషి జరగాలనీ అన్నారు. చిన్న నీటి పారుదల పథకాలు ఆ ప్రాంతాల్లో నిర్మించాలన్నారు. ఈప్రాంతాల్లో పి. డబ్లు. డి. సిబ్బందిని పెంచాలని, కనిగిరి ప్రాంతానికి విద్యుచ్ఛక్తి సరఫరా చేయడంలో ప్రాధాన్యత యివ్వాలని అన్నారు.

వ్యవసాయ కార్మికులు సంవత్సరంలో తొమ్మిది నెలలు పనులులేక వలసలు పోవలసి వస్తున్నదనీ, అందుచే ఇంతవరకూ పంపకం చేయకుండావున్న బంజరు భూములను వారికి ఇవ్వాలని, సాగుబడికి ఎరువులకూ పెట్టుబడి కూడా ఇవ్వాలనీ అన్నారు.

శ్రీ పి సన్యాసినాయుడు (కాం) మాట్లాడుతూ విశాఖజిల్లాలో ఆహార పరిస్థితి విషమంగా వుంది అక్కడ వెయ్యి టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించడం అన్యాయమని ఈ ఉత్తర్వులను రద్దుచేయాలనీఅన్నారు. తూర్పు గోదావరిజిల్లానుండి విశాఖ శ్రీకాకుళం జిల్లాలకుఆహారధాన్యాల రవాణాకు అడ్డంకులు తొలగించాలని అన్నారు. ప్రతి తాలూకా కేంద్రంలోనూ ప్రసూతికేంద్రం ఏర్పరచాలని కోరారు. విశాఖ జిల్లాకు గోదావరినీటిని అందిచేవిధంగా పోలవరం వద్దనే బ్యారేజిని నిర్మించాలని అన్నారు. అందుకు అవసరమైతే ఆ జిల్లా రైతులు నీరు అందినప్పటినుండి అభివృద్ధి పన్ను ఇచ్చుకుంటానికి సిద్ధమేనని అన్నారు.

కొత్త రైల్వే మండలంలో వాల్తేరు, గుంతకల్లు. డివిజన్లను తప్పక చేర్చాలని అన్నారు రాజమండ్రివద్ద రైలువంతెనను రైలు, రోడ్డు వంతెనగా మార్చాలని అన్నారు. చెరకు పండే భూములపై పన్ను పెంచరాదని అన్నారు.

ఆవడివద్ద టాంకుల ఉత్పత్తి సంవత్సరాంతం నుండి ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 2

అవడివద్ద నిర్మిస్తున్న భారీ టాంకుల ఉత్పత్తి కర్మాగారం ఈ సంవత్సరాంతానికి ఉత్పత్తి ప్రారంభిస్తుంది. వచ్చే సంవత్సరాంతంలోగా మధ్యరకం టాంకులు 100 కు పైగా ఉత్పత్తి అవుతాయి.

ఇక్కడ తయారయ్యే టాంకులు అధునాతన నమూనాలో వుంటాయని చవాన్ అన్నారు.

ఆహార ధాన్యాల దిగుమతి తప్పదట

టి. టి. కె. ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 2

ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవటం పట్ల కొందరు తీవ్రనిరసనను తెల్పుతున్నారని అయితే ప్రతి సంవత్సరం కోట్లకొలది రూపాయలను ఈ దిగుమతులపై వెచ్చించటం ప్రభుత్వానికి కూడా బాధగానే వున్నదని, అయినప్పటికి దేశ ప్రజలను ఆకలి రాకాసికి ఎరజేసి ఊరకుండ జాలమని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడిక్కడ అన్నారు.

ఇటీవల వారాలలో కేంద్ర ప్రభుత్వం ముందు వాగ్దానం చేసినరీతిగా రాష్ట్రాలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయలేక పోయిన విషయం వాస్తవమేనని ఆర్థికమంత్రి అంగీకరించారు. అమెరికాలో రేవు పనివారల సమ్మె ఫలితంగా అమెరికా నుండి పి. యల్. 480 క్రింద వచ్చే ఆహార ధాన్యాల సరఫరాలు ఆలస్యంజరగటమే ఇందుకు కారణమని ఆర్థిక మంత్రి చెప్పారు.

యుద్ధ పరికరాల ఫ్యాక్టరీలోని అదనపు కార్మికులకు పనిచూపించే విషయంలో తమ వ్యక్తిగత అశక్తిని ప్రదర్శించగలనని శ్రీ కృష్ణమాచారి అన్నారు. ఆ పరిసర ప్రాంతాలలోని ఫ్యాక్టరీలలో పని చూపించడంద్వారా కార్మికుల శ్రమశక్తికి తగిన వసతులుచూపించి వారి శక్తి సామర్థ్యాలను దేశ ప్రయోజనాలకు ఉపయోగించుకోగలమని ఆయన అన్నారు,

ఆర్థికమంత్రిత్వశాఖలో ప్రభుత్వ పరిశ్రమల బ్యూరోను నెలకొల్పటాన్ని ఆర్థికమంత్రి సమర్థించారు. కాంగ్రెసు సభ్యుడు ఈ విషయాన్ని గతంలో ప్రస్తావిస్తూ తన అధికారాన్ని అన్ని రంగాలకు వ్యాపింపజేయాలనే ఆర్థికమంత్రి ఆశకు ఇది నిదర్శనమని అన్నారు.

ఎరువుల ఫ్యాక్టరీలను నెలకొల్పటంలో విదేశకంపెనీలభాగస్వాములయ్యేటట్లుచూడటం దేశప్రయోజనాలదృష్ట్యానూ, దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యానూ చాలా మంచిదని ఆర్థిక మంత్రి చెప్పారు. అలాంటి ఫ్యాక్టరీలపయి ప్రభుత్వం తగు అదుపును కలిగివుంటుందని ఆయన అన్నారు.

స్వతంత్రపార్టీ సభ్యులు శ్రీ కపూర్ చేసిన విమర్శకు సమాధానం చెబుతూ రక్షణశాఖలో కుల,మత, ప్రాంతీయ విచక్షణలు పాటించబడటంలేదని అన్నారు.

ప్రభుత్వోద్యోగుల సంక్షేమాన్ని కోరటంలో ప్రతిపక్ష సభ్యులకన్నా తానేమాత్రం తీసిపోనని ఆర్థికమంత్రి చెప్పారు. ప్రభుత్వోద్యోగులకు అధిక ధరల అలవెన్సు ఇవ్వకూడదని నేను అనటంలేదు, సాధ్యమైతే ఇంకా అధికంగా అధిక ధరల అలవెన్సు ఇవ్వాలనే అంటున్నాను అని శ్రీ కృష్ణమాచారి అన్నారు

మరో ప్రశ్నకు సమాధానం చెబుతూ రాజస్థాన్ కాలువ నిర్మాణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోటానికి అంగీకరించిందని అన్నారు. ఆ కాలువపై తమ అధికారాన్ని కేంద్రానికి వప్పజెప్పటానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకరించిందని ఆయన అన్నారు.

ఇందువల్ల అదనపు నీటిని రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలు సక్రమంగా ఉపయోగించుకోటానికి వీలౌతుందని ఆయన అన్నారు.

దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు 'ఆచరణ సాధ్యమే'

ప్రవీణుల కమిటీ సిఫార్సు

ఐరాస, ఫిబ్రవరి 28

దక్షిణాఫ్రికా జాతి వివక్ష విధానాన్ని విరమించేలాగ చేయడానికి ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలు, తదితర చర్యలూ తీసుకొనడం ఆచరణ రీత్యా సాధ్యమేనని భద్రతా సంఘం ప్రవీణుల కమిటీ నిశ్చయించినట్లు తెలియవస్తున్నది

ఈ విషయమై పరిశీలనకు గత సంవత్సరం భద్రతా సంఘం 11 రాజ్యాలతో ఈ ప్రవీణుల కమిటీని ఏర్పరచింది బొలీవియా, బ్రెజిల్, జెకోస్లోవేకియా, ఐవరీ కోస్టు, మొరాకో, నార్వే దేశాలతోపాటు భద్రతాసంఘంలోని 5 శాశ్వత సభ్యదేశాలు ఈప్రవీణులకమిటీలో ఉన్నాయి.

స్వదేశానికి ఉల్‌బ్రిక్ట్ తిరుగు ప్రయాణం

కైరో స్టేషన్‌లో నాజర్ వీడ్కోలు

కైరో, మార్చి 2

ఐక్య అరబ్ రిపబ్లిక్‌లో తన 8 రోజుల పర్యటనను పూర్తి చేసుకొని తూర్పు జర్మనీ, అధ్యక్షులు హెర్ వాల్టర్ ఉల్‌బ్రిక్ట్ నేడిక్కడ నుంచి స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

కైరో రైల్వే స్టేషన్‌లో అధ్యక్షుడు నాజర్ తూర్పుజర్మనీ అధినేతకు వీడ్కోలిచ్చారు.

ఉల్‌బ్రిక్ట్ నాజర్‌తో కరచాలనం చేస్తూ "మనిద్దరం తిరిగి బెర్లిన్‌లో కలుసుకొనగలమని ఆశిస్తున్నాను' అన్నారు.

తూర్పుజర్మనీని సందర్శించడానికి నాజర్ అంగీకరించారు.

బ్రిటన్‌లో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు

వియత్నాం యుద్ధానికి స్వస్తి చెప్పాలని డిమాండ్

లండన్, మార్చి 2

వియత్నామ్‌లో యుద్ధాన్ని త్వరగా అంతమొందించడానికి బ్రిటన్ చొరవతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లండన్ ట్రఫాల్గర్ స్క్వేర్‌లో 500 మంది ప్రదర్శన జరిపారు.

అనంతరం ఆ ప్రదర్శకులు ప్రధాని విల్సన్ భవనానికివెళ్ళి ఒక వినతిపత్రంసమర్పించారు.

దక్షిణవియత్నాంలో తమ తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి అమెరికా జరుపు ప్రయత్నాలే వియత్నామ్ యుద్ధానికి మూల హేతువు అని ఆ వినతిపత్రంలో స్పష్టం చేశారు.

ఇజ్రాయల్‌కు అమెరికా ఆయుధాలు ఒక షరతుతో ఇవ్వడానికి సంసిద్ధత

టెల్ అవీవ్, మార్చి 2

ఇజ్రాయల్‌కు సైనిక సహాయంచేయడానికి అమెరికా అంగీకరించింది.

అయితే, అమెరికా ఇందుకు ఒక షరతు విధిస్తున్నదట. జోర్డాన్ నదీజలాల మళ్ళింపు సమస్యపై అరబ్ దేశాలమీద తాము సరఫరా చేసే ఆయుధాలను ప్రయోగించబోనని ఇజ్రాయల్ మాట యివ్వాలని అమెరికా పట్టుబట్టుతున్నదట.

అమెరికా అధ్యక్షులు జాన్సన్ అంతరంగిక దూత అవెరెల్ హారిమాన్ ఇటీవల ఇక్కడకు వచ్చినప్పుడు ఈ విషయాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వ నాయకులు తెలియజేశారట.

మలేషియా వివాదంలో థాయ్ - జపాన్ మధ్యవర్తిత్వం

టోకియో, మార్చి 2

మలేషియా - ఇండొనేషియా దేశాలమధ్య వివాదాన్ని పరిష్కరించడానికి థాయిలాండ్, జపాను దేశాలు రెండూ కలిసి మధ్యవర్తిత్వం నెరపడానికి గల అవకాశాలను జపాను విదేశాంగశాఖ పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది.

బేషరతుగా సంప్రతింపులు ప్రారంభించడానికి సిద్ధమంటూ ఇండొనేషియా మలేషియా నాయకులుప్రకటించిన ఫలితంగా ఈఅవకాశం ఏర్పడినట్లుజపాన్ విదేశాంగశాఖ భావిస్తున్నదట

భారతదేశానికి లక్షటన్నుల కెనడా గోధుమ

ఒట్టావా, మార్చి 2

70 లక్షల డాలర్ల విలువచేసే లక్ష టన్నుల గోధుమను కెనడా ఈ యేడాది భారతదేశానికి సరఫరా చేస్తుందని నేడిక్కడ కెనడా విదేశాంగమంత్రి పాల్‌మార్టిన్ ప్రకటించారు.

అంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులు

హైదరాబాద్, మార్చి 2

శ్రీ నోరి నరసింహశాస్త్రి రచించిన 'కవి సార్వభౌముడు' అనే నవలను, శ్రీ విశ్వనాథ వెంకటేశ్వర్లు రచించిన 'కాళింది పరిణయం' అనే పద్య కావ్యాన్ని 1964 వ సంవత్సరంలో బహుమతిపొందటానికి అర్హమైనవిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఎన్నిక చేసింది.

ఆధునిక తెలుగుసాహిత్యాన్ని ప్రోత్సహించటానికి ఈ బహుమతులు ఉద్దేశించబడ్డాయి. ఒక్కొక్క పుస్తకానికి 1116 రూపాయల నగదు బహుమతిని యిస్తారు చిన్న కథలలో బహుమతికి అర్హమైనదని లేదని ప్రకటించారు.

రేడియో

శుక్రవారం, మార్చి 5

శక 1886 ★ ఫాల్గుణ 14

విజయవాడ

347.1 మీ (840 కిలోసై.)

ఉదయం: 6-30 శుభోదయం; ప్రసార విశేషాలు 6-40 అం. వా: 6-45 భక్తిరంజని హై. రిలే. 6-55 సూక్తి ముక్తావళి; 7-00 తె. వా. 7-15 ఈనెల పాట. 7-20 గాంధీ మార్గము: 7-45 ఎ. వి. ఎస్ కృష్ణారావు 8-00 అం. వా: 8-15 హై. రిలే. 8-30 హైదరాబాద్ వలె: 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 11-30 రాష్ట్రగానం; 11-45 మాధ్యమిక పాఠశాలలకు. 12-15 వార్తలు - వ్యాఖ్యలు: 12-30 కార్మికులకు. 1-00 వనితా వాణి: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-0 వాతావరణ సూచన, సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం; 6-20 గ్రామస్థులకు, 7-00 తె. వా. 7-15 గ్రామస్థులకు. 7-30 జయభేరి - రూపకం; 7-45 సంగీత కచేరీ. 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున; 9-25 విరామ సంగీతం; 9-30 హై రిలే, 9-45 వానసద తవాద్య చిత్రం: 10-30 అం. వా: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై.)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ: 6-40 అం. వా, 6-45 భక్తిరంజని- సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు: 6-55 సూక్తి ముక్తావళి: 7-00 తె. వా: 7-15 సంకీర్తనం- భక్తి పాటలు: 7-20 గాంధీ మార్గము: 7-45 ఖయాల్: 8-00 అం. వా: 8-15 లలిత సంగీతం: 8-30 వీణ, 9-0 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం: 11-45 మాధ్యమిక పాఠశాలలకు: 12-15 హై. బి. వలె: 12-30 కార్మికులకు. 1-0 వి. రిలే: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 వాతావరణ సూచన, చిత్రసీమ: 2-10 ఉ. వా. 2-20 ఎస్. ఎస్. రతన్ జంకర్: 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశము: 6-20 హై. బి.వలె: 7-00 తె. వా: 7-15 హై. బి. 7-30 హిందీప్రసంగం. 7-45 హై. బి. వలె. 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఉ. వా: 9-30 సాహిత్య సందిని - ప్రసిద్ధ హాస్యచతురులు - ప్రసంగం: 9-45 ఖయాల్. 10-30 అం. వా: 10-30 అం. వా: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన.

హైదరాబాద్ - బి

కడప

265.5 మీ (1130 కిలోసై.)

విశాఖపట్నం

332.6 మీ (980 కిలోసై.)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39.42 మీ (3355 కిలోసై.)

(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై.ఎ.వలె: 7-45 సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై.)

8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై.)

(హైదరాబాద్ మాత్రమే)

మధ్యాహ్నం: 11-45 హై. ఎ. వలె: 12-15 లలిత సంగీతం: 12-30 హై. ఎ. వలె, 2-10 గానయుద్ధి, 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు, 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు, 7-30 వి. రిలే. 7-45 కర్ణాటక సంగీత కచేరి: 8-55 హై. ఎ. వలె: 9-15 జరుగుతున్న సంఘటనలు- ప్రసంగం: 9-30 హై. ఎ. వలె: 9-45 వీణ: 10-30 హై. ఎ. వలె: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై.)

60.98 మీ (4920 కిలోసై.)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మంగళగానం, 7-00 తె. వా: 7-15 సంగీత మంజరి. 7-30 నాదస్వరం: 8-00 అం. వా: 8-15 ప్రసార సమాప్తి

4190 మీ (7160 కిలోసై.)

మధ్యాహ్నం: 12-00 కార్మికులకు: 12-30 మాధ్యమిక పాఠశాలలకు: 1-00 మదర్ విగస్సి - స్త్రీలకు: 1-30 అం. వా: 1-40 గీత మంజరి, 1-50 తె. వా: 2-00 మధుర గీతం: 2-10 ఉన్నత పాఠశాలలకు: 2-40 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం, 6-00 అం. వా: 6-05 ప్రాంతీయ తెయిదిగళ్, 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు వాణిజ్య వార్తలు - ఆంగ్లం: 6-30 కార్యక్రమ వివరణ: 6-35 పి. సుందర రాజన్: 7-00 తె. వా: 7-15 సంగీత మంజరి: 7-30 జయభేరి - రూపకం - తెలుగు: 7.45 ఎం. ఎల్. వసంతకుమారి: 8-40 ఈ రోజు పార్లమెంట్ సమీక్ష: 8-55 ప్రస్తుతాంశం. 9-00 అం. వా 9-15 ఆంగ్లమున: 9-30 ఆంగ్ల ప్రసంగము. 9-40 విరామ సంగీతం, 9-45 పాశ్చాత్య సంగీతం, 10-35 ప్రసార సమాప్తి జన గణ మన.

శ్రీ నారు నాగనార్యులచే రచింపబడిన "శ్రీ రామకృష్ణ మహోదయము (నిర్వచన పద్యకావ్యము)" అను పుస్తకాన్ని రాజమండ్రి ఆధ్యాత్మ ప్రచారక సంఘ కార్యాలయములో, శ్రీ విద్యాప్రకాశానంద బ్రహ్మచారిగారి అధ్యక్షతను జరిగిన సభలో పురాణపండ రాధాకృష్ణమూర్తిగారు ఆవిష్కరించారు.

నల్లగొండ మీదుగా ఒంగోలు-హైద్రాబాద్ రైలుమార్గ నిర్మాణం

నల్లగొండ జిల్లా పారిశ్రామికాభివృద్ధికి అత్యంతావశ్యకమని విజ్ఞప్తి

నల్లగొండ, మార్చి 2

నల్లగొండ మీదుగా, ఒంగోలు - హైదరాబాద్ రైలుమార్గాన్ని వేయవలసిన ఆవశ్యకతను తెలియజెప్పటానికి ఢిల్లీ, హైదరాబాద్‌లకు రాయబారం వెళ్లుటకు నల్లగొండలో జరిగిన ప్రముఖుల సభ తీర్మానించింది.

నల్లగొండ పుర మందిరంలో ఈ నెల 21వ తేదీన ప్రముఖుల సమావేశం జరిగింది. సమావేశమునకు మున్సిపల్ ఛైర్మన్ శ్రీ వెంకట నారాయణగారు అధ్యక్షత వహించారు. రైల్వే సాధకసంఘ కార్యదర్శి డాక్టరు సుదర్శనరావుగారు సంఘ కార్యకలాపాలను సమీక్షిస్తూ 1961 లో సంఘం ఏర్పడిన లగాయతు జరిగిన పనిని వివరించారు.

ఇప్పుడు కమిటీని విస్తృతపరచి రైలు మార్గమును సాధించుటకు తీవ్రప్రయత్నాలు సాగించవలసిన అవసరాన్నిగూర్చి అధ్యక్షులు హెచ్చరించారు.

తరువాత జిల్లా కమ్యూనిస్టు నాయకులు, శాసనసభ్యులు అయిన శ్రీ బి. ధర్మభిక్షంగారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో 2,902 మైళ్ళ పొడవున రైలుమార్గం ఉన్నప్పటికీ గుంటూరు - మచిలీపట్నం, కాకినాడలాంటి పట్నాలతో ప్రధాన రైలు మార్గాలు కలిపి లేవన్నారు, వాటికి అప్రోచిలింగ్స్ మాత్రమే వున్నాయనీ, 16,000 చదరపుమైళ్ళకు రైలు మార్గాలతో సంబంధమే లేదన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు:

"1962 లో హైదరాబాదు ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు అసెంబ్లీలో మాచర్ల-జడచర్లమార్గాన్ని నల్లగొండమీదుగాను విశాఖపట్నం నుండి హైదరాబాదుకు ఒక మార్గాన్ని వేయాలనే ప్రతిపాదనలను చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు

ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరువాత ఒంగోలు-హైదరాబాదు రైలుమార్గం నల్లగొండ మీదుగా యేర్పడాలని మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సూచించింది.

లోకనాధంగారు తమ టెక్నికల్ ఎకనామిక్ సర్వే రిపోర్టులో గూడ ఒంగోలు, హైదరాబాదు రైలు మార్గాన్ని నాగార్జున సాగర్ మీదుగా వేయాలని: అలైను 180 మైళ్ళు పొడవుగలిగి వుంటుందనీ, దానికి 15 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, తెలిపి అందుకు మొదటి ప్రాముఖ్యత యిచ్చి తగుసూచనలు చేశారు

నాగార్జున సాగర్ రోడ్డు బ్రిడ్జికూలిపోయిన తరువాత ఒంగోలు-హైదరాబాదు రైలుమార్గం తక్షణావసర సమస్యగా మారింది నాగార్జునసాగర్ డ్యామ్‌లో కట్టబడిన రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికిముందు ఒక రైలు బ్రిడ్జి కట్టాలన్న సూచన ఆలోచన వుండెను. కాని ఖర్చు అగునన్న ప్లానుతో సూచనను వదలుకొన్నారు. తిరిగి ప్రాజెక్టుబోర్డు వారు నిపుణుల సంఘంవారు తిరిగి రైలురోడ్డుబ్రిడ్జి కట్టాలని ఆలోచనలో వున్నారని తెలుస్తుంది. కాని అమలుకు రాకుండా తిరిగి ఆటంకాలు కల్గుతున్నవని తెలిసింది. అలాజరగగకూడదు నాగార్జున ప్రాజెక్టుపై బ్రిడ్జిపై రైలు-రోడ్డు బ్రిడ్జి కట్టితే మదరాసునుండి ఢిల్లీ రైలుమార్గం చాల సమీపం అవుతుంది. ఒంగోలు-హైదరాబాదుమధ్య జిల్లాలతో దగ్గరసంబంధాలు వర్తక సంబంధాలు పెరుగుతవి, గుంటూరు పొగాకు, సిమెంటులకుని స్వతంగా మార్కెట్టుసౌకర్యాలు పెరుగుతవి.

అంతేగాక నల్లగొండ జిల్లాలో కమ్యూనికేషన్సు లేనికారణంగా పారిశ్రామికవేత్తలు వాడపల్లిలో సిమెంటుఫ్యాక్టరీకి, దేవరకొండలో ఆముదపుగింజల నుండి నూనెతీయు ఫ్యాక్టరీకి పెట్టుబడి పెట్టుటకు ముందుకు రావడము లేదు. భారీ పరిశ్రమలు లేని కారణాన వేలాది నేతకార్మికులకు జిల్లాలో నేటికి స్పిన్నింగు. వీవింగు పరిశ్రమలు నెలకొల్పుటంలో పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వంకూడా అలాగే ఆలోచిస్తూవున్నది. కాబట్టి జాతీయఅవసరాలు వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు తీర్చుటకు అవకాశమున్న రైల్వేబ్రిడ్జిని, తద్వారా ఒంగోలు - హైదరాబాదు రైలు మార్గాన్ని కేంద్రం ప్రారంభించుటకు మనం రాయబారం వెళ్ళాలి. మనతోబాటు ఒంగోలు, ఖమ్మం: గుంటూరు మహబూబ్ నగర్. హైదరాబాద్ జిల్లాల ముఖ్యులుకూడా వెళ్లాలి ఈ కృషికి అందరి సహకారం, లోగడయేర్పడ్డ కమిటీ జిల్లా ప్రాతినిధ్యం వహించునట్లు చూడాలి. తర్వాత జిల్లాల ప్రతినిధులు, ప్రముఖులతో విస్తృత పరచాలి".

తర్వాత డాక్టరు గుప్తా, డాక్టరు రంగ నాయకులు. పేటు రతన్‌లాల్, శ్రీ మున్నార్ సాహెబు. చింతా బయ్యన్న, శ్రీ చక్రధరగార్లు మాట్లాడుతూ ఈ కమిటీని విస్తృతపరచి ఢిల్లీకి రాయబారం వెళ్ళుటకు సన్నాహాలు చేయాలని సూచనలిచ్చారు.

అధ్యక్షులు శ్రీ టి. వెంకటనారాయణగారు వుపన్యసించుతూ నల్లగొండనుండి పాద యాత్రతో బయలుదేరిన యాత్రాదళం ఆనాటి కేంద్ర రైల్వే మంత్రి శ్రీ జగజీవన్‌రాం గారితో కలిసిన విషయం వివరించారు ఆనాడు రాయబార వర్గంవారికి రైల్వే మంత్రి జవాబు చెప్పుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైలు మార్గం కొత్తగా వేయాలన్న నిర్ణయం జరిగితే ప్రప్రధమంగా ఒంగోలుమీదుగా నల్లగొండ - హైదరాబాదు లైను తీసుకుంటామని వాగ్దానంచేసిన విషయం గుర్తుచేశారు. మన నాగార్జున రోడ్డు బ్రిడ్జి పడిపోయినసందర్భంలో కేంద్ర అర్ధికమంత్రి శ్రీ టి.టి. కృష్ణమాచారి ఇప్పుడు రైల్వేబ్రిడ్జి కట్టాల్సిన అవసరం యేమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

"మన జిల్లాలోనే రైలుమార్గం ఏర్పడియుంటే వాడపల్లి సిమెంటు ఫ్యాక్టరీ కట్టించబడెడిది వాడపల్లిలో లభించు అపారమైన ముడి పదార్థాన్ని భువనగిరి (రైలుస్టేషన్) కి తీసుకొని వెళ్ళి అక్కడనుండి సిమెంటు తయారు చేసి దేశంలో విడుదల చేయవచ్చు. కాని లైసెన్సు తీసుకున్న ఒకవ్యక్తి ఆధికవ్యయమగునని కాబోలు నేటికీ భువనగిరిలో ఫ్యాక్టరీ ప్రారంభించలేదు కొద్దిపాటి పారిశ్రామిక వనరులున్నప్పటికీ వాటిని వినియోగించుకొనుటకు ప్రభుత్వం సాధనాలు కల్పించకపోవడంవల్ల మనజిల్లా పేదజిల్లాగనేవడివుంది.

నూటికి 70 వంతులుగ వ్యవసాయ వృత్తిలోవున్న వ్యవసాయ కార్మికులు వ్యవసాయతరుణంలో(వరాకాలం)పని సంభవించదం: తరుణం దాటిన తరువాత ఒకరికి పనిదొరకదు. అలా పేదరికంలో అధిక సంఖ్యాకులు ఇబ్బందిపడుచున్నారు. కాబట్టి ప్రభుత్వంవారు ముఖ్యంగా సిమెంటు ఫ్యాక్టరీ, సహకార స్పిన్నింగు. వీవింగు మిల్లు నిర్మాణానికి పూనుకోవాలని నాగార్జునసాగర్ వద్ద రైల్వేరోడ్డుబ్రిడ్జి నిర్మాణానికి పూనుకోవాలని అందుకు శ్రీ ధర్మభిక్షంగారు చెప్పినట్లు రైల్వే సాధకసమితిలో ప్రక్క జిల్లాలవారి ప్రతినిధులను: ఇతర వర్తక ప్రతినిధులను కో-ఆప్టు చేసుకోవాలి" అని తమఉపన్యాసాన్ని ముగించారు.

ఆ తర్వాత రాయబారవర్గంగా ఢిల్లీ, హైదరాబాదులకు వెళ్ళుటకు ఈ క్రింది వారితో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీకి పై సమస్యను గురించి ప్రముఖులతో సంప్రదించుటకు భోగట్టా సేకరించుటకు కూడా బాధ్యత యివ్వబడింది.

శ్రీయుతులు టి. వెంకటనారాయణ, (మున్సిపల్ ఛైర్మన్: నల్లగొండ). శ్రీ బి ధర్మభిక్షం యం.ఎల్.ఏ., శ్రీ ఎ. వాసుదేవ రావు ఎం ఎల్. ఏ శ్రీ వి. శంకరరావు ఎం ఎల్.సి., శ్రీ లక్ష్మీ నరసింహారెడ్డి (జిల్లా పరిషత్ ఛైర్మన్)పై రైల్వే సాధన కమిటీలో నల్లగొండ జిల్లాలోని అందరు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులను, పార్లమెంటు సభ్యులను కో ఆప్టు చేసుకోవాలని పారిశ్రామిక వేత్తలను వర్తక సంఘ ప్రతినిధులను సంప్రదించి కమిటీలోకి తీసుకోవాలనీ, ఇందుకై అధ్యక్షులకు అధికారమిస్తూ తీర్మానించడమైనది.

రాజ్యసభలో ప్రశ్నోత్తరాలు

న్యూఢిల్లీ, మార్చి 2

ఆహార వ్యవసాయ, సమాజాభివృద్ధి సహకారమంత్రిత్వ శాఖలను కలిపి వేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం ముందు లేదని ప్రధాని నేడు రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ అన్నారు.

ఆయామంత్రిత్వశాఖల మధ్య సహకారాన్ని పెంపొందించే నిమిత్తం పెక్కుస్థాయీ సంఘాలు ఏర్పాటుచేయబడ్డాయని, వివిధశాఖల అధికారులతో స్థాయీసంఘాల నియామకం జరిగిందని ఆయన అన్నారు.

శ్రీ ఎ. బి. వాజ్‌పాయ్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ అణురహిత రాజ్యాలను అణ్వాయుధాలవల్ల సంభవించే ప్రమాదాన్నుండి రక్షించేందుకు తాము సూచించిన ప్రతిపాదనల గురించి, తాము లేఖలు వ్రాసిన అణురహిత రాజ్యాలు ఏమి భావిస్తున్నదీ ఇంకా తమకు తెలియరాలేదని ప్రధాని శాస్త్రి అన్నారు.

వార్తాపత్రికలు అందజేసే సమాచారం నుండిగాక, ప్రభుత్వానికి చైనా త్వరలో రెండవ అణుబాంబు పరీక్షను జరుపనున్నట్లు తెల్సుకునేందుకు మార్గమేదైనావుందా? అని శ్రీ జి. శే కపూర్ ప్రశ్నించారు.

ప్రభుత్వానికి సమాచారాన్ని సేకరించే మార్గాలున్నప్పటికీ, వాటిని వెల్లడించ కూడదని ప్రధాని అన్నారు.

శ్రీ యం. డి. దేశాయి అడిగిన ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధాన మిస్తూ గత అక్టోబరు మాసంలో చైనా జరిపిన అణుబాంబు పరీక్షవల్ల కాశ్మీరులో ధార్మికశక్తి పెరిగినట్లు పరిశోధనలవల్ల బయల్పడలేదని శ్రీ శాస్త్రి అన్నారు.

శ్రీ సీతారామ్ కేసూరియా అడిగిన ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధానం చెబుతూ నేఫా ప్రాంత పాలన వ్యవహారాలను విదేశాంగమంత్రిత్వశాఖనుండి దేశీయాంగమంత్రి శాఖకు బదిలీచేసే విషయంపై ఇంకా ఏనేమి నిర్ణయం చేయలేదని శ్రీ శాస్త్రి అన్నారు

ఒక సభ్యు డడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ సార్వత్రిక, సంపూర్ణ నిరాయుధీకరణకు భారత ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నదని విదేశీ వ్యవహారాల మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ అన్నారు.

అణ్వాయుధ విసర్జన సమస్యను చర్చించేందుకు ప్రపంచ మహాసభ జరపాలని ఘనా అధ్యక్షుడుసూచించినట్లుపత్రికలలోవచ్చిన వార్తలను ప్రభుత్వం గమనించిందని శ్రీరామ్ సింగ్, శ్రీ లోక్‌నాథ్‌మిశ్రాలు, ప్రశ్నలకు వ్రాతపూర్వక సమాధానమిస్తూ విదేశాంగ మంత్రి తెలియజేశారు.

జెకొస్లొవాకియా ప్రధాని జోసెఫ్ లేనార్ట్

జెకొస్లొవాకియా విదేశాంగ మంత్రి డేవిడ్

జెక్ అతిథుల జీవితసంగ్రహాలు

జెకొస్లొవాక్ సామ్యవాద రిపబ్లిక్ ప్రధాన మంత్రి జోసెఫ్ లేనార్ట్ 1923 ఏప్రిల్ 3 న స్లొవాకియాలోని లిప్టొవ్‌స్కా పోరుబ్కాలో జన్మించారు. ప్రపంచంలో ప్రధాన మంత్రులందరిలోకి బహుశా ఆయనే చిన్నవాడేమో సెకండరీ విద్య నభ్యసించిన తరువాత ఆయన బాటా కంపెనీతో కార్మికుడుగానూ లేబొరేటరీ అసిస్టెంటుగానూ పనిచేశారు. అక్కడ ఒక రసాయనిక పాఠశాలలో విద్యనభ్యసించారు

నాజీలు జెకొస్లొవాకియా ఆక్రమించుకున్న కాలంలో జోసెఫ్‌లేనార్ట్ రహస్య ప్రతిఘటనోద్యమంలోనూ 1944 లో స్లొవాక్ జాతీయ తిరుగుబాటులోనూ పాల్గొన్నారు.

1945 లో జెకొస్లొవాకియా విముక్తి పొందిన పిమ్మట ఆయన కమ్యూనిస్టు పార్టీలోనూ, ఆర్థిక ప్రభుత్వ సంస్థలలోనూ అనేక పదవులను నిర్వహించారు. పార్టిజాన్‌స్కీలోని "ఆగస్టు 29 కర్మాగారా"నికి డైరెక్టరుగా పనిచేసిన పిమ్మట, ఆయన లఘుపరిశ్రమల శాఖలో డిప్యూటీ మంత్రి అయ్యారు తరువాత స్లొవక్ జాతీయ సభ అధ్యక్షుడుగా పనిచేశారు. 1963 సెప్టెంబరు 20 వ తేదీన జోసెఫ్ లేనార్టు చెకొస్లొవాకియా ప్రధాన మంత్రిగా నియమితులయ్యారు. ఆయన జాతీయ సభ (పార్లమెంటు)లోనూ, స్లొవక్ జాతీయ సభలోనూ. జెకొస్లొవాక్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధ్యక్ష వర్గంలోనూ సభ్యుడు

విదేశాంగ మంత్రి జీవిత సంగ్రహం

జెకొస్లొవాక్ సామ్యవాద రిపబ్లిక్ విదేశాంగ మంత్రి వాక్లావ్ డేవిడ్ 1910 సెప్టెంబరు 23 న తూర్పు బొహిమియా ప్రాంతంలోని స్టుడెనాలో జన్మించారు ఆయన వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులైన తరువాత ప్రాగ్‌లోని నెరెడికెబెన్ అనే ఇంజనీరింగు కర్మాగారంలో పనిచేశారు.

నాజీ ఆక్రమణ కాలంలో ఆయన ప్రతిఘటనోద్యమంలోనూ. నాజీలకు వ్యతిరేకంగా ప్రాగ్ ప్రజలు జరిపిన తిరుగుబాటులోను పాల్గొన్నారు. ఆయన జెకొస్లొవాక్ కమ్యూనిస్టు పార్టీ నాల్గవ రహస్య కేంద్ర కమిటీలో సభ్యులుగా వుండేవారు.

యుద్ధానికి పూర్వమూ, 1945 తర్వాతను వాక్లావ్ డేవిడ్ కమ్యూనిస్టు పార్టీలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించారు జెకొస్లొవాక్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీలో ఆయనిప్పుడు సభ్యులుగావున్నారు. ఆయన చాలాకాలం జెకొస్లొవాక్ పార్లమెంటు ఉపాధ్యక్షులుగా వున్నారు. 1953 నుండి ఆయన జెకొస్లొవాకియా విదేశాంగ మంత్రిగా వున్నారు

సంస్కృతభాషా పండితుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు

ప్రొఫెసర్లకు రు. 1600 యిస్తూ, పండితులకు కేవలం రు 150 ఇవ్వడం ఘోరమనిఖండన

విజయనగరం, ఫిబ్రవరి 28

శాసనమండలిలోని ఉపాధ్యాయ ప్రతినిధి శ్రీ యస్. టి. పి. వి. సూర్యాచార్యులుగారు విజయనగరం ప్రభుత్వ, మహారాజా సంస్కృత కళాశాల వార్షికోత్సవ సభలో ఉపన్యసిస్తూ సంస్కృత భాషా పండితుల పరిస్థితులు స్వాతంత్ర్యం రాకముందుకంటె ఈనాడు మెరుగైనాయని, అధికారులూ, సంస్కృతం తెలియని రాజకీయ నాయకులూ అభిప్రాయ పడుతున్నారనీ, పండితులుమాత్రం దానితో ఏకీభవించుటలేదనీ తెలిపారు. నిజానికి ప్రొఫెసర్ల, సంస్కృత పండితుల విద్యాబోధనలో ఏ విధమైన వ్యత్యాసమూ లేదన్నారు. అయినా వీరికి 16 వందల రూపాయలు యిస్తూ వుంటే, మన పండితులకు సుమారు 150/- రూపాయలు యిస్తున్నారనీ. ఇది శోచనీయమని తెలిపారు. ఇది అటుండనిచ్చి ధరలు అందరికి సమానమై సంస్కృత పండితులవారు బాధపడుతున్నారని ఆయన అన్నారు.

విజయనగరం ప్రభుత్వ మహారాజ సంస్కృత కళాశాల, ఉన్నత పాఠశాల 117వ వార్షికోత్సవములు ఫిబ్రవరి 27 న, ఆంధ్ర ప్రదేశ్ ప్రాచ్య పాఠశాలా పర్యవేక్షకులు శ్రీ చిపురుల మార్కండేయ శాస్త్రిగారి అధ్యక్షతను జరిగింది,

శ్రీసూర్యాచార్యులుగారు యింకా యిలా అన్నారు:

"అందరితోపాటుగా వీరికి కూడా వేతనాలు సమాన స్థాయిలో యివ్వాలనే అభిప్రాయం అధికారులకు లేదు. అందువలన మనం సంస్కృతం యొక్క ప్రాధాన్యతను సభలు సమావేశాలద్వారా వారి దృష్టికి తీసుకురావాలి. ఈ కృషి గత 10 ఏళ్ళ క్రితం కంటె యీనాడు సన్నగిల్లింది.

ఇందులో చదివిన విద్యార్థులు యితర పరీక్షలకు పనికిరారనే అభిప్రాయంలో వున్నందువలనే యీ విధంగా జరుగుతున్నది. ఇది సరికాదు. అన్ని పరీక్షలకు యీ విద్యార్థులు పనికివస్తారని మనం విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చచెప్పి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలి

సంవత్సరానికి 500 చొప్పున 4 సంవత్సరాల్లో 2 వేల స్కాలరుషిప్పులు యిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. ఇది అభినందించవలసిన విషయం."

కళాశాల మాజీ ప్రధానాచార్యులు శ్రీ తిరుమల నరసింహాచార్యులుగారు, కళాశాలలో గత 10 సంవత్సరాలనుండి నిలిచిపోయిన 'జ్యోతి' అనే వ్రాత పత్రికను ఆవిష్కరించారు. ఈ పత్రికను ప్రస్తుత కళాశాల ప్రధానాచార్యులు శ్రీ అప్పలాచార్యులకు బహూకరించారు.

ప్రారంభంలో శ్రీ అప్పలాచార్యులుగారు అతిథులను సభికులకు పరిచయం చేశారు.

అనంతరం 'మాతృదేవోభవ' అను తెలుగు నాటిక, "వేణీ సంహారము" అనే సంస్కృత నాటక తృతీయాంకం, 'ప్రతిఫలం' అనే తెలుగు నాటిక ప్రదర్శింపబడినవి. అంతకు ముందు ఆటలలో పాల్గొని విజయంపొందిన విద్యార్థినీ విద్యార్థినులకు శ్రీ మార్కండేయులు గారు బహుమతి ప్రదానం చేశారు,

వందన సమర్పణతో సభముగిసింది (వి. ఎ.)

కమ్యూనిస్టుపార్టీనిధికి

చంద్రగిరి తాలూకాలో రు 600 వసూలుకు నిర్ణయం

తిరుపతి, ఫిబ్రవరి 27

చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూకా, కమ్యూనిస్టు సమితి సమావేశం పానకం పంచాయతీ అధ్యక్షులు శ్రీ జి. రఘునాధరెడ్డిగారి అధ్యక్షత క్రింద తిరుపతి పార్టీ ఆఫీసులో జరిగింది. సమావేశమునకు సమితి సభ్యులెల్లరు హాజరైనారు. జిల్లాసమితి కార్యదర్శి శ్రీ కె కృష్ణారెడ్డి హాజరై జాతీయ అంతర్జాతీయ రాజకీయములపైన నివేదించారు. తాలూకా మొత్తంపైన (తిరుపతి మినహా) రు 600 ల పార్టీనిధిని వసూలు చేయవలెనని నిర్ణయించారు. మార్చి నెల మొదటి వారంలో 2 వ తేదీ మొదలు 8 వ తేదీవరకు తాలూకా సమితి సభ్యులెల్లరున్నూ, జిల్లాపార్టీ నాయకులు శ్రీ కె కృష్ణారెడ్డి, జి. శివయ్య శ్రీ వి రాజారెడ్డిగార్లతోకలిసి తాలూకాలోని ఆయా పార్టీ కేంద్రాలకువెళ్ళిపార్టీనిధివసూలుచేయుటకు రైతు సంఘం, కూలీసంఘం, యువజన సంఘాల సభ్యత్వములు చేర్పించునట్లుకూడ తీర్మానించారు. చంద్రగిరిఫిర్కాలో రసాయనిక ఎరువులకు రైతులు యిబ్బందులు పడుతున్నారనీ వెంటనే రైతులకు ఎరువులు విరివిగా లభించునట్లు చంద్రగిరి పంచాయతీ సమితి కృషిచేయవలెనని సమావేశంలో తీర్మానించారు.

శ్రీ బత్తుల పెదబసివిరెడ్డి మృతి

తేలప్రోలు, ఫిబ్రవరి 28

కృష్ణాజిల్లా, గన్నవరం తాలూకా తేలప్రోలు గ్రామ కాపురస్తుడు. ప్రస్తుతం పాతపాడు గ్రామంలో ఉంటున్న-బత్తుల పెదబసివిరెడ్డిగారు ఈనెల 24 వ తేదీని కలరా వ్యాధివల్ల అకాలమరణం చెందారు.

శ్రీ బసివిరెడ్డి గత 15 సంవత్సరాలుగా కమ్యూనిస్టుగా. ప్రజాసేవకుడుగా తేలప్రోలు గ్రామంలోనేగాక పాతపాడు. సీతారామపురం మంగళాపురం. అప్పారావుపేట ఏరియాలో కూడా ఉత్తమ ప్రజాసేవకుడుగా ప్రజలచే గుర్తింపబడి పాతపాడు పంచాయతీబోర్డు ఉపాధ్యక్షులుగాకూడా ఎన్నుకోబడ్డారు.

శ్రీమతి సరెళ్ళ నరసమ్మగారి మృతి

రాజోలు, ఫిబ్రవరి 28

తూర్పు గోదావరిజిల్లా, రాజోలు తాలూకా చింతలపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి సరెళ్ళ నరసమ్మగారు (శ్రీ సరెళ్ళ రామారావుగారి తల్లి) ఫిబ్రవరి 16 న అమలాపురంలో మరణించారు ఈమె యిటీవల రెండు సంవత్సరములకు పైగా పక్షవాతంతో బాధపడుచున్నారు.

ఆమె మరణవార్త తెలిసిన వెంటనే జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ అల్లూరి వెంకట్రామరాజు. ముక్కపూడి సూర్యనారాయణ తాలూకా కమ్యూనిస్టు కమిటీకార్యదర్శి శ్రీ చింతపల్లికృష్ణమూర్తి వగైరాలురామారావుగారిని పరామర్శించి వచ్చారు. (వి. ఎ.)

రాజమండ్రి ప్రెస్ కార్మిక మహాసభ

(1 వ పేజీ తరువాయి)

కుని రేట్లు పడిపోతున్నాయి. పనిలో పోటీని తట్టుకోవడం కష్టమౌతుంది. కార్మికుడు కష్టపడి పనిచేస్తే సహకార ఉద్యమం బాగుపడుతుంది. కాబట్టి పరస్పరవిశ్వాసం, చైతన్యంతో కార్మికులు యిందుకు సాగాలి.

రాష్ట్ర ప్రెస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు. శ్రీ బనిసెట్టి అప్పారావుగారు మాట్లాడుతూ. కేంద్రీకరణ కావలసిన ప్రెస్సు పనిలో క్రమంగా కంపోజింగు. ప్రెసింగు ప్రింటింగు వేరు వేరుచోట్ల తయారై వికేంద్రీకరణ జరిగి, గృహ పరిశ్రమగా తయారైన కారణంగా ప్రెస్ కార్మికుల జీతాలు పెరగకుండా పోతున్నాయన్నారు. దేశంలో రెండవ పరిశ్రమగా స్థానం ఆక్రమించిన ప్రింటింగ్ పరిశ్రమలో పనిచేసే కార్మికులపట్ల కనీస ప్రాముఖ్యాన్ని కూడ చూపడం లేదన్నారు

ప్రభుత్వ సహకారంలేని పరిశ్రమను అభివృద్ధి చేయాలనే కోరిక యజమానులకు లేనిపరిస్థితిలో ఈ కోపరేటివ్ సంస్థ ఆలోచన కలిగిందనీ తెలిపారు. ఇతరుల అనుభవాలద్వారా తూర్పు గోదావరిజిల్లా కోఆపరేటివ్ ప్రెస్ కార్మికులు తమ ప్రెస్సును నడపాలన్నారు. రాష్ట్ర యూనియన్ ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తోందనీ. దానికి పూర్తి సహకారం ఆయాశాఖలు యివ్వాలని కోరారు.

రాష్ట్ర యూనియన్ కార్యదర్శి శ్రీ ఎల్. జోగారావుగారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాపితంగా ప్రెస్‌కార్మికులు అనుభవిస్తున్న కష్టాలు వివరించి గత్యంతరంలేక యీ జీవితాన్ని గడుపుతున్నారన్నారు. నాలుగు తెలుగు దినపత్రికలు వెలువడుతున్న విజయవాడలో కార్మికుల పరిస్థితి మరింత హీనంగా వుందని, పైము ప్రకారం పనిచేసే కొన్ని దినపత్రికలలోని కార్మికులు పీసు రేట్లపనికి వెడుతున్నారని. అలాంటప్పుడు పెర్మనెంటు వర్కర్లను ఎవరు పెట్టుకుంటారని అన్నారు, రాష్ట్రాని కంతకూ తలమానికగావుండే ప్రెస్ కార్మిక వుద్యమం వున్న విజయవాడలోనే అది బలహీనపడిందన్నారు.

ఆ తర్వాత కార్యదర్శి శ్రీ లోలుగు సూర్యనారాయణ యూనియన్ జమా-ఖర్చులను. వార్షిక నివేదికను సమర్పించారు. ఆ తర్వాత రాజమండ్రి ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ కన్వీనర్ శ్రీ ఎ. వి. రమణయ్య. విజయవాడకు చెందిన శ్రీయుతులు ఎ. దుర్గారావు, గుడివాడ సుబ్బారావు: కె. కృష్ణమూర్తి (గుంటూరు). సత్యనారాయణ పంతులు (తెనాలి) బి రంగదాస్ (బందరు). ముళ్ళ ఆదినారాయణ (రాజమండ్రి) గార్లు కూడా ప్రసంగించారు.

నూతన కార్యవర్గం

నూతన సంవత్సరానికి అధ్యక్షులు గా శ్రీ నీలం నాగేశ్వరరావు. ఉపాధ్యక్షులు గా శ్రీ మదళా కృష్ణమూర్తి. కార్యదర్శిగా శ్రీలోలుగు సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి శ్రీ కొట్టాపు లక్ష్మణస్వామిగార్లను, మరి తొమ్మండుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు

తీర్మానాలు

మహాసభ ఈ క్రింది తీర్మానాలను ఆమోదించింది.

"1961 లో జరిగిన రాజమండ్రి ప్రెస్ వర్కర్సు యూనియన్ రజతోత్సవ సందర్భములో, ప్రెస్‌కార్మికులకు కనీసవేతనాలను నిర్ణయించుటకు ఒక కమిటీని ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడింది తదనంతరం ఇట్టి కమిటీని వేయుటకు ప్రభుత్వం సంకల్పించినట్లు పత్రికా ప్రకటనగూడా వచ్చింది. కాని ప్రకటన జరిగి ఇప్పటికి నాలుగేండ్లయినా కార్యాచరణకు రానందుకు యీ మహాసభ తన తీవ్ర విచారాన్ని ప్రకటిస్తూవున్నది. గత నాలుగేండ్లలోనూ కార్మికుల కష్టాలు మరింతగా పెరిగిపోయాయి. జీవన వ్యయభారం బహు భారాకారంగా పరిణమించింది. జీతాలు మాత్రం పూర్వంలాగే ఉన్నాయి. కార్మికులుఇక ఈభారాన్ని ఏమాత్రం తట్టుకోలేరు. కనుక ఇకనైనా ప్రభుత్వం కదలి, తన వాగ్దానాలకు క్రియా రూపమిచ్చి, కనీసవేతన నిర్ణయ సంఘాన్నివేసి, సాధ్యమైనంత త్వరలో కనీస వేతన చట్టాన్ని తీసుకురావలసిందిగా. యీ మహాసభ ప్రభుత్వాన్ని కోరుతున్నది."

వెంటనే రూపాయికి పావలా జీతం పెంచాలి

"నిత్యజీవితావసర వస్తువులధరలు దినందినం పెరిగి చుక్కల నంటుతున్నాయి "రాజమండ్రి మాస్టర్ ప్రింటర్సు అసోసియేషన్" వారు తమకు అవసరమైన ఇంకులు, పేపరు రేట్లు పెరిగినందుకు ప్రింటిగు రేట్లు పెంచుతున్నారు. కాని కార్మికుల జీవనవ్యయ భారం పెరుగుదలను వారు గమనించక పోవడం కడుశోచనీయం. 1963 నుండి పలుమార్లు జీతాలు పెంచమని అభ్యర్థించినా యజమానులు నిర్లక్ష్యం వహించడాన్ని ఈసభ నిరసిస్తోంది. కడకు గత సెప్టెంబరు నెలలో పెరిగిపోతున్నధరలను చూచాయగానైన అందుకోవడానికి తక్షణం రూపాయికి పావలా వేతనం పెంచవలసిందిగా యజమానులకు ఇచ్చిన నోటీసు కూడా బుట్టదాఖలు చేయబడడం మరీ ఘోరం కాన ఇకనైనా అలక్ష్యంచేయ్య

రూపాయికి పావలా చొప్పున. ప్రెస్ కార్మికులకందరికీ వేతనాలను పెంచవలసిందిగా యీ మహాసభ ప్రెస్ యజమానులను కోరుచున్నది "

'తూర్పు గోదావరి జిల్లా కో - ఆపరేటివ్ ప్రింటింగ్, అండ్ పబ్లిషింగ్ సొసైటీ లిమిటెడ్" పేరుతో ఒక సొసైటీని రిజిష్టరు చేయమని తేదీ 5.4.1964 న డిప్యూటీ రిజిష్ట్రారుకు దరఖాస్తు చేసినాము. ఇప్పటికి ఏడాది కావస్తున్నా సొసైటీ రిజిస్ట్రేషన్ కానందువల్ల ఈ మహాసభ ఆందోళన చెందుతూ, వెంటనే సొసైటీ రిజిస్ట్రేషన్ను పూర్తి చేయమని కో-ఆపరేటివ్ డిపార్టుమెంటునభ్యర్థిస్తున్నది."

"కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బోనసును. ప్రెస్ పరిశ్రమలో - పరిశ్రమ లాభనష్టాలతో నిమిత్తం లేకుండా- ప్రెస్ కార్మికులందరికీ అమలు జరపాలి."

"ప్రస్తుతంఅమలులోనున్న ఫ్యాక్టరీ ఆక్టును సవరించి ఎంత తక్కువ మంది పనిచేస్తున్నా ప్రెస్ పరిశ్రమ అంతటికీ వర్తించాలి"

"దేశంమొత్తంపై ఏకారణం చూపకుండా 900 మంది కార్మిక కార్యకర్తలు, కార్మిక నాయకులను అరెస్టుచేసి ప్రజా స్వామిక హక్కులకే విఘాతం కల్గించిన ప్రభుత్వ నిరంకుశ చర్యను ఈ మహాసభ ఖండిస్తున్నది. తక్షణం అరెస్టుచేసిన కార్మిక కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండు చేస్తున్నది." (వి. ఎ.)

నిట్టల సోదరులకు పితృవియోగం

అమలాపురం, మార్చి 1

అమలాపురం తాలూకా తాడేలంక నివాసులు బుర్రకథకులు నిట్టల సోదరుల తండ్రి ఫిబ్రవరి 24 వ మృతిచెందారు. వారి వయస్సు 82 సంవత్సరాలు.

నిట్టల సోదరులు కమ్యూనిస్టుపార్టీకి అండగా వుంటూ బుర్రకథలద్వారా, వైజ్ఞానిక కార్యక్రమాలద్వారా పార్టీకి ఎంతో అండగావుంటూ కళాకారులుగా పేరుపొందారు.

లేఖలు

సిద్దిపేట తాలూకాలో ఎరువుల కరువు

మహాశయా,

మెదక్ జిల్లా సిద్దిపేట తాలూకాలో రెండు మాసాలనుండి ప్రభుత్వ గోదాములలో ఎటువంటి ఎరువుకూడ దొరుకుటలేదు. ఇది వ్యవసాయదారులు ఎరువులు వేసుకునే తరుణము, తాలూకాలోగల రెండు పంచాయతీ సమితులనుండి వందలాదిమంది రైతులు, బి. యం. యస్. లోన్ క్రింద ఇవ్వబడే ఎరువుల కొరకు సమితులనుండి. చీటీలుతీసుకొని. గోదాముచుట్టు తిరిగి పోతున్నారు. వేలాది రైతులు డబ్బులు చెల్లించి ఎరువులు. కొనుటకు వేచియున్నా. ఎరువులు దొరుకుటలేదు బస్తా అమోనియం బ్లాకుమార్కెట్‌లో రు. 60 చొప్పున కొంటున్నారు, స్థానిక వ్యవసాయాధికారులకు రైతులు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా వినిపించుకోవడములేదు అదే విధంగా వ్యవసాయ నిమిత్తము ప్రభుత్వము సిద్దిపేటకు మూడు మాసాలకు 80 రేకులు అలాటు చేస్తున్నది. అవికూడా సక్రమంగా రావటము లేదు సిద్దిపేట తాలూకాలో మొత్తము వ్యవసాయం బావులపై ఆధారపడియున్నది. కాబట్టి ప్రతిరైతుకు మోటకు ఇతర పనులకు రేకులు ఎంతో అవసరము. దురదృష్టము ఏమనగా వచ్చే రేకులుకూడ వ్యవసాయదారులకు దొరుకుటంలేదు. ఒక్క రేకు కావాలన్నా జిల్లా వ్యవసాయాధికారి అనుమతి పొందాలి

సిద్దిపేట తాలూకా నుండి జిల్లావ్యవసాయాధికారి ఉండే జిల్లా కేంద్రము, 110 మైళ్ళదూరములో యున్నది. రు. 12 లు. ఛార్జీలుగా ఖర్చులు పెట్టుకొనవలసి వస్తుంది. ఈ ఖర్చులు, భరించలేక రైతులు, బ్లాకు మార్కెట్‌లో కొనక తప్పడంలేదు. ఈ విషయం కూడ జిల్లాకలెక్టర్ దృష్టికి తేబడింది.

ఈ పద్ధతిని చూస్తే ప్రభుత్వం అధికోత్పత్తికి అడ్డము వస్తున్నదా అనిపిస్తున్నది. కావున ప్రభుత్వం వెంటనే ఈ పరిస్థితిని నివారించటానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము ఇట్లు.

యం సిరాజుద్దీన్ కార్యదర్శి.
సిద్దిపేట తాలూకా కమ్యూనిస్టు సమితి.

పరస్పరవిశ్వాసమే వాణిజ్యానికిఆధారం

పశ్చిమ జర్మనీతో చర్చపై సోవియట్ ప్రధాని వ్యాఖ్య

లీప్‌జిగ్, మార్చి 2

నిన్నటి రోజున లీప్‌జిగ్ పారిశ్రామిక ప్రదర్శన చూడవచ్చిన సోవియట్ ప్రధాని కోసిగిన్ జర్మనువార్తాసంస్థకిచ్చినఇంటర్వ్యూలో పశ్చిమ జర్మనీతో వ్యాపారం జరుగుతుందనే నమ్మకం తమకు లేదన్నారు.

మరో కొత్త వాణిజ్య ఒడంబడికకోసం మాస్కో-బాన్‌లమధ్య చర్చలు ప్రారంభమవుతాయనే నమ్మకం తనకులేదు పరస్పరవిశ్వాసం వున్నప్పుడే చర్చలు, ప్రస్తుతం సోవియట్‌కూ, పశ్చిమజర్మనీకీ మధ్యలేనిదే అది."

విముక్తి ఉద్యమాలకు ఆఫ్రికా ఆసియా అండ

అల్జీర్స్, మార్చి 1

ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలల్లోని ప్రజల విముక్తి పోరాటాలకు ఆఫ్రికా ఆసియా దేశాల అండదండలను మద్దత్తును పునరుద్ఘాటిస్తూ నిన్న ఇక్కడ జరిగిన ఆఫ్రికా - ఆసియా దేశాల ఆర్థిక గోష్టి ఒక ప్రకటన జారీచేసింది.

సభలు-సమావేశాలు

భద్రాచలం తాలూకా గ్రామోద్యోగుల సంఘ మహాసభ 12-3-65 తేదీ సాయంత్రం 3 గంటలకు భద్రాచలం తిరుపతి దేవస్థాన సత్రములో జరుగుతుంది.

• • •

ఆంధ్రప్రదేశ్ హరిజన, గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల, ప్రభుత్వ పారితోషక సంస్థల సంక్షేమ అసోసియేషన్ (రిజిష్టర్డు) హైదరాబాద్. 7 వ వార్షిక సర్వసభ్య సమావేశము 1965 మార్చి 4 వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్, గాంధి భవన్‌లో జరుగుతుంది. శ్రీ వేముల కూర్మయ్య అధ్యక్షత వహిస్తారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారు.

విలేకరులకు ముఖ్య సూచనలు

'విశాలాంధ్ర' పత్రికకు వార్తలు, వ్యాసాలు పంపు విలేకరులు. తదితరులు దయతో క్రింది సూచనలు పాటించవలెనని కోరుచున్నాము.

1. కాగితానికి ఒక ప్రక్కన మాత్రమే వ్రాయాలి.
2. సిరాతో స్పష్టంగా చదువగలుగునట్లు విడి విడిగా వ్రాయాలి. గొలుసు కట్టుగా వ్రాయకూడదు.
3. జిల్లా. తాలూకాలను పేర్కొనాలి.
4. విషయం సుబోధకంగా వుండాలి.
5. వార్తలు - వ్యాసాలు తెలుగులోనే వుండాలి.
6. ఆలస్యం లేకుండా పంపాలి.
7. 'విశాలాంధ్ర' పత్రిక కొరకు పంపే వార్తలు - వ్యాసాలు మొదలైనవి 'ఎడిటర్- విశాలాంధ్ర' అని మాత్రమే వ్రాయాలి.

— సం.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, ఫిబ్రవరి 3

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు28-2-65న అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయబడిన టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు)

ధాన్యం			
		100 కి.	75 కి.
సంబర్లు:	విజయవాడ	రు. 45 00	33-75
"	కాకినాడ	45 00	33 75
"	చిత్తూరు	40 00	30 00
అక్కుళ్లు:	విజయవాడ	39 00	29 25
"	తాడేపల్లిగూడెం	39 00	29 25
"	కాకినాడ	39 00	29 25
"	అముదాలవలస	38 00	28 50
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	41 00	30 75
సన్నాలు:	అముదాలవలస	41 00	30 75
మొలకొలుకులు:	నెల్లూరు	45 00	33 75
మిల్లు బియ్యం			
సంబర్లు:	విజయవాడ	రు. 74 06	
"	కాకినాడ	74 06	
అక్కుళ్లు:	విజయవాడ	63 00	
"	తాడేపల్లిగూడెం	63 00	
"	కాకినాడ	63 00	
"	అముదాలవలస	63 00	
సన్నకృష్ణ కాటుకలు:			
"	తాడేపల్లిగూడెం	67 78	
సంబర్లు	చిత్తూరు	79 87	
సన్నాలు:	అముదాలవలస	67 76	
మొలకొలుకులు:	నెల్లూరు	76 80	
వేరుశనగ			
కాయలు	విజయవాడ	68-88	
"	నంద్యాల	87 50	
"	ఆదోని	88 75	
"	విజయనగరం	90 00	
పప్పు	విజయవాడ	126 00	
"	నంద్యాల	120 83	
"	ఆదోని	115 00	
"	విజయనగరం	128 60	
నూనె	విజయవాడ	228 06	
"	నంద్యాల	225 00	
"	ఆదోని	214 50	
"	విజయనగరం	235 55	
అపరాలు			
కందులు:	విజయవాడ	రు. 74 00	
"	గుంటూరు	76 00	
"	అముదాలవలస	—	
మినుములు:	విజయవాడ	64 00	
"	గుంటూరు	61 00	
"	అముదాలవలస	64 00	
పెసలు:	విజయవాడ	70 00	
"	గుంటూరు	72 00	
"	అముదాలవలస	64 51	
శనగలు:	విజయవాడ	115 00	
జొన్నలు			
అనంతపురం:	తెల్లవి	59 00	
నంద్యాల:	పచ్చవి	59 00	
బెల్లం			
అనకాపల్లి:	మొదటిరకం	59 30	
"	మూడవరకం	46 90	
చిత్తూరు	మొదటిరకం	54 32	
"	మూడవరకం	42 67	
జీడిపప్పు			
మోరి	అమెరికన్‌రకం	రు. 718 20	
"	దేశవాళి	681 80	
"	బద్దలు	590 90	
"	ముక్కలు	381 80	
మిర్చి			
జి2 ఒకటవ రకం	గుంటూరు	100 00	
జి రెండు 2వ రకం	"	155 00	
జి 2 తర్ల రకం		—	
నెయ్యి			
		నల్లాడు	దేశవాళి
గుంటూరులో		610 00	620 00
కొబ్బరికాయలు			
(వెయ్యింటికి ధరలు)		కొత్తవి:	పాతవి
విజయవాడ:		275 00	300 00
రాజమండ్రి		230 00	265 00
పాలకొల్లు		170 00	240 00
పసుపు			
దుగ్గిరాలలో	కొమ్ములు	రు. 133 50	
"	కామ్యారు	156 06	
"	దుంపలు	101 00	
కడపలో	కొమ్ములు	129 00	
"	దుంపలు	91 00	



పెట్టుబడిదారీపంథాలో గుత్త వర్గాల లాభాల పెరుగుదల

ప్రణాళికల ఫలితాలపై ఒక సమీక్ష

ఆర్థికమంత్రి శ్రీ కృష్ణమాచారి తృతీయ ప్రణాళికాకాలంలో దేశ ఆర్థిక పరిస్థితుల గురించిన ఒక సమీక్షను గతవారం పార్లమెంటుకు సమర్పించారు ధరలు పెరిగినమాట నిజమేనని ఇష్టంలేకపోయినా ఆయన అంగీకరించారు వస్తు ఉత్పత్తి కుంటుపడిందనీ చెప్పారు విదేశాలకు పెద్ద పెట్టున ఋణపడుతున్నామనీ చెప్పారు అయితే ఆయన కొన్ని విషయాలను మాత్రం చెప్పకుండా విడిచిపెట్టారు అది ఉద్దేశపూర్వకమేననుకోవడంలో తప్పేమీ లేదు

ఆయన అలాగే విడిచిపెట్టిన అంశాలలో గుత్త పెట్టుబడిదారీ సంస్థల లాభాలకు సంబంధించిన అంశం ఒకటి. శ్రామిక ప్రజల నిజ వేతనాల స్థాయి తరుగుదల గురించిన అంశం మరొకటి

టాటా మొదలు క్రింది వరకూ ఆ కోవకు చెందినవారంతా యిటీవల ప్రభుత్వ కంట్రోళ్ల విధానాన్ని అదే పనిగా విమర్శిస్తూ దేశ పారిశ్రామికాభివృద్ధి కుంటుపడుతూవుందని గగ్గోలు పెడుతున్నారు. అయినా వారికి అపారలాభాలు వస్తూనే వున్నాయి

టాటా ఐరన్ అండ్ స్టీల్ (టిస్కో) కంపెనీకి 1962 లో వచ్చిన నికర లాభం రు. 608 86 లక్షలు. ఆ మరుసటి వత్సరం రు. 1055.68 లక్షలు. ఆ తరువాత 1964 లో రు. 1647.12 లక్షల లాభాలు వచ్చాయి అంటే మూడు సంవత్సరాలలో ఆ కంపెనీ లాభాలు మూడురెట్లు పెరిగాయి

టాటా కుటుంబానిదే ఓలాస్ అనే మన సంస్థ వుంది. ఈ సంస్థ 1962లో రు. 137 48 లక్షలు, 1963 లో 178 87 లక్షలు లాభం సంపాదించింది. 1964 సంవత్సరం సమాచారం తెలియలేదు.

టాటా కంపెనీ పరిశ్రమల్లోకల్లా లాభాల రేటు కొంతతగ్గుదలకనపించింది టెల్కోలో మాత్రమే, ఆ అదైనా అతి స్వల్పమే. ఆ సంస్థకు 1962లో వచ్చినలాభం రు. 378.30 లక్షలు కాగా 1963లో రు. 361 61 లక్షల మేరకు తగ్గింది.

ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీకి 1963లో రు. 911 89 లక్షలు. 1964 లో 1151 21 లక్షల లాభమొచ్చింది. మార్టిన్‌బర్న్ కంపెనీ లాభం 1962-1963 మధ్య రు. 78.17 లక్షలనుండి రు. 91 60 లక్షలకు పెరిగింది.

ఇంజనీరింగ్ పరిశ్రమ

ఇంజనీరింగ్ పరిశ్రమ బాగా లాభసాటిగా వుందని ఆర్థికమంత్రి స్వయంగా చెప్పారు. బారు.

గెస్టు, కీన్ అండ్ విలియమ్స్ అనే యింజనీరింగ్ సంస్థ లాభం ఒక సంవత్సరకాలంలో సుమారు రెట్టింపు పెరిగింది. 1962 లో ఆ సంస్థ లాభం రు 127.55 లక్షలు 1963 లో రు 217 43 లక్షలు. అదేవ్యవధిలో బ్రెయిత్‌వైట్ అనే మరో కంపెనీ లాభాలు రు 106 44 లక్షలనుండి 124 47 లక్షలకు పెరిగాయి

మరికొన్ని యింజనీరింగ్ పారిశ్రామిక సంస్థల లాభాలు ఈ క్రింది విధంగా వున్నవి.

(లక్షల రూపాయలు)

	1962	1963
బర్న్ అండ్ కో	రు 139.62	142.69
బ్రిటిష్ యిండియా కార్పొరేషన్	రు 134 25	220.29
ఇండియన్ స్టాండర్డు వాగెన్ కంపెనీ	రు 171.88	179 18

ఇంజనీరింగ్ గ్రూప్‌లో కొద్దిపాటి లాభం తగ్గింది ఒక్క జెస్సప్ కంపెనీకి మాత్రమే. 1962 లో ఆ కంపెనీకి రు 152 79 లక్షల లాభం వచ్చింది. 1963 లో రు 147 51 లక్షలొచ్చింది.

బిర్లా కుటుంబానికిచెందిన హిందూస్తాన్ మోటార్స్ పరిశ్రమకు 1962 లో రు 313 19 లక్షలు, 1963 లో రు 350.00 లక్షలు లాభం వచ్చింది.

జూట్ పరిశ్రమ చాలా కష్టదశలో వుందని చెబుతారు, అయితే ఆ పరిశ్రమలోనూ బిర్లాలకు మంచి లాభాలేవచ్చాయి. వారి జూట్ కంపెనీకి 1962 రు. 96 65 లక్షలు, 1963 లో 139 85 లక్షల లాభం వచ్చింది.

మెగ్నా జూట్ కంపెనీకి 1962లో రు 17.33 లక్షల నష్టం వచ్చింది. 1963 లో అదేకంపెనీకి 107.37 లక్షల లాభం వచ్చింది.

ఇంపీరియల్ టొబాకో కంపెనీకి 1962 లో వచ్చిన నికర లాభం రు 321.94 లక్షలు కాగా 1963 నాటికి రు. 446.29 లక్షలకు పెరిగింది.

వివిధ పరిశ్రమలకు చెందిన కొన్ని పెద్ద కంపెనీలుగూడా బాగా లాభాలు ఆర్జించాయి

(లాభాలు లక్షల రూపాయల్లో)

	1962	1963	1964
ఇండియన్ అల్యూమినం	240 34	374 31	
ఇండియన్ కేబుల్స్	137 49	258 84	189.87
ఇండియన్ ఆక్సిజన్	135 49	140 40	159 38
కేసోరామ్ ఇండస్ట్రీస్	100 74	107 12	150 15
రోహతాస్ యిండస్ట్రీస్	49 28	122 07	76.94
యూనియన్ కార్బైడ్	186 24	268 68	—
ఫిలిప్స్ ఇండియా	120 21	165 57	—

బ్యాంకులు

ఈ కాలంలో బ్యాంకింగ్ పరిశ్రమ కూడా బాగా లాభాలు గడించింది.

	1962	1963
బ్యాంక్ ఆఫ్ బరోడా	63.00	75 00
బ్యాంక్ ఆఫ్ ఇండియా	111 53	125.00
సెంట్రల్ బ్యాంక్	179 95	189 26
పంజాబ్ నేషనల్ బ్యాంక్	113 83	125 56
యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్	74 32	76.42

పారిశ్రామిక లాభాల రేటు

పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల పారిశ్రామిక లాభాల రేటు. 1955-56=100 పాయింట్లు ప్రాతిపదికమీద యీ దిగువ శాతాన పెరిగింది

	శాతం
1956-57	109.7
1958-59	113.0
1960-61	166 1
1961-62	178 5
1962-63	194 6

ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలలో లాభాల శాతం మరింత పెద్దగా పెరిగింది.

1956-57	119 5
1958-59	144 7
1960-61	200 2
1961-62	233 7
1962-63	258.8

(రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సమాచారం.)

శ్రామిక ప్రజల స్థితిగతులు

ఇలా పెట్టుబడిదారీ వర్గం కోట్లు, లక్షల లాభాలార్జిస్తూ వుండగా మరోవైపు శ్రామిక ప్రజల దైన్యం నానాటికీ పెరుగుతూవుంది. దేశ ఆర్థిక పరిస్థితిని సమీక్షించిన ఆర్థిక మంత్రి యీ వాస్తవాన్ని తెలగా దాటవేశారు

నిజవేతనాలు

మొదటి ప్రణాళికా కాలంలో ఫ్యాక్టరీ కార్మికుల నిజవేతనాలు కొద్ది మాత్రంగా పెరిగాయి అయితే, రెండవ ప్రణాళిక దశలో వీటిస్థాయి బాగా పడిపోయింది. ఫ్యాక్టరీ కార్మికుల ద్రవ్య వేతనాల స్థితిగతులు సమీక్షించిన రిజర్వు బ్యాంక్ స్వయంగా యీ విషయాన్ని నిర్ధారణ చేసింది.

1961 నాటికి వీరి నిజవేతనాల సూచిక 115 పాయింట్లు వుంది. అంటే 1955 నాటి 124 పాయింట్ల సూచికకంటె 7 పాయింట్లు తగ్గింది. (నిజవేతనాల సూచిక ప్రాతిపదిక 1951 సంవత్సరం-100 పాయింట్లు).

ద్రవ్యరూపంలో చూస్తే మాత్రం వేతనాలు 1955 నాటికి 118 పాయింట్లు నుండి 1961 నాటికి 138 పాయింట్లకు పెరిగినట్లు కన్పిస్తుంది.—

ఆ తరువాతి సంవత్సరాలలో నిజవేతనాల, ద్రవ్య వేతనాల సమాచారం అందుబాటులో లేదు అయినా 1961 దరిమిలా వినిమయ వస్తువుల ధరలసూచి 30 శాతం మేరకు పెరగడాన్ని బట్టీ, ద్రవ్యరూపంలో వేతనాలు ఆ మేరకు పెరగక పోవడాన్ని బట్టీ నిజవేతనాలు ఆ మోతాదులో తగ్గిపోయినట్లే అర్థం చేసుకోవచ్చు.

అదేగాక దేశంమొత్తంమీద ఫ్యాక్టరీకార్మికులలో 41 శాతానికి మాత్రమేవినిమయవస్తువుల ధరల సూచికలతో జత పరిచిన కరువు భత్యం అమల్లోవుంది. ఆకరువు భత్యమైనా సూచికల పెరుగుదల మొత్తానికి సరిసమానంగా యివ్వబడటంలేదు. అదీగాక జీవన వ్యయసూచికలు, ధరల సూచికలూ చాలా తప్పుల తడకగానూ, మోసపూరితంగానూ వుంటున్నవి

పరిస్థితి యిలా వుండగా అనేక రాష్ట్రాలలో 1962 లో దరిమిలా ద్రవ్య రూప వేతనాల స్థాయి పడిపోతూవుంది ఈ విషయాన్ని ప్రభుత్వ లేబర్ బ్యూరో యే యిటీవల వెల్లడి చేసింది.

ఆంధ్రలో ఫ్యాక్టరీ కార్మికుల తలసరి ఆదాయం రోజుకు రు 3 96 నుండి రు2 90కి అస్సాంలో రు. 2.96 నుండి రు 2 85కి, బీహార్‌లో రు 4.49 నుండి రు. 4 35కి, పంజాబ్‌లో రు 3 93 నుండి రు. 3.88 కి; పశ్చిమ బెంగాల్‌లో రు. 4 35 నుండి 4 28కి; ఢిల్లీలో రు. 5.06 నుండి 3 48కి తగ్గింది.

మిగతా రాష్ట్రాల్లో యీ ఆదాయం స్థాయి కొద్దిపాటిగా పెరిగినా. ఫ్యాక్టరీ కార్మికుల (నెలకు రు. 200 లలోపు ఆర్జన పరుల) దినసరి ఆదాయం సగటు దేశం మొత్తంమీద పూర్వపు స్థితిలోనే నిలిచివుంది.

ప్రభుత్వ ఉద్యోగుల, గుమాస్తాల తరగతి వారి పరిస్థితి మరింత దారుణంగా వుంది.

ప్రభుత్వ ఉద్యోగుల నిజవేతనం స్థాయి 1947 నాటికంటే 14 శాతం తగ్గింది.

1947 సంవత్సరం వందపాయింట్లు ప్రమాణంగా వారి నిజవేతనాలు 84 పాయింట్లు స్థాయిలోనూ ద్రవ్య వేతనాలు 158 పాయింట్ల స్థాయిలోనూ వున్నది

కరువుభత్యంతోసహా అంతాకలిపి నెలకు రు 87 ల వేతనంపొందే క్రింది తరగతివారి పరిస్థితిఇదైతే యీ అంచనా వేయబడింది. ఆ పైశ్రేణి వుద్యోగుల నిజవేతనాల స్థాయి తగ్గుదల మరింత అధికంగా వుంటుంది.

కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగుల వేతనాల్లో కొద్దిపాటి పెంపు చేసింది. అయితే గత సంవత్సరకాలంలోనే ధరలు మరో 18.3 శాతం పెరిగాయి.

దేశ ఆర్థికమంత్రి తయారు చేసిన ఆర్థిక పరిస్థితి సర్వేలో యీ వాస్తవాంశాల ప్రస్తావన లేనేలేదు, ప్రణాళికా బద్ధమైన ఆర్థికవ్యవస్థనూ సమగ్రమైన దేశాభివృద్ధినీ వాంఛించే వర్గాలు యీ అంకాన్ని విస్మరించ వీలులేదు.

సగటున తలసరి లెక్కలో జాతీయాదాయం 77 పైసలు

కాంగ్రెస్ పాలనలో మన దేశం సాధించిన "అభ్యుదయం" అంటూ ప్రణాళికా సంఘం ఒక సమీక్షను ప్రచురించింది

ఈ ప్రగతి తీరు తెన్నులెలావున్నవో చూపే మచ్చు తునకలు కొన్ని చూడండి:

వస్తు వినిమయస్థాయి

మూడో ప్రణాళికా కాలంలో మొదటి మూడు సంవత్సరాలలో తలసరి వస్తు వినిమయ స్థాయిలో యేలాంటి పెరుగుదలాలేదు.

తలసరి జాతీయాదాయం

1960-61 సంవత్సరం ధరలస్థాయి మేరకు ఆసంవత్సరం తలసరి జాతీయాదాయం నెలకు రు 320 లు వినిమయస్థాయి సగటున తలసరి రు 270 రూపాయలు అంటే రోజుకు 77పైసలకు (నెలకు 23 రూపాయలు)సుమారు మించడంలేదు. ఈ ప్రణాళిక మొదటి మూడు సంవత్సరాల్లోనూ యీ పరిస్థితి యథాతథంగానే ఉంది.

● వర్తమాన పరిస్థితుల్లో యీ రు 23 ల తలసరి ఆదాయంతో మన దేశప్రజలు యెంతటి దారిద్ర్యం అనుభవిస్తున్నారో తెలియజేస్తుంది. సాధారణంగా అత్యధికసంఖ్యలోవుండే ప్రజల జీవిత పరిస్థితి యీ సగటుకంటే గూడా చాలా హీనస్థితిలోనే వుందని ప్రణాళికా సంఘం అంగీకరించింది.

● దేశ జనాభాలో 60 శాతం కంటే పైగా తలసరి నెలకు రు 25 ల కంటే తక్కువే ఖర్చుపెట్టగలిగిన స్థితిలో వున్నాయి సుమారు మూడోవంతు జనాభా తలసరి వినిమయస్థాయి నెలకు రు 15 లు మాత్రమే.

● ఆహార నిపుణుల సలహాసంఘం సూచించిన మేరకైనా సాధారణ రకపు ఆహారానికి తలసరి నెలకు రు 35 లు ఖర్చు చేయాల్సి వుంటుంది. అమాత్రంఖర్చైనా అనుభవిస్తున్న వారిసంఖ్య దేశజనాభాలో 20 శాతానికి లోపే

ఈ పరిస్థితికి తోడు మూడో ప్రణాళికాంతానికి చేరేటప్పటికి నిరుద్యోగం ఒక కోటి 20 లక్షలకు పెరగబోతున్నది ఈ పెరుగుదలతో పరిస్థితి మరింత అధ్వాన్నమౌతుందనేది స్పష్టం.

నిరుద్యోగం పెంపు

నాలుగో పంచవర్ష ప్రణాళిక ప్రారంభమయ్యే నాటికి మనదేశంలో నిరుద్యోగుల సంఖ్య 1 కోటి 20 లక్షల మేరకు వుండబోతున్నది ఈ సమాచారాన్ని యీ వారమే ప్రణాళిక సంఘం లోక్‌సభకు తెలియజేసింది.

తృతీయ ప్రణాళిక కాలంలో కొత్తగా ఉద్యోగాలకోసం మార్కెట్‌లోకి ప్రవేశించిన వారి సంఖ్య ఒక కోటి 70 లక్షలు కాగా ప్రస్తుత ప్రణాళికా సంవత్సరం (1965 66) చివరవరకు మొత్తంగా ఉద్యోగాలు లభించిన వారి సంఖ్య 140 లక్షలు మాత్రం వుంటుందని అందనా 3వ ప్రణాళిక ప్రారంభమయ్యే నాటికే దేశంలో 80 లక్షలమంది నిరుద్యోగులున్నారు.

అంటే 4వ ప్రణాళిక ప్రారంభమయ్యే నాటికి 80+40=120 లక్షల మంది నిరుద్యోగులు మార్కెట్‌లో వుంటారు.

దీనినిబట్టి ప్రణాళికలు గడిచేకొలదీ దేశంలో నిరుద్యోగం పెరుగుతూనేవుంది తప్ప తగ్గడమంటూలేదనేది స్పష్టం.

మన ప్రణాళికా కర్తల ధోరణి చూస్తుంటే నిరుద్యోగం అనివార్యమనీ, అందుకు చేసేదేమీలేదనేభావం వారి మాటల్లోనూ చేతల్లోనూగూడా వ్యక్తమౌతూవుంది.

నాలుగో ప్రణాళిక

నాలుగో ప్రణాళికా లక్ష్యాలు రూపొందుతున్న తీరులో గూడా కన్పించేది యిదే

జనవరిలో త్రైపాక్షిక ఉపాధికల్పనల కేంద్రకమిటీ సమావేశం ఢిల్లీలో జరిగింది ఆ సమావేశానికి కేంద్ర కార్మికమంత్రిత్వశాఖ ప్రణాళికా సంఘం సహాయంతో తయారు చేసిన ఒకనివేదికను సమర్పించింది, అందులో చెప్పిన అంశాలివి:

● మూడో ప్రణాళికాంతానికి మిగులు తేలే నిరుద్యోగుల మొత్తానికి, అదనంగా 4వ ప్రణాళిక కాలంలో (1966-71) కొత్తగా ఉపాధులకోసం మార్కెట్‌లోనికి వచ్చేవారికి పూర్తిగా ఉద్యోగకల్పన జరగాలంటే నాలుగో ప్రణాళికలో 3 కోట్ల 40 లక్షలు లేదా 3 కోట్ల 60 లక్షల కొత్త వుద్యోగాలయేర్పాటు కావాలి.

● అయితే యీ ప్రణాళికలో 2 కోట్ల 30 లక్షలు లేదా 2 కోట్ల 50 లక్షలకు మించి కొత్త ఉద్యోగాలు లభించవు అక్కడి కదే గొప్ప

అంటే నాలుగో ప్రణాళికాంతానికి తిరిగి మరో కోటి మందికి పైగా నిరుద్యోగులుంటారనేది ఈ అంచనాలనుబట్టి తేలుతుంది

మరో ప్రక్క రేషనలైజేషన్ (కొత్త యంత్రాలను ప్రవేశపెట్టి ఉత్పత్తి పద్ధతులను ప్రమాణీకరించడం) ఆటోమేషన్ (స్వయం చలిత యంత్రాల వాడుక) వంటి పద్ధతులు ఒక దారీ తెన్నూ లేకుండా అమలు జరుగుతున్నందువల్ల నాలుగో ప్రణాళికలో, ప్రణాళికా రచయితలు ఆశిస్తున్న మేరకైనా ఉద్యోగాల సంఖ్య పెరగడం అనుమానాస్పదమే

అసలు మూలంలో వున్న లోపం

ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ ద్వారా దేశ సంపదతోబాటు ఉపాధులూ పెరగాలి సోషలిస్టు ప్రణాళిక లైతే జరిగేది అదే ఆ కారణానే సోషలిస్టుదేశాలలో ఎక్కడా నిరుద్యోగమనే మాటే మచ్చుకైనా వినరాదు

పెట్టుబడిదారీ దేశాల్లో జరిగేది తద్విరుద్ధం. ఉద్యోగ మార్కెట్టును క్రమబద్ధం చేయడం అనే పేరిట యెంతో కొంత నిరుద్యోగాన్నిఅట్టిపెట్టడం పెట్టుబడిదారీవర్గానికి ప్రయోజనకరం. నిరుద్యోగం బెదురుచూపి కార్మిక వర్గాన్ని అదుపులో పెట్టుకోవాలనేది పెట్టుబడిదారీవర్గం కోర్కె.

మన ప్రణాళికా కర్తలూ పాలకులూ సోషలిస్టు పదజాలాన్ని వల్లిస్తూ పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి పరుస్తున్న ఫలితమే యీ నిరుద్యోగం.

ఈనాటి యీ దారుణ పరిస్థితికి మూలం ప్రభుత్వ వ్యవసాయిక, పారిశ్రామికరంగాలలో అనుసరింప బడుతున్న విధానాల్లోనే వుంది.

వ్యవసాయ రంగం

ఆహార సంక్షోభానికి, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగానికి మూలం, వ్యవసాయరంగంలో సమూలమైన సంస్కరణలు అమలు జరగకపోవడమే. ఇందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం పెరిగి జీవనాధారంలేని నిరుపేదలు పట్టణాలకు ఎగబడుతున్నారు.

గ్రామ సీమల్లో వ్యవసాయ కార్మికులకూ కౌలుదార్లకూ వృత్తి భద్రత లోపించింది, ఇది కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందింపబడుతున్న ఫలితమే.

ఈ విధానం సమూలంగా మారాలి. కౌలుదార్లకు రక్షణ లభించాలి. భూమిలేని నిరుపేదలకు భూవసతి కల్పించబడాలి వ్యవసాయ కార్మికుల ఉపాధి పెరగాలి. అప్పుడే గ్రామసీమల్లో నిరుద్యోగ నివారణ, అందుతో బాటే ఆహార సమస్యా పరిష్కారమూ జరుగుతుంది పట్టణ ప్రాంతాల పరిశ్రమలపై ఒత్తిడి తద్వారా కలిగే నిరుద్యోగమూ నివారణ అవుతుంది.

పారిశ్రామిక రంగంలో

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి దోహదమిచ్చే విధానాలనే ప్రభుత్వం పారిశ్రామికరంగంలో అమలు జరుపుతూవుంది.

పరిశ్రమల్లో రేషనలైజేషన్ అమలు పై యేలాంటి అడ్డంకీ లేకుండా సాగిపోతూవుంది. ఆ కారణంగా వేలాది కార్మికులు నిరుద్యోగం పాలపడుతున్నారు. తృతీయ ప్రణాళికకాలంలో సంఘటిత పరిశ్రమల రంగంలో ఉద్యోగ వసతుల పెరుగుదల యించుమించు బొత్తిగా జరగనేలేదు

ప్రభుత్వం రేషనలైజేషన్, ఆటోమేషన్ పథకాలకోసం యంత్రాల దిగుమతిని బాహాటంగా అనుమతించుతూవున్న ఫలితం యిది

విదేశీప్రయివేటు నూనెకంపెనీలలో వేలాది మధ్యతరగతి వుద్యోగుల నిరుద్యోగానికి దారితీసేవిధంగా ఐ బి ఎం యంత్రాలను (ఎలక్ట్రానిక్ లెక్కల యంత్రాలు, దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. విదేశీ నూనె గుత్తా కంపెనీలు కోట్లలాభాలు ఆర్జిస్తున్న విషయం ప్రణాళికాసంఘానికిగానీ ప్రభుత్వానికిగానీ తెలియనిదేమీ గాదు. అయినా వారిని నిరుద్యోగం పెంచి తమ లాభాలను మరింత పెంచుకోవడాన్ని అనుమతిస్తూ వుంది ప్రభుత్వం.

ప్రభుత్వరంగంలోని జీవిత బీమా పరిశ్రమకోనూ యిదేతంతు జరిగింది. అయితే ఉద్యోగుల నిరంతర ఆందోళన ఫలితంగా, తాత్కాలికంగా ఎలక్ట్రానిక్ యంత్రాల ప్రవేశం నిలిపివేయబడింది.

రేషనలైజేషన్ పథకాలవల్ల నిరుద్యోగం యేర్పడకుండా చూడాలనే ఒక త్రైపాక్షిక ఒప్పందం వుంది అయినా యాంత్రీకరణ, ఆధునికీకరణ అనే సాకులతో అనేక పరిశ్రమల్లో పనివారి సంఖ్య తగ్గింపు పనిభారాల పెంపుదల బాహాటంగానే సాగిపోతూవుంది.

రేషనలైజేషన్ పథకాలు ప్రవేశపెట్టిన పరిశ్రమ లన్నింటిలోనూ యించుమించుగా స్త్రీలను తొలగిస్తున్నారు. గత 10 సంవత్సరాల దరిమిలా వేలాది స్త్రీ కార్మికులకు పనుల నుండి ఉద్వాసన జరిగింది.

దేశంలో అత్యవసర పరిస్థితి యింకా వుందని చెబుతూనే పారిశ్రామికోత్పత్తి కుంటుపరిచే చర్యలు అనుమతించబడుతున్నవి బొగ్గు నిలవలు పేరుకొనిపోయాయనే సాకుతో అనేక గనుల మూతకు ప్రభుత్వం అనుమతించుతూవుంది.

ప్రాజెక్టుల మొదలైన నిర్మాణాలలో పాల్గొనే కార్మికులకు ఉద్యోగ భద్రత బొత్తిగా లేదు వీరు లక్షల సంఖ్యలో నిరుద్యోగంవాత బడుతున్నారు.

రూర్కేలా ఉక్కు కర్మాగారంలోని అన్ని విభాగాలు గత ఫిబ్రవరినెలలో నిర్ణీత పరిమితిని మించి ఉత్పత్తి జరిగిందని అధికారులు ప్రకటించారు.

5–2=0

పెట్టుబడిదారీ బీజగణితం

'ఐదింట్లో రెండు పోతే మూడు' అనేది సాధారణ లోకజ్ఞానం అన్నవాళ్ళందరికీ తెలుసు.

అయితే, పెట్టుబడిదారీ వర్గపు బీజగణితంలో (ముఖ్యంగా పేదవాళ్ల నోట్లు కొట్టాల్సి వచ్చిన సందర్భాలలో) 'ఐదింటిలో రెండు పోతే సున్నాయే' మిగులుతుంది:

నమ్మలేమంటారా? అయితే, ఫ్రాన్స్‌లో నిజంగా జరిగిన యీ కథ చదవండి.

మొన్నటి నవంబర్‌లో పారిస్‌లోని ఒక ప్రసూతిశాలలో ఒక పోస్టుమన్ భార్య ప్రసవించింది. ఆవిడ ఒకేసారి 5 గురు బిడ్డల్ని కన్నది

ఇది అపూర్వ సంఘటన.

పత్రికలవాళ్లూ, టెలివిజన్ కంపెనీలవాళ్లూ ఆ ప్రసూతిశాల పైకి ఎగబడ్డారు. ఆ వార్తను దేశమంతటా ప్రచారం చేశారు. ఆ పేద ఇంటోళ్ళకు పంట పండింది.

5 గురు పసిపాపలకూ మంచి మంచి దుస్తులిస్తామని నగరంలోని దుస్తుల దుకాణాలవాళ్లు ప్రకటించారు. పుణ్యం, పురుషార్థం రెండూ కలిసొస్తాయని వాళ్ళు ఆ విషయాన్ని తమ దుకాణాల పేర్లతో కలిపి పత్రికల్లో పెద్ద పెద్ద ప్రకటనలు వేయించుకున్నారు.

నగర పరిసరాల్లోని ఒక మునిసిపాలిటీవాళ్లు ఆ కుటుంబానికి 5 గదుల యిల్లు ఇస్తామని ప్రకటించింది. పోస్టుమాస్టర్ జనరల్ పిల్లల తండ్రికి ప్రమోషన్ ప్రకటించాడు.

వారం తిరక్కుండానే పుట్టిన పిల్లల్లో యిద్దరు శాశ్వతంగా కన్ను మూశారు ముగ్గురు మిగిలారు.

అదేమంత అపూర్వ విషయమనీ:

దుకాణాలవాళ్ళు గుడ్డల వాగ్దానం విరమించుకున్నారు

మునిసిపాలిటీ వారి గృహ దానమూ రద్దయింది.

పోస్టు మాస్టర్ జనరల్ అతడి ప్రమోషనూ రద్దుచేశాడు.

'ముక్కట్లో రెండు పోగా' సున్నా మిగిలింది.

(న్యూఏజ్)

ఇక ఏమాత్రం జాగు లేకుండా ప్రెస్ కార్మికులకు కనీస వేతన నిర్ణయసంఘం నియమించాలి

రాజమండ్రి ప్రెస్ వర్కర్స్ యూనియన్ 12వ వార్షిక మహాసభ తీర్మానం

రాజమండ్రి, మార్చి 2

ప్రెస్ కార్మికులకు కనీస వేతన నిర్ణయ సంఘాన్ని నియమించే విషయాన్ని ప్రభుత్వం అంగీకరించికూడా ఇంతవరకూ అటువంటి సంఘాన్ని నియమించనందుకు విచారిస్తూ అధిక ధరల తాకిడికి కార్మికులు అల్లాడిపోతున్న నేటి పరిస్థితులను గుర్తించి ఇక అలస్యంచేయకుండా ఆ సంఘాన్ని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, రాజమండ్రి ప్రెస్‌వర్కర్సు యూనియన్ 12వ వార్షిక మహాసభ తీర్మానించింది.

రాజమండ్రి ప్రెస్ వర్కర్స్ యూనియన్ 12 వ వార్షికోత్సవం ఫిబ్రవరి 28 న శ్రీ మదాల కృష్ణమూర్తి అధ్యక్షతను జరిగింది.

యూనియన్ అధ్యక్షులు శ్రీ సీలం నాగేశ్వరరావు స్వాగతం చెప్పారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రెస్‌లో పని చేయుచున్న శ్రీ చిదంబరంగారు కారు ప్రమాదంలో చనిపోయినందుకు మహాసభ వారు తొలుత తమ విచారాన్ని ప్రకటించారు. చనిపోయిన ప్రెస్ కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం యివ్వాలని కోరారు.

అధ్యక్షులు శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ 11 వ మహాసభ అనంతరం గత 1½ సం. కాలంలోను రాజమండ్రి ప్రెస్ కార్మికులు అనేక ఒడుదుడుకులకు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు గత 30 సంవత్సరాలుగా కార్మికులు ఆర్థిక బాధలతో కృంగిపోతున్నారన్నారు.

అల్యూమినియం వర్కర్స్ కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీ అధ్యక్షులు, కమ్యూనిస్టు నాయకులు శ్రీ చిటూరి ప్రభాకరచౌదరిగారు సభను ప్రారంభిస్తూ, దేశంలోని అనేక పరిశ్రమలలో కనీస వేతనాలు నిర్ణయించడమో, వేతన నిర్ణాయక సంఘాల ఏర్పాటు జరగడమో సంభవించిందన్నారు కాని ప్రెస్ కార్మికులకు సరియైన ఆందోళన లేని కారణంగా కనీస వేతనాల సంఘాన్ని వేస్తామని వాగ్దానం చేసికూడా ప్రభుత్వం అమలు జరపలేదని అన్నారు యజమానులు అనేక రకాలుగా ఫ్యాక్టరీ ఆక్టునుండి తప్పించుకు టున్నారనీ బైండింగ్, కంపోజింగు ప్రింటింగులను వేరు వేరుగా నడుపుతున్నారనీ, వాటిని తక్కువ రేట్లకు చేయిస్తున్నారనీ తెలిపారు. ఒక యజమానివద్ద పనిచేసే కార్మికుడు మరొకరివద్ద పనిచేయరాదనీ నెలజీతాలు కుదరకపోతే నేటి ధరల ప్రకారం పీస్ రేట్లు వుండాలనీ దానివల్ల ఇతర పరిశ్రమలలోలాగ శెలవులకు ముదరా రాబట్టవచ్చుననీ తెలిపారు

ప్రెస్ కార్మికులు తలపెట్టిన కో-ఆపరేటివ్ ప్రెస్ ఉద్యమాన్ని శ్రీప్రభాకరచౌదరి ప్రశంసించారు, కాని చైతన్య రహితమైన సహకారోద్యమం ప్రతిష్ఠకు అనుమానానికి దారి తీస్తుందని హెచ్చరించారు. కాబట్టి సహకార సంస్థకు ప్రభుత్వం డబ్బు ఇచ్చినా మరేమి జరిగినా కార్మికులలో చైతన్యం లేనిదే అవి ఎదిగి దిగకండవని హెచ్చరించారు. అలా చేస్తే సంఘం కొరగానిదౌతుందన్నారు.

స్థానిక జర్నలిస్టు శ్రీ ఆర్. వి. పెండ్యాల మాట్లాడుతూ కార్మికులు క్రమ శిక్షణతో మెలగాలని, శ్రీ ప్రభాకర చౌదరి చెప్పిన విషయాలు కష్టంగా వున్న వుత్సాహంతో రోటుపాట్లను సర్దుకుని కృషిచేయాలనీ కోరారు

శ్రీ వడాల రామారావుగారు మాట్లాడుతూ తూర్పుగోదావరిజిల్లా కో-ఆపరేటివు ప్రింటింగు ప్రెస్ త్వరలోనే రిజిష్టరు కాగలదని, రిజిష్టరు అయినవెంటనే ప్రెస్సును ప్రారంభించగలమని తెలిపారు. కార్మికులు చైతన్యవంతంగా సహకరించగలరో లేదో ఆలోచించుకోవాలన్నారు. ఈ జిల్లాలో వివిధ వృత్తులకు సంబంధించిన నాల్గువేల సహకార సంస్థలు వున్నా పదిహేను వందల సొసైటీలను నిర్వహించ డానికి సరిపోయే సిబ్బంది మాత్రమేవున్నందున కాగితాలు కదలడంలో జాప్యం జరుగుతోందని అన్నారు. పీస్‌రేట్లకు పనిచేసేవారి సమావేశం ఏర్పాటుచేసి సక్రమమైన నిర్ణయాలకు రావాలనీ, ప్రస్తుతం పెరిగిన ధరల దృష్ట్యా కార్మికులు ఒక కమిటీని ఎన్నుకొని జీతాల పెంపుదలకు యజమానులవద్దకు రాయబారం వెళ్ళాలని అన్నారు.

గుంటూరుజిల్లా కో ఆపరేటివ్ ప్రింటింగ్ సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ వెలగా వీరయ్యగారు మాట్లాడుతూ రాష్ట్రయూనియన్ ఆదిలో ఎన్నో విజయాలు సాధించినా ఈనాడు నీరసంగా వుందనీ పనివారినుండి చక్కని చైతన్యం రాకపోతే ఫలితంలేదనీ అన్నారు.

గుంటూరుజిల్లా కో-ఆపరేటివ్ ప్రెస్ నిర్మాణాన్ని వివరిస్తూ యిలా అన్నారు.

మొదటి రెండు సంవత్సరాలు లక్షయాభై ఎనిమిది వేల రూపాయల పని చేశాము. ప్రభుత్వం పనులేమీ ఇవ్వదు. అధ్యక్షులుగా ఎన్నికైనవారిపై వర్కర్లకు అసంతృప్తి వచ్చింది

తగిన ఎక్విప్‌మెంటులేదనే కారణంగా కేంద్ర సహకారం అందలేదు. ప్రయివేటు-కో-ఆపరేటివ్‌ల మధ్య అనేక సంఘర్షణలున్నాయి. ఆడిట్ రిపోర్టులలోని కొన్ని పద్దులపట్ల సంశయాలు కలిగాయి. డబ్బుతిని వేస్తున్నామేమోనని కూడా కార్మికులలో అనుమానాలు రేకెత్తాయి ఇకముందు ఆ సంస్థను నడపడం సాధ్యం కాదేమో ననిపిస్తోంది. క్రమంగా, ప్రెస్ కార్మి

(మిగతా 6 వ పేజీలో)

Account Test – for Executive Officers, Subordinate Officers Part I, II, P. W. D., Zillaparishad Tests, Headmasters and Deputy Inspectors Tests. Postal Tution offered. Prospectus free. Apply · **Account Test Institute, Madras-8.**

విజ్ఞులైన తల్లిదండ్రులు కుటుంబ నియంత్రణకై కాన్‌టాబ్
గర్భనిరోధక మరుగుమాత్రలనే వాడుతారు.
వాడకం అతి తేలిక, నమ్మకమైనవి. చౌకవి. చౌక
ఇండియా ప్రభుత్వం అధికారపూర్వకంగా అనుమతించినవి.
వాడక విధానం వివరంగా పెట్టెలోపలి కాగితంలో పేర్కొనబడింది.
స్మిత్, స్టానిస్ట్రీట్ & కం, లిమిటెడ్
హైదరాబాద్ . విజయవాడ



కొత్త విధంగా తయారైన
సన్‌లైట్
అధిక కాంతిగా ఉతుకుతుంది!
కొత్తవిధంగా తయారైన సన్‌లైట్‌కు సరికొత్త కాగితపు మూత, సుందరమైన కొత్త ఆకారంగలదు అంతేగాక, దాని 'అధిక కాంతిగాచేసే శక్తి' ఉతుకుతుకునకూ మీ బట్టలను అతి కాంతిగా చేస్తుంది!
అధిక తెల్లగాను, అధిక కాంతిగాను ఉతుకుతుంది
హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి
S. 46.140

ఉత్తరవియత్నామ్‌పై దారుణ అగ్నివర్షం

160 విమానాలతో 200 టన్నుల బాంబులు కురిపించిన అమెరికా ఘాతుక చర్య

సైగాన్, మార్చి 2

ఉత్తర వియత్నామ్‌పై ఈ వేళ దాడి జరిపిన 160 అమెరికన్, దక్షిణ వియత్నామ్ యుద్ధవిమానాలు 200 టన్నుల బాంబులను పడవేసినవని అమెరికా అధికారులు ప్రకటించారు

ఇంతవరకు ఉత్తర వియత్నామ్‌పై అమెరికా జరిపిన విమాన దాడు లన్నింటిలోకి ఇదే పెద్దదాడి

ఉత్తర వియత్నామ్ గగనసీమలోకి అమెరికన్, దక్షిణ వియత్నామ్ విమానాలు బాగా లోనికి చొచ్చుకుపోయి. సైనిక స్థావరాలపై రాకెట్లతోను, బాంబులతోను అగ్నివర్షం కురిపించడంలో బాగాకృతకృత్యమైనట్లు అమెరికన్ అధికారులు గొప్పగా చెప్పుకొంటున్నారు.

ఉత్తర వియత్నామ్‌పై దాడులలో మొదటి సారిగా నేడు కాన్‌విరా యుద్ధవిమానాలను వినియోగించారు.

శత్రు విమానాలను ఏడింటిని తాము నేల కూల్చామని ఉత్తర వియత్నామ్ జారీచేసిన ప్రకటనను మాస్కో రేడియో నేడు ప్రసారం చేసింది.

ఇది ఇలా వుండగా, అమెరికా యుద్ధనావల నుంచి నౌకా సైన్యం గురువారంనాడు దక్షిణ వియత్నామ్‌లో దిగబోతున్నది. ఈ సైన్యం దక్షిణ వియత్నామ్‌లోని అమెరికా స్థావరాలను కావలా కాస్తుంటుందని అమెరికన్ సైనిక వర్గాలవారు తెలుపుతున్నారు.

ఉత్తర - దక్షిణ వియత్నామ్ సరిహద్దుకు ఉత్తరంగా 80 మైళ్ళ దూరంలోని క్వాంక్‌ఖే పైన, లావోస్ సరిహద్దుకు 10 మైళ్ళ దూరంలో ఉత్తర వియత్నామ్‌లో గల మరొక కేంద్రం పైన అమెరికన్ యుద్ధ విమానాలు నేడు అగ్నివర్షం కురిపించి. విపరీత నష్టం కలుగజేసినట్లు అమెరికన్ సైనిక వర్గాలవారు పేర్కొంటున్నారు.

"శ్రమంతా నిష్ఫలం"

దక్షిణ వియత్నామ్‌లోని గెరిలాలను హతమార్చడం కోసమని తాము అనేక హెలికాప్టర్లతో ఒక అడవిప్రాంతాన్ని దగ్ధపటలం కావించామని, కాని ఈ శ్రమంతా పూర్తిగా నిష్ఫలమైనట్లు యిప్పుడు తేలిందని ఒక అమెరికన్ సైనికాధికారి స్వయంగా అంగీకరించారు

సైగాన్‌కు సమీపంలో తీర ప్రాంతంలోని ఒక గ్రామం నుండి రైతులను జాలరులను దక్షిణ వియత్నామ్ సైనికులు బలవంతాన ఖాళీచేయించారని, వారిని ప్రభుత్వాధీనంలోని ప్రాంతాలకు తరలిస్తున్నారని ఇక్కడి అధికారవర్గాలవారు తెలుపుతున్నారు,

అమెరికా విధానంలో ప్రమాదకరమైన మార్పు

దక్షిణ వియత్నామ్ యుద్ధాన్ని ఉత్తర వియత్నామ్‌లోకి విస్తరింపచేయాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించినట్లు అమెరికన్ పత్రికలలో ప్రచురితమవుతున్న వార్తలు తెలుపుతున్నాయి

అమెరికా విధానంలో వచ్చిన ఈ ప్రమాదకరమైన మార్పుకు అనుగుణంగానే, నేడు అమెరికన్ విమానాలు విస్తారంగా ఉత్తర వియత్నాంపై అగ్నివర్షం కురిపించినట్లు పి.టి.ఐ. వాషింగ్టన్ విలేకరి వ్యాఖ్యానిస్తున్నారు.

మరో మూడు జిల్లాల విముక్తి

హాంకాంగ్, మార్చి 2

దక్షిణ వియత్నాం ప్రజా విముక్తిసైన్యాలు బిన్‌దిన్, క్వాంగ్‌నామ్ రాష్ట్రాలలోని (యివి దక్షిణ వియత్నాం ప్రభుత్వం క్రిందవున్న ప్రాంతాలు) మరో మూడు జిల్లాలను విముక్తి గావించాయని హనోయ్ రేడియో గత వారం ప్రకటించింది.

బౌద్ధుల ఆందోళన

సైగాన్, మార్చి 2

బౌద్ధ మతాచార్యుల ఆధ్వర్యాన వున్న ఐక్యూడి శాంతి ఉద్యమ సంఘం వియత్నాం యుద్ధాన్ని నిలిపి వేయాలని డిమాండు చేస్తూ గత వారాంతం నుండి ఒక పెద్ద ఉద్యమాన్ని ప్రారంభించింది.

కమ్యూనిస్టులకుట్ర అంటూ దక్షిణ వియత్నాం ప్రభుత్వం ఈఉద్యమాన్ని నిరసిస్తున్నది.

జీవిత భీమా ఉద్యోగుల ప్రదర్శన

విజయవాడ, మార్చి 2

ఇన్సూరెన్సు ఫీల్డువర్కర్ల జాతీయ ఫెడరేషన్ పిలుపునందుకొని దేశమంతటా జరుపబడుతున్న ఆందోళనలో భాగంగా నిన్న. ఈరోజు సాయంత్రం 4-5 గంటలమధ్య విజయవాడలో బీసెంటురోడ్‌లోని లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ డివిజనల్ ఆఫీసువద్ద. పాత బస్తీలో గల బ్రాంచి ఆఫీసువద్ద ప్రదర్శనలు జరుపబడినవి. ఈ ప్రదర్శనలు రేపుకూడా జరుగుతాయి.

రెగ్యులర్‌గా యింక్రిమెంట్లు యివ్వాలి పనిచేసిన కాలాన్నిబట్టి అమలుజరిపే జీతాల స్కేళ్ళు కావాలి. ఉద్యోగ భద్రత కావాలి. కాంట్రాక్టు పద్ధతిరద్దు చేయాలి ప్రోరేటాపద్ధతి రద్దుచేయాలి,విభజించిపాలించే విధానం అంతం కావాలి. కార్మికవర్గ ఐక్యత వర్ధిల్లాలి. బలవంతపు బదిలీలు నిలిపివేయాలి అని ప్రదర్శకులు నినాదాలు చేశారు.

ఈ ప్రదర్శన జరుపుతున్నవారు లైఫ్ ఇన్సూరెన్సుకార్పొరేషన్ 2 వ తరగతి ఉద్యోగులు. దేశమంతటా ఈ తరగతి ఉద్యోగులు 2 వేలమంది వున్నారు.

ఈ ఆందోళనలో లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ క్రింద పనిచేస్తున్న మొదటి తరగతి ఉద్యోగులుకూడా కలుస్తున్నారు. దేశంలో వారి సంఖ్య 2 వేల 7 వందలు

ఈ నెల 6 వ తేదీన ఈ రెండు తరగతుల ఉద్యోగులూ వివిధ పట్టణాలలో గల యల్. ఐ. సి. ఆఫీసుల ముందు సామూహికంగా 24 గంటల నిరాహారవ్రతం చేస్తారు.

మచిలీపట్టణంలో డివిజనల్ ఆఫీసుముందు సౌత్‌జోన్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ టి ఆర్ నారాయణ్ (మద్రాసు) నిరాహార వ్రతం చేస్తారు.

ఈ నెల 9 వ తేదీ నుండి మొదటి తరగతి ఉద్యోగులు పని నిలుపుదల సమ్మె ప్రారంభిస్తారు.

రెండవ తరగతి ఉద్యోగులు 9 వ తేదీ నుండి క్రొత్త వ్యాపారం సంపాదించేపని నిలిపివేస్తారు.

కన్ననూరులో కాంగ్రెస్, ముస్లింలీగ్ వర్గాలమధ్య కొట్లాట

5 గురికి గాయాలు

తిరువనంతపురం, మార్చి 2

కాంగ్రెస్, ముస్లింలీగ్‌వర్గాలమధ్య కన్ననూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఒక కొట్లాట సందర్భంలో 5 గురికి స్వల్పంగా గాయాలు తగిలాయని ఇక్కడకుచేరిన అధికార వార్తలద్వారా తెలుస్తున్నది.

గాయాలు తగిలిన ఐదుగురూ కాంగ్రెసుకు చెందినవారు చికిత్సకోసం వీరిని ఆస్పత్రిలో చేర్పించారు.

ఈ ఉభయవర్గాలమధ్య జరిగిన ఈసంఘర్షణకు సంబంధించిన వివరాలు తెలియలేదు.

ఈ సంఘర్షణను పురస్కరించుకొని ఈ ప్రాంతంలో పోలీసు బందోబస్తుని అధికం చేశారు.

రాజమండ్రి హోటళ్లలో కాఫీ, టీ అమ్మకం బంద్

రాజమండ్రి, మార్చి 2

పాలవర్తకులు పాల ధరను పెంచినందుకు నిరసనగా నేడిక్కడ హోటలు యజమానులు అంతా కాఫీ, టీల అమ్మకాన్ని నిలిపివేశారు.

పాలవర్తకులు పాల ధరను ఒక్కసారిగా లీటర్ 75 పైసలకు పెంచడంతో యీ పరిస్థితి ఏర్పడింది.

హోటల్‌యజమానులకూ,పాలవర్తకులకూ మధ్య జరిగిన రాజీ సంప్రదింపులు ఫలించలేదు (వి. వి.)

బొకారో నిపుణులకు భిలాయ్‌లో శిక్షణ యేర్పాటు

రాయపూర్, మార్చి 2

బొకారో ఉక్కు కర్మాగారంలో పనిచేయుచున్న నూటయాభైమంది నిపుణులకు భిలాయ్‌లో శిక్షణ యివ్వబడుతుందని భిలాయ్ కర్మాగారం జనరల్ మేనేజర్ శ్రీ ఇంద్రజిత్‌సింగ్ నేడిక్కడ పత్రికల వారితో చెప్పారు.

భిలాయ్ పరిశ్రమ పనికుంటుపడే అవసరం లేకుండానే సాధ్యమైనంత పెద్ద సంఖ్యలో యింజనీర్లను, నిపుణులను కూడా తాము బొకారోలో పని చేయడానికి పంపగలమని ఆయన చెప్పారు

భారత ప్రధాని రష్యా అమెరికాల యాత్ర

త్వరలో తేదీల ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 2

భారత ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి తాము త్వరలో అమెరికా, రష్యా దేశాలను సందర్శించనున్నామని, తేదీలు త్వరలోనే ప్రకటించబడగలవని నేడు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

గుంటూరులో యువజన ఆటల పోటీలు

శ్రీరామనవమి సందర్భంగా

గుంటూరు, మార్చి 2

గుంటూరు పట్టణ రైలుపేట యువజన సంఘ కార్యదర్శి శ్రీ వై. సూర్యనారాయణ గారు ఈ క్రింది ప్రకటన చేస్తున్నారు:

శ్రీరామనవమి సందర్భంలో రైలుపేట యువజన సంఘం ఆధ్వర్యాన నాటికలు, చెడుగుడు పోటీలు నిర్వహించబడును. ఈపోటీల్లో గుంటూరుజిల్లాలోని ఎవరయినను పాల్గొనవచ్చును. బహుమతులు ఇవ్వబడును. దరఖాస్తులు ఈనెల 25 వ తేదీ లోపున శ్రీ వై. సూర్యనారాయణ, కార్యదర్శి యువజన సంఘం, రైలుపేట, గుంటూరుకు పంపాలి. అవసరమయితే స్క్రూట్నీ జరుపబడును. నాటిక ప్రవేశరుసుం 5 రూపాయలు చెడుగుడు రుసుం 7 రూపాయలు. పొరుగూరి నటులకు, ఆటగాండ్రకు ఒకపూట భోజన, వసతి సౌకర్యములు ఉచితంగా ఏర్పాటుచేయబడును.

శ్రీ శాస్త్రితో జెక్ ప్రధాని భేటీ

న్యూఢిల్లీ, మార్చి 2

జెకొస్లొవేకియా ప్రధాని జోసెఫ్ లీనార్ట్‌తో నేటి సాయంత్రం ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిని కలుసుకొని 45 నిముషాల పాటు సంప్రదింపులు జరిపారు.

ఈ సంప్రదింపులలో భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్, జెక్ విదేశాంగ మంత్రి వి. డేవిడ్‌లు కూడా పాల్గొన్నారు

ఇంతకు ముందు జెక్ ప్రధాని లీనార్ట్ రాజ్‌ఘాట్, శాంతివనాలను సందర్శించి గాంధీ, నెహ్రూ సమాధులపై పుష్పగుచ్ఛాలు వుంచారు.

రైల్వేచార్జీల పెంపుదలకు పాటిల్ సమర్థన

న్యూఢిల్లీ, మార్చి 2

రైల్వే ప్రయాణీకుల టిక్కెట్ రేట్లను రవాణా రేట్లను పెంచాలనే నిర్ణయాన్ని రైల్వే మంత్రి యస్. కె. పాటిల్ కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ సమావేశంలో మొండిగా సమర్థించుకున్నారు.

స్వల్పదూరం ప్రయాణించేసే ప్రయాణీకుల టిక్కెట్ రేట్లను పెంచటం అనుచితమని పలువురు సభ్యులు విమర్శించారు

రైల్వే బడ్జెట్ పై పార్లమెంటరీపార్టీలో 90 నిముషాలపైగా చర్చలు జరిగాయి

రైల్వే ప్రయాణీకుల్లో నూటికి 80 మంది కొద్దిదూరం ప్రయాణంచేసేవారేననీ, ఆ రేటును పెంచకపోతే అదనంగా వస్తుందనుకున్న 30 కోట్ల ఆదాయం 2 కోట్లకు పడిపోతుందని పాటిల్ అన్నారు.

రైల్వేలలో రద్దీని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

పానుగంటి శత జయంతి

హైదరాబాద్ ఫిబ్రవరి 24

ప్రఖ్యాత నాటకకర్త కీ॥ శే॥ పానుగంటి లక్ష్మీనరసింహారావు శతజయంతిని ఈ సంవత్సరం ఘనంగా జరపడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. జయంత్యుత్సవాలను రాష్ట్రంలో పెద్దయెత్తున జరిపి పడానికి కమిటీ వారు సన్నాహాలు చేస్తున్నారు వివిధ ప్రాంతాలలో ఉత్సవాలను జరుపదలచినవారు తమతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపవలసిందిగా కమిటీ చైర్మన్, సాంస్కృతిక శాఖమంత్రి శ్రీ యమ్ ఆర్ అప్పారావుగారు తెలియజేస్తున్నారు

మద్రాసు శాసనసభ స్పీకర్‌పై అవిశ్వాసం

ప్రతిపాదనకు ప్రతిపక్షాల నిర్ణయం

మద్రాసు, మార్చి 2

మద్రాసు రాష్ట్ర శాసనసభలోని ప్రతిపక్షాల ప్రతినిధులు నేడిక్కడ సమావేశమై ప్రభుత్వ పక్షంపట్ల పక్షపాతం చూపుతున్నందుకు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించ నిశ్చయించారు.

ఈ సమావేశంలో డి యం.కె స్వతంత్ర కమ్యూనిస్టు యస్. యస్. పి. ప్రతినిధులు మరికొందరు ఇండిపెండెంట్లుకూడాపాల్గొన్నారు

రాజకీయ పార్టీలకు కంపెనీల విరాళాలు

షేర్‌హోల్డర్స్ సంఘం వ్యతిరేకత

బొంబాయి, మార్చి 2

కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే పద్ధతిని వ్యతిరేకిస్తూ బొంబాయి షేర్ హోల్డర్స్ అసోసియేషన్ నేడిక్కడ ఒక తీర్మానం చేసింది

భాషా సమస్యను జాతీయ దృక్పథంతో పరిశీలించాలి

లోక్‌సభలో శ్రీ శాస్త్రి ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 2

భాషా సమస్యను జాతీయ దృక్పథంతో పరిశీలించాలని ప్రధాని శాస్త్రి నేడు లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ అన్నారు. దేశంలో చలామణిలో వున్న అన్ని భాషలనూ అధికార భాషలుగా చేయడం సాధ్యపడని విషయం అని ఆయన అన్నారు రాజ్యాంగాన్ననుసరించి హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా రూపొందించటం జరిగిందని ఆయన చెప్పారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"దేశంలో ఒక భాష 'లింకు' భాషగా ఉండవలసిన అవసరం ఉన్నదని నేను భావిస్తున్నాను. లేనిచో భారతదేశం చిన్న చిన్న ప్రాంతాలుగా తయారై, దేశ అనైక్యతకు దారితీస్తుంది.

భాషావిషయంలో చాలా నెమ్మదిగా వ్యవహరించవలసి వుంటుంది. ఒక భాషను బలవంతంగా రుద్దట అనేది జరుగకూడదు అని శ్రీ శాస్త్రి అన్నారు.

భాషా సమస్యపై ఇటీవల జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ మద్రాసు రాష్ట్రంలో పరిస్థితులు మరీ విషమించి కొన్ని ప్రాణాలు ఆహుతి అయ్యాయని దోపిడీలు, దహనకాండ విచ్చలవిడిగా సాగాయని అన్నారు.

హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని అవకాశంగా తీసుకొని, సంఘ విద్రోహశక్తులు పరిస్థితిని విషమింపజేశాయని శ్రీ శాస్త్రి అన్నారు.

విధ్వంసకాండకు కారకులైన సంఘ విద్రోహశక్తులను వదలి వేయటంవల్ల పరిస్థితులు మరీ విషమిస్తాయని చట్ట ప్రకారం వారిని శిక్షించవలసి వుందని, ఈ విషయంలో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు గైకొనవలసినదిగా మద్రాసు ముఖ్యమంత్రికి, సూచించగలనని శ్రీ శాస్త్రి అన్నారు:

భాషా వివాదవిషయంలో నెహ్రూ హామీలు ఎట్టి మినహాయింపులు లేకుండా అమలుజరుపబడతాయని ప్రధాన మంత్రి అన్నారు.

భాషా సమస్యపై తనకు నిర్దిష్టమయిన అభిప్రాయాలున్నాయని, అయితే వానిని ఇప్పుడు తాను వెల్లడించ ఇష్టపడటం లేదనిఅన్నారు. ముఖ్యమంత్రులసమావేశంలో చర్చించిన విషయాలను ప్రస్తావిస్తూ ఆ సమావేశ సూచనలను పార్లమెంటు అతి జాగరూకతతో పరిశీలించవలసివుందని ఆయనఅన్నారు

మద్రాసులోనూ మరికొన్ని ప్రాంతాలలోనూ, ప్రాంతీయ భాషలు బోధనా భాషగా గాని, రాష్ట్రప్రభుత్వ భాషగాగాని ఇకముందు ఉండజాలవని కొందరు అభిప్రాయపడుతున్నారని, ఇది చాలా తప్పుడు అవగాహన అని శ్రీ శాస్త్రి అన్నారు. ప్రాంతీయ భాషలకు అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వాలని తాము అభిప్రాయపడుతున్నామనీ వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలు ప్రాంతీయ భాషలలో సాగించాలనే తమ అభీష్టమని ఆయన చెప్పారు.

ప్రధాన మంత్రి హిందీలో ప్రసంగించాలని కోరుతూ శ్రీయుతులు మధులిమాయే, స్వామి రమేష్ ఆనంద్‌లు అడ్డుతగిలారు.

భాషాసమస్యను అత్యంత జాగరూకతతో పరిశీలించి నిర్ణయాలు చేయాలని, ఈవిషయంలో నిర్ణయాలను తరచూ మార్చటం వాంఛనీయం కాదని ప్రధాని అన్నారు ఈసమస్యను అన్ని కోణాలనుండి పరిశీలించి నిర్ణయాలు గైకొనాలనే సూచనను తాను అంగీకరిస్తున్నానని, అవిధంగా తీసుకోబడే నిర్ణయాలు దాదాపు తుది నిర్ణయాలుగా ఉండాలని తన అభిప్రాయం అని ఆయన అన్నారు.

ఈ సమయంలో రామ మనోహర్ లోహియా, శ్రీ రామసేవక్ యాదవ్ మరల శాస్త్రి ప్రసంగానికి అడ్డు తగిలి ప్రధాని హిందీలో ప్రసంగించాలని కోరారు. సభలో తర్జుమా చేసే ఏర్పాట్లు ఉండగా ప్రధాని ఇంగ్లీషులో ఎందుకు ప్రసంగించాలని డా. లోహియా ప్రశ్నించారు

ఈ విషయంలో మొండిపట్టు పట్టవద్దని సభ్యులను స్పీకరు కోరారు ఏ భాషలో ప్రసంగించాలనే విషయం ప్రస్తుత పరిస్థితుల్లో ఆ యా సభ్యులకు వదలివేయటం మంచిదని ఆయన అన్నారు.

ప్రస్తుతం తన ప్రసంగాన్ని ఇంగ్లీషులోనే కొనసాగిస్తానని, ముందు ముందు హిందీలోకూడా మాట్లాడుతానని శ్రీ శాస్త్రి అన్నారు

ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భాషా వివాదాన్ని జాతీయ దృక్పథంతో పరిశీలించవలసి వుందని అన్నారు.

హిందీని అధికారభాషగా చేయటంవల్ల ఉద్యోగాలలోని హిందీ రాని వారికి ఎట్టి నష్టాలు జరుగకుండా చూస్తామని రిక్రూట్‌మెంట్లు విషయంలోనూ, ప్రమోషన్ల విషయంలోనూ హిందీరాని వారికి ఎట్టి హాని జరగదని శ్రీ శాస్త్రి అన్నారు. ఉద్యోగులు హిందీ నేర్చుకునేందుకు సకల సదుపాయాలు సమకూర్చబడతాయని ఆయన అన్నారు.

హిందీరాని ఉద్యోగులు ఇంగ్లీషును ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు.

ఒక గంటకుపైగా సాగిన తమ వుపన్యాసంలో శ్రీశాస్త్రి భాషాసమస్యయేగాక అంతర్జాతీయ విధానంగూర్చి కూడా ప్రసంగించారు దానిలో ప్రత్యేకంగా వియత్నామ్ సమస్యను పేర్కొన్నారు, విదేశీ పెట్టుబడులను గురించి భారత ప్రభుత్వ విధానాన్ని వివరించారు.

ఆయన వుపన్యాసం అనంతరం పార్లమెంటు ఉభయసభలను ఫిబ్రవరి 17 న రాష్ట్రపతి ఇచ్చిన వుపన్యాసానికి అభినందనలు సలుపుతూ సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది.

అంతకు పూర్వమే వివిధ రంగాలలో ప్రభుత్వం పొందిన వైఫల్యాలను అభిశంసిస్తూ ప్రతిపక్షాలవారు తెచ్చిన తీర్మానాలను సమావేశం త్రోసిపుచ్చింది.

తన ప్రభుత్వం సోషలిజం గమ్యాన్ని విడనాడి మితవాదం వేపు మొగ్గిందన్న ఆరోపణను శ్రీ శాస్త్రి ఖండితంగా నిరాకరించారు

"నేను మితవాదం వేపు కాదు అతివాదం వేపు లేదు ముందువేపు పోతున్నా.

"సోషలిజమే మనగమ్యం. అయితే దానిని సాధించేటందుకు మన పథకాలు విభిన్నం." అన్నారు.

వియత్నాం విషయం కొద్ది కాలం క్రితం ప్రభుత్వం తన విధానాన్ని తెలుపుతూ చేసిన ప్రకటనను గుర్తు చేశారు

"యుద్ధం వెంటనే నిలపాలనీ జెనీవా సభవంటిది జరపాలనీ కోరాం.

"దీనినే తెలుపుతూ అమెరికా, సోవియటులతో సహా అనేక దేశాలకు వ్రాశాం. తాత్కాలికంగా వారిచ్చిన సమాధానాలు పట్టి వారు ఆ సూచనకు అనుకూలంగానే వున్నారనుకోవచ్చు.

"ఇండోనేషియా, మలేషియాల మధ్య దండయాత్రకు ఏ మాత్రం సమ్మతం కాదు"

శాంతి, శాంతియుత సహజీవనాల యెడ ఆయన తన విశ్వాసాన్ని తెలుపుతూ జరగనున్న ఆఫ్రో-ఆసియా రాజ్యాల సభ ఆఫ్రికా-ఆసియా రాజ్య కూటమిలో శాంతి సహకారాలను బలపరచగలదని ఆశిస్తున్నామన్నారు.

శ్రీ శాస్త్రి వుపన్యాసానంతరం సభ స్వతంత్ర పార్టీవారి సవరణను 193:12 వోట్లతో నిరాకరించింది.

భాషా సమస్యపై దక్షిణాదిని ఏర్పడగల పరిస్థితులను ప్రభుత్వం గ్రహించలేకపోయిందనీ దేశ రక్షణ చట్టాన్ని సవ్యంగా వినియోగించలేదనీ స్వతంత్రపార్టీ దారా సవరణలో ప్రభుత్వాన్ని అభిశంసించారు.

చైనా, పాకిస్తాన్‌లు కలిగించగల ప్రమాదం యెడ భారత ప్రభుత్వం తగు జాగరూకత చూపలేదన్న మరొక సవరణ కూడా 182:11 ఓట్లతో త్రోసివేయబడింది.

శాంతి: సహజీవనం

వర్ధమాన దేశంగా భారతదేశం ప్రపంచ శాంతి కాపాడబడాలని కోరుతున్నదనీ, అందుచేత తటస్థ విధానాన్నీ, శాంతియుత సహజీవన పంథానూ అనుసరిస్తున్నదనీ ప్రధాని శాస్త్రి నేడు లోక్‌సభలో రాష్ట్రపతి ఉపన్యాసం మీద జరిగిన చర్చకు సమాధాన మిస్తూ అన్నారు.

సిద్ధాంత విషయాలలోనూ, తదితర అనేక సమస్యలమీదా మనం, ఇతర దేశాలు అనేకం వాటితో విభేదించవచ్చు. కాని వారితో శాంతంగా గడపడం కష్టమేం కాదు. తటస్థత, సహజీవనమూ మన కర్తవ్యపథం. మనం దానిని విడవం, ఆ విధానాల ననుసరించే దేశాలతో సహకరిస్తాము

వియత్నాం గురించి జెనీవా సభ మాదిరిది జరపాలనే అభిప్రాయంతో సాధారణ రూపంలో ఆమోదం తెలుపుతూ చాలా దేశాలు వ్రాశాయి. వారంతా ఏదో సమావేశమో, చర్చలో జరగాలంటున్నారు."

శ్రీ నాథ్‌పాయ్: అమెరికా, సోవియట్‌లు ఏమన్నాయి?

శ్రీ శాస్త్రి వారినుంచి ఇంకా అంతిమ సమాధానంరాలేదు. తమ ఆలోచనలేమిటో సూచించారు. అంతిమ సమాధానం వచ్చే వరకూ ఆ వివరాలలోకి పోదలచలేదు

మలేషియా, ఇండొనేషియాల మధ్య ఘర్షణలు ఆగిపోవాలని భారతదేశం కోరుతూంది. ఆ రెండు దేశాలమధ్యా శాంతియుత తర్పణల జరిపించేటందుకు ప్రయత్నాలు జరుగుతున్నందుకు సంతోషిస్తున్నాము

జరుగనున్న ఆఫ్రో - ఆసియా రాజ్యాల సభ గురించి నేను విశేషించి చెప్పదలచుకోలేదు ఆ సమావేశం తటస్థత, సహజీవనం, నిరాయుధీకరణ, శాంతి విధానాలను సమర్థించగలదని ఆశిస్తున్నాను. అది ఆసియా - ఆఫ్రికా రాజ్యాలను బలపరచగలదని ఆశిస్తున్నాను

"చైనా యింకాఇంకా అణుబాంబులను పరీక్షించాలనే అభిప్రాయంతో వున్నా. భారతదేశం ఆ పరీక్షలకు పూనుకోదు మన అణు కర్మాగారాలను శాంతియుత ప్రయోజనాలకోసం వృద్ధి పొందిస్తున్నాం. అదే కొనసాగుతుంది కూడా"

కొలంబో ప్రతిపాదనలు

కొలంబో ప్రతిపాదనల గురించి ఒక సభ్యుడువేసిన ప్రశ్నకుసమాధానమిస్తూఆయన ఇలా న్నారు:

"కొలంబో ప్రతిపాదనలు ఇది వరకటి చోటనే వున్నాయి. మనం వెళ్ళగలిగినంత దూరం వెళ్ళాం ఇంక చెప్పవలసిందేమీలేదు

శ్రీ నాథ్‌పాయ్ పోగొట్టుకొన్న దేశ భాగాన్ని తిరిగి స్వాధీనంలోకి తెచ్చుకోవాలని పార్లమెంటు తీర్మానించి వుండగా ప్రధాని ఆ సమస్యను అలా వదలడానికి వీలులేదు "ఆక్రమితభాగాలను స్వాధీన లోకి తేవడానికి మీరేం చర్యలు తీసుకొంటున్నారు?"

శ్రీ శాస్త్రి: ఆ తీర్మానమూవుంది

ఒకగొంతు దానిని అమలు జరపండి.

శ్రీ శాస్త్రి దాని మీద మనం అనేక విషయాలను ఆలోచించవలసి వుంటుంది మనం సన్నాహం చేసుకోవాలి వాటి మాట అటుండగా, తగు సమయం చూసుకోవాలి. వెంటనే ఫలితాలు ఏమువుంటాయో చూసుకోకుండా ఆమాదిరి తీవ్ర చర్యలకు దిగలేము ఆప్రతిజ్ఞవుంది నిజమే- దానికై దేశాన్ని తయారుచేసుకోవాలి

శ్రీ ఎన్. జి. రంగా: ఇలా మాట్లాడవలసిన పద్ధతి? మన దేశీయుల స్థిర సంకల్పాన్ని పునరుద్ఘాటించుతున్న పద్ధతిమాత్రం సంతృప్తికరంగా లేదు.

శ్రీ శాస్త్రి: రేపే చైనా మీదకు దాడి బయలుదేరుతున్నామని చెప్పాలనేది వారి అభిప్రాయ మయితేనేరది ..

శ్రీనాథ్‌పాయ్: చైనాపై దాడి సమస్యే కాదు దాడికి గురిఅయినది మనం. మన వయిన లడక్. నేఫాలలోకి వెళ్ళడం చైనాపై దాడిగానే చెప్పేటట్లయితే అసత్యదూరం.

శ్రీ శాస్త్రి: నేఫాకు సంబంధించినంత వరకు మనం అక్కడనే వున్నాం. లడక్‌లో కూడ మనం వున్నచోటనే వున్నాం. ఇక ముందుకు వెళ్లాలంటే ..

ఇక్కడ చాలమంది సభ్యులు "మన భూభాగాన్ని లాక్కోవాలి." - అని అరచి గలభాచేశారు

భాషాసమస్య మీద రాజ్యసభలో చర్చ

నేడు రాజ్యసభలో రాష్ట్రపతి వుపన్యాసం మీద చర్చలో భాషాసమస్య ప్రముఖస్థానం వహించింది.

వుద్యోగాలలో కోటాపద్ధతిని ప్రవేశపెటడం వలన పాలనా నిర్వహణ అసమర్థం అవుతుందనీ. అటువంటి సులభోపాయాలతో పరిస్థితులను మరింత చిక్కులపరచవలదనీ ఉ. ప్ర. కాంగ్రెసువాది శ్రీమతి ఎమ్. ఎస్. శ్యామకుమారీ ఖాన్ హెచ్చరించారు.

స్వతంత్రపార్టీకి చెందిన దహ్యాభాయిపటేల్ మాట్లాడుతూ భాష అనేది భావ ప్రకటన కొరకు పరికరమేగాని అదే లక్ష్యం గాదన్నారు. ఆ సమస్యమీద మనుషులు పోగొట్టుకొనడం కన్న పరస్పరం అభిప్రాయాలను మన్నించుకోవడం మంచిదన్నారు.

దేశంలోంచి ఇంగ్లీషును తొలగించి వేయడానికి ఇదసమయం. ఎన్నో ఏళ్ళు నిర్ణయించాలని శ్రీ ఎ. డి. మణి అన్నారు

జనవరి 26 న హిందీని అధికారభాషగా చెయ్యాలంటే కావలసిన ఏర్పాట్లేవీ చెయ్యనందులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల అశ్రద్ధను ఖండించారు.

పరిస్థితులను అదుపుచేసేటందుకు ప్రభుత్వం తయారీతో లేకపోవడమే దక్షిణదేశంలో భాషా సమస్యపై కల్లోలం జరగటానికి కారణమనీ. అధికార భాషగా హిందీని ప్రభుత్వం స్వీకరించక దానిని అమలు జరపడానికి రాష్ట్రాలు గట్టి ప్రయత్నంచేసి వుండాలనీ జనసంఘ సభ్యుడు శ్రీ వి. ఎం.చోర్డియా అన్నారు

భాషా సమస్యకు ఆచార్య వినోబాభావే సూచనలే సరియైన పరిష్కారం అనీ, కొన్ని రాష్ట్రాలలో ఉర్దూ వాడకం కూడా హెచ్చు చెయ్యాలనీ కాంగ్రెస్ సభ్యుడు శ్రీ గులాం మహమ్మద్ అన్నారు,

"హిందీని అధికార భాషచేయడంవిషయంలో దక్షిణాదిన ఎవరికీ అభ్యంతరం లేదనీ' కాని హిందీని వెంటనే తీసుకురావడంలో శ్రీ నెహ్రూ వాగ్దానాలను త్రోసిపుచ్చుతున్నారన్న అనుమానాలు ఎక్కువైనాయనీ శ్రీ టి. వెంగల్వరాయన్ (కాం. మద్రాసు) అన్నారు.

పొగాకు రైతుల సమస్యలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం:

శాసనసభలో శ్రీ పంగులూరి విమర్శ

హైదరాబాద్, మార్చి 2

బడ్జెట్‌పై శాసనసభలో రెండవరోజు చర్చ జరిగిన సందర్భంలో ప్రసంగిస్తూ. ప్రభుత్వం ఆంధ్ర ప్రజల ఆర్థిక జీవనంలో పొగాకు నిర్వహించే పాత్రను విస్మరించినట్లుందని పంగులూరి కోటేశ్వరరావుఅన్నారు. పొగాకు ఉత్పత్తిదారుల సమస్యలను అర్థం చేసికొనటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, వారిసమస్యలనువాస్తవికమయిన, హేతుబద్ధమైన దృష్టితో అవగాహన చేసికోవలసివుందని ఆయన అన్నారు.

ఆంధ్రదేశపు పొగాకు వ్యాపారంలో ఐ. యల్. టి. డి. నేషనల్ టుబాకో కంపెనీలవంటి సంస్థల ద్వారా విదేశీ గుత్త పెట్టుబడిదారుల పట్టు పెరుగుతున్నదని. వారి దయాదాక్షిణ్యాలపై ఆంధ్ర రైతులు ఆధారపడవలసి వస్తున్నదని శ్రీ కోటేశ్వరరావు అన్నారు.

పొగాకు ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ, రైతులవద్ద పొగాకు పెద్దఎత్తున నిల్వలు ఉండిపోవటం జరుగుతున్నదని, ఇది ప్రధాన సమస్యగా తయారైందని అన్నారు. ఈ విపత్కర పరిస్థితులు 1953-58-60-64 సంవత్సరాలలో ప్రత్యక్షమయ్యాయన్నారు. ప్రతిసారి ప్రభుత్వంవద్దకు రాయబారాలు పోవటం నిల్వలని విడుదల చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తామని మంత్రులుచెప్పడం జరుగుతూనేవుంది ఆచరణలో మాత్రం రైతులవద్ద పుగాకు నిల్వలు వుంటూనేవున్నవి. తప్పని పరిస్థితుల్లో ఏదో ఒక ధరకు రైతులు తమ సరుకును అమ్ముకొనవలసి వస్తున్నది. సరైన ధర వచ్చేవరకు నిల్వచేద్దామన్నా రైతులకు 'కోల్డు స్టోరేజి' సౌకర్యాలుగాని, గిడ్డంగి సౌకర్యాలుగానిలేవు అన్నారు.

ప్రభుత్వాధికారులు గ్రేడింగ్ జరిపి ఏగ్‌మార్కు ముద్రవేసినప్పటికీ,ప్రభుత్వాధికారులు సూచించే ధరలకు విదేశీ గుత్తపెట్టుబడిదారులు సరుకునికొని ఎగుమతి చేయటంలేదని ఆయన తెల్పారు.

సరుకులు విడుదలచేయుటలో ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానాన్ని అమలు జరపటం లేదని శ్రీ కోటేశ్వరరావు విమర్శించారు. ఏ సంవత్సరం ఏ రకం పొగాకు నిల్వఉంటే ఆ రకం పొగాకును పండించవద్దని రైతులను అభ్యర్థించటం తప్పితే, సరుకు విడుదలకోసం నిర్దిష్టమైన విధానంద్వారా తగు చర్యలు గైకొనటం జరగటంలేదని ఆయన విమర్శించారు

పైగా ప్రభుత్వం తమ అసమర్థతను గుర్తించ నిరాకరిస్తూ పొగాకును ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నారంటూ రైతులను నిందిస్తున్నదని ఆయన అన్నారు.

ప్రతి సంవత్సరం ముదుగా ఆయా రకాల పొగాకు కోటాను ప్రభుత్వం నిర్ణయించాలని, మిగిలిపోయిన పొగాకును రైతుల నుండి నేరుగా సక్రమమైన ధరలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు నేరుగా సరుకును ఎగుమతిచేసే అవకాశాన్ని కల్పించాలని విదేశీ గుత్త పెట్టుబడిదారులపై ఆధారపడకుండా [illegible] సహకారసంస్థ ఆధ్వర్యాన సిగరెట్ ఫ్యాక్టరీని నెలకొల్పాలని తన ప్రసంగాన్ని ముగిస్తూ శ్రీ కోటేశ్వరరావు సూచించారు.

ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రుల గైర్‌హాజరు

స్పీకర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 2

ప్రశ్నోత్తరాల సమయంలో [illegible] మంత్రులందరూ సభలో వుండాలని లోక్‌సభ స్పీకర్ హుకుంసింగ్ నేడు మరోసారి మంత్రులకు సూచించారు.

తన సూచనను మంత్రులు గౌరవించి. సభలో వుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అల్లాహాబాద్ హైకోర్టుకు, ఉత్తర ప్రదేశ్ శాసనసభకుమధ్య తలెత్తిన వివాదంపై సుప్రీంకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయం గురించి శ్రీ ద్వివేది ప్రశ్న అడిగినపుడు న్యాయశాఖ మంత్రి శ్రీ ఎ. కె సేన్ సభలో లేరు. అందుకు ద్వివేది అభ్యంతరం తెలిపారు న్యాయ శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ జగన్నాథరావు ఈ విషయంపై వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు యిచ్చారు.

కేంద్ర సర్వీసుల్లోని వైద్య ఉద్యోగుల వేతనాల పరిస్థితి

లోక్‌సభలో ప్రశ్నలు

న్యూఢిల్లీ, మార్చి 3

కేంద్ర ఆరోగ్య సర్వీసులో పనిచేస్తున్న వైద్య ఉద్యోగుల వేతనాల పరిస్థితి గురించి ఇటీవల వైద్య ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలజడినిగురించిలోక్‌సభలోపలువురు సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు.

ప్రభుత్వం అనుసరించుచున్న వైఖరిని విమర్శించారు.

ఆరోగ్యశాఖ మంత్రి యిచ్చిన సమాధానం ఎవరికీ సంతృప్తిని కలుగించలేదు.

ఆరోగ్యశాఖ మంత్రికి ప్రతిపక్ష సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. మధ్యలో హోం మంత్రి నందా జోక్యం చేసుకోవలసి వచ్చింది.

వైద్య ఉద్యోగుల కోర్కెల్ని ప్రభుత్వం సానుభూతితో పరిశీలించుచున్నదని నందా, డాక్టర్ సుశీలానయ్యర్‌లు అన్నారు.

వైద్య ఉద్యోగులు సహనాన్ని చూపించాలనీ, ఫిబ్రవరి 15 నుండి 22 వరకు నల్ల బ్యాడ్జిలు ధరించి పనిలోకి రావాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనీ సుశీలా నయ్యర్ కోరారు.

వైద్య ఉద్యోగులందరికీ ప్రాతినిధ్యం వహించే సంఘం. ఆ సంఘం ప్రతినిధులుండగా కొంతమంది డాక్టర్లకు వ్యక్తిగతంగా కబుర్లు సంపి వారితో ఆరోగ్యమంత్రి సంప్రదింపులు జరపటంలో ఔచిత్యమేమిటని యస్. యమ్. బెనర్జీ మరికొందరు అడిగారు, మంత్రివైఖరిని విమర్శించారు

సుశీలానయ్యర్ సమాధానం యిస్తూ "మీది ట్రేడ్‌యూనియన్ మనస్తత్వం" అని యస్ యమ్ బెనర్జీని అన్నారు.

మంత్రి ఆ మాట అనటంతోటే కోపంతో అనేకమంది లేచి ప్రశ్నలవర్షం కురిపించారు.

దీనితో నందా జోక్యం చేసుకొని సభ్యుల్ని సంతృప్తిపరచవలసి వచ్చింది.

యస్. యమ్. బెనర్జీ మధులిమాయే, తదితరులు మాట్లాడుతూ ఢిల్లీలో పనిచేస్తున్న వారినినాగాలాండ్‌కో, నేఫాకో బదిలీచేస్తారేమోనని భయపడుతున్నారనీ. కేంద్ర సర్వీసుల్లో ఉన్నప్పుడు బదిలీలు తప్పవనీ అయినా ముందు వైద్య ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు.

అవినీతి చర్యలకై డాక్టరు సస్పెన్షను

కాకినాడ, మార్చి 1

అవినీతి నిరోధక శాఖవారి సమాచారాన్నిబట్టి రాష్ట్ర ప్రభుత్వం శ్రీమతి సి. రాజేశ్వరి (అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ ప్రొఫెసరు)ను వుద్యోగంనుంచి సస్పెండు చేశారు.

ఈమె డాక్టరు. మెదకుజిల్లా పోలీసు సూపరింటెండెంటు శ్రీ సి. రాఘవేంద్రరావు భార్య. భార్యాభర్తలిద్దరూ కూడ గతంలో కాకినాడలో పనిచేశారు. ఆ మె లంచాలు తీసుకున్నట్లు విశాఖపట్నం అవినీతినిరోధకోద్యోగులు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారట.

మంగళగిరిలో రైలుక్రింద పడి స్త్రీ మరణం

మంగళగిరి, మార్చి 3

మంగళగిరిలో నేటి ఉదయాన 9 గంటలకు బి బి టి. కంపెనీలో పనికిపెడుతున్న వర్కర్ శ్రీమతి ఆర్. రావమ్మ విజయవాడ నుండి గుంటూరు వైపు పోతున్న రైలుక్రిందపడి దుర్మరణం పాలయ్యారు. ఆమె వయస్సు షుమారు 50 సంవత్సరాలు. ఆమెది విజయవాడలోని కుమ్మరిపాలెం అని తెలుస్తున్నది. ఆమె శరీరం తునాతునకలై పోయింది.

(వి. వి.)

జెనీవా తరహాసభ ఏర్పాటుకు భారత ప్రభుత్వ ప్రయత్నం

న్యూఢిల్లీ, మార్చి 3

వియత్నామ్‌లో శాంతిని నెలకొల్పేందుకుగాను జెనీవా తరహా సమావేశాన్ని జరపాలనే విషయం గురించి భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారవర్గాలద్వారా తెలుస్తున్నది.

ఈ విషయంలో ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రష్యా ప్రధాని కొసిగిన్, అమెరికా అధ్యక్షుడు జాన్సన్‌లకు ఉత్తరాలు వ్రాయటంతో పాటు, భారత ప్రభుత్వం 14 జెనీవా రాజ్యాలకు 8 అలీన రాజ్యాలకు, ఉత్తరాలు వ్రాసింది.

జెనీవా తరహాసభను ఏర్పాటు చేయాలనే విషయంలో ఇంకా మరికొన్ని రాజ్యాలతో ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాలతో భారత ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలు జరపగలదని తెలుస్తున్నది.

ప్రధాని శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి నేడు లోక్ సభలో మాట్లాడుతూ ఈ విషయంలో భారత ప్రభుత్వం వ్రాసిన ఉత్తరాలకు కొన్ని రాజ్యాల నుండి సమాధానాలు వచ్చాయని. అవి తమ ప్రతిపాదనకు అనుకూలంగా వున్నాయని తెలిపారు.

కేరళకు చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ రాక

తిరువనంతపురం మార్చి 3

కేరళలో రేపు జరుగుతున్న ఎన్నికలను పర్యవేక్షించే నిమిత్తం చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ శ్రీ కె వి. కె. సుందరం నేడిక్కడకు వచ్చారు ఆయన ఈ నెల 7 వ తేదీవరకు ఈ రాష్ట్రంలోనే వుంటారు.

బ్లాక్ మార్కెట్

(1 వ పేజీ తరువాయి)

ఏజెంట్లువుంటారు.

అప్పన్న: మంత్రిగారు కొన్ని ఆరోపణలు గురించే దర్యాప్తు చేశామన్నారు. వాటి ఫలితాలను ఆరోపణ చేసినవారికి తెలియజేశారా?

మంత్రి: అధికార్ల ఆధ్వర్యాన దర్యాప్తు జరగలేదు.

శ్రీ విశ్వనాథం: బ్లాక్‌మార్కెట్లకు కొంత మంది అధికారులు వత్తాసు వుంది. అందువల్ల డిపార్టుమెంటు విచారణవల్ల ప్రయోజనంలేదు. అనధికార కమిటీని నియమించాలి.

మంత్రి: పరిశ్రమలశాఖ సలహా సంఘం అవసరమయితే ఈ విషయాన్ని పరిశీలించుతుంది.

స్వర్ణకారులకు హానికల్గించే బంగారపు బాండ్లు

నెల్లూరు, మార్చి 2

హెచ్చు వడ్డీరేటుతో బంగారపు బాండ్లను తిరిగి ప్రవేశపెట్టడంవల్ల దేశంలోని 5 లక్షల మంది స్వర్ణకారులు నిరుద్యోగులౌతారనే ప్రమాదం కలదని ఉత్తర ఆర్కాట్ జిల్లా స్వర్ణకారుల సంఘాధ్యక్షుడు శ్రీ సుబ్రహ్మణ్యాచారి నేడిక్కడ హెచ్చరించారు.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారి మొన్న తన బడ్జెట్ ప్రసంగంలో బంగారపు బాండ్లను తిరిగి ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించిన సంగతి పాఠకులకు విదితమే.

రస్క్ - డోబ్రినిన్ సంభాషణలు

వాషింగ్టన్, మార్చి 3

అమెరికా విదేశాంగ కార్యదర్శి శ్రీ డీన్ రస్క్,సోవియట్ రాయబారి అనాటోలీ డోబ్రినిన్‌లు నేడు సంభాషణలు జరిపారు. ఆ సమావేశం రస్క్ కోరికపై జరిగింది. చర్చలు 75 నిముషాలు సాగేయి.

సమావేశానంతరం డోబ్రినిన్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ డీన్‌రస్క్ అమెరికా ప్రభుత్వ దృక్పథాన్నీ, తాను సోవియట్ ప్రభుత్వ దృక్పథాన్నీ తెలియ పరచుకొన్నామన్నారు.

"వియత్నాం మీద సోవియట్ యూనియన్ అభిప్రాయం ఏమిటో అందరో ఎరుగుదురు." అన్నారు. ఆయనఒకప్రశ్నకుసమాధానంఇస్తూ.

ఉ. వియత్నాం మీద మరల అమెరికను దాడులు జరుగుతూండడంవలన సోవియట్ - అమెరికా అగ్రనాయక సమావేశం సమీప భవిష్యత్తులో జరగటానికి ఆటంక మవుతుందా యన్న ప్రశ్నకు సమాధానమిస్తూ "మీరే వూహించండి" అన్నారు.

సంభాషణలు సౌహార్దంగానే జరిగాయన్నారు. ఒక్క వియత్నాం గురించేగాక ఉభయులకూ సంబంధం వున్న ఇతర విషయాలు కూడా ప్రసక్తం అయాయి అన్నారు.

జపాన్ ఫ్రాన్సులలో కొత్త రాయబారులు

భారత ప్రభుత్వం నియమించనున్నట్లు వార్త

న్యూఢిల్లీ, మార్చి 3

కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేసే ఇద్దరుసీనియర్ అధికారులను త్వరలోనే రాయబారులుగా నియమించబోతున్నట్లు తెలుస్తున్నది.

వీరిలో శ్రీ రాజేశ్వర దయాళ్‌ను ఫ్రాన్సులోనూ, శ్రీ బి.హెచ్ యస్. జ్యాట్‌జీని జపాన్‌లోనూ భారత రాయబారులుగా నియమించబడనున్నట్లు భావిస్తున్నారు.

కేరళ ఎన్నికల నిధికి ఇలపర్రునుండి రు. 100 ల కానుక

ఇలపర్రు, మార్చి 1

పశ్చిమ గోదావరిజిల్లా, తణుకు తాలూకా ఇలపర్రు నుంచి కేరళ ఎన్నికల నిధికి నూరు రూపాయలు పంపించారు.

ఈ మొత్తం టి. ఎం. ఓ ద్వారా కేరళ ఎన్నికల నిధికి ఈ రోజున పంపి చారు.

సుస్థిర ప్రభుత్వం నెలకొల్పగల్గినది ఐక్యసంఘటన మాత్రమే

శ్రీ శంకుపిళ్లై ఉద్ఘాటన

క్విలన్ మార్చి 2

కేరళలో సుస్థిరమైన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించ గల్గినది ఒక్క వామపక్ష ఐక్య సంఘటన మాత్రమే నని. కనుక ఐక్య సంఘటన అభ్యర్థులకు ప్రజలు ఓట్లిచ్చి గెలిపించాలని ఐక్య సంఘటన కార్యదర్శి శ్రీ కె శంకుపిళ్ళై నేడు విజ్ఞప్తి చేశారు.

క్విలన్‌లోని 32 మంది ప్రముఖ న్యాయవాదులు నేడు జారీ చేసిన సంయుక్త ప్రకటనలో తిరుగుబాటు కాంగ్రెసు అభ్యర్థులకు ప్రజలు ఓట్లివ్వాలని అభ్యర్థించారు.

◆◆◆

సవరణ

గృహనిర్మాణబోర్డు ఇండ్ల కేటాయింపును గురించి విశాలాంధ్ర 28 వ తేదీన ప్రకటించిన వార్తలో శ్రీ జలగం వెంగళరావు గృహనిర్మాణ బోర్డు అధ్యక్షుడని ప్రకటించాము. ఆయన గృహనిర్మాణబోర్డు సభ్యుడు మాత్రమే అధ్యక్షుడు కాదు (వి. సం.)

◆◆◆


4 వ వారం
అనుపమ చిత్రం
ANUPAMA
ఉయ్యాల జంపాల
నిర్మాత,దర్శకుడు: తిలక్...సంగీతం:పెండ్యాల
కథ:బినిశెట్టి... పాటలు:ఆరుద్ర,కొసరాజు
పూర్ణా రిలీజ్
STUDIO Keith

కొలంబో ప్రతిపాదనలకు నేటికీ కట్టుబడే వుంటాం

లోక్‌సభలో శ్రీ స్వరణ్ సింగ్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ, మార్చి 2

కొలంబో ప్రతిపాదనలను చైనా తిరస్కరించటం తీవ్రమయిన విషయం, అంతమాత్రాన కొలంబో ప్రతిపాదనలకు ఇక భారత దేశం కట్టుబడివుండబోదని భారతదేశం చెప్పనవసరం లేదని విదేశాంగ మంత్రి స్వరణ్‌సింగ్ నేడు లోక్‌సభ ప్రశ్నోత్తరాలసమయంలో చెప్పారు.

చైనా పార్లమెంటులో ఇటీవలం చైనాప్రధాని చేసిన ప్రకటన దృష్ట్యా భారత ప్రభుత్వ వైఖరి ఏమిటని అడిగిన ప్రశ్నకు స్వరణ్‌సింగ్ సమాధానం చెబుతూ కొలంబో ప్రతిపాదనలను ఆమోదించినట్లయితే చైనాతో సంప్రదింపులకు భారతదేశం సిద్ధమేనని అన్నారు.

పశ్చిమ రంగంలోని 20 కిలో మీటర్లని సైనిక మండలంగల ఏడు పౌర గస్తీ కేంద్రాలను చైనా ఉపసంహరించుకోదని చౌ-ఎన్-లై తన పార్లమెంటులో అన్నట్లు అనధికారవార్తలు వచ్చినా, భారతప్రభుత్వానికి ఆ విషయమై అధికారయుతంగా ఎటువంటి వర్తమానం రాలేదని అంతకుముందు మరొక ప్రశ్నకు శ్రీమతి లక్ష్మీమీనన్ సమాధానం చెప్పారు

నేఫా ప్రాంతంలో 90 చ. వేల కిలో మీటర్ల స్థలం తనదని చెబుతున్న చైనా వైఖరిని కొలంబో రాజ్యాల దృష్టికి భారత ప్రభుత్వం తెచ్చిందా? ఎంతకాలం భారతదేశం కొలంబో ప్రతిపాదనలకు తనంతటతానుగా కట్టుబడివుంటుంది? అని వాజ్‌పాయ్ అడిగిన ప్రశ్నకు స్వరణ్‌సింగ్ సమాధానం చెబుతూ పెకింగ్ వైఖరిని కొలంబో రాజ్యాలదృష్టికి తేవలసిన అవసరం మనకులేదు. కొలంబో ప్రతిపాదనలను చైనా ఆమోదించలేదనేది జగద్విదితం. కొలంబో ప్రతిపాదనలకు ఇక మేము కట్టుబడి వుండబోమని చెప్పటం వల్ల సమస్యాపరిష్కారానికి ఏరకంగానూ దోహదం చేయదు" అన్నారు.

ఇటువంటి తీవ్రమయిన పరిస్థితిలో ప్రత్యామ్నాయ సూచనలను భారతదేశం చేయుటం మంచిదికాదని శ్రీ కె. ఎల్. గుప్తా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

'చైనా మన భూభాగాలను ఆక్రమించుకున్నది. కొన్ని ఆసియా - ఆఫ్రికా దేశాలు కొన్ని ప్రతిపాదనలు చేశాయి. అవి మనకు పూర్తిగా అంగీకారయోగ్యంగా లేకపోయినా సంప్రదింపులకు ప్రాతిపదికగా వుంటాయని వాటిని ఆమోదించాం, కాని చైనా ఆమోదించలేదు. ఇది చాలా తీవ్ర విషయం" అన్నారు.

సరిహద్దు వివాదం విషయంలో మూడవ పక్షం మధ్యవర్తి తప్పక అంగీకరించే సమస్య లేదని శ్రీ ఎ.డి. మణికి స్వరణ్‌సింగ్ జవాబు యిచ్చారు.

"ఒక దశలో మధ్యవర్తి తీర్పు దాదాపు మనం అంగీకరించాం. ఉభయులు అంగీకరించితే అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్ళవచ్చునని స్వర్గీయ నెహ్రూ ఒకసారి అన్నారు.

చైనా ఆకాశ సరిహద్దుల ఉల్లంఘనవార్త అబద్ధం

తమ ఆకాశ సరిహద్దులను భారత విమానాలు అతిక్రమించు చున్నాయని చైనా చేసే ఆరోపణలు పట్టి అబద్ధమని స్వరణ్‌సింగ్ అన్నారు.

జనవరి 18 వ తేదీన చైనా పంపిన నిరసనకు భారత ప్రభుత్వం తగు సమాధానం యిచ్చిందన్నారు.

బర్మా సరిహద్దులో నాగాల రాకపోకలకు అవకాశం

భారత- బర్మా దేశాల సరిహద్దులో ఒక 20 మైళ్ళపొడవున నాగాలు యధేచ్ఛగా రాకపోకలు సాగించటానికి వీలున్నదని స్వరణ్ సింగ్ ఒక ప్రశ్నకు సమాధానంగా తెలియ చేశారు.

సప్లిమెంటరీ పద్దుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 2

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 475.01 కోట్లమేరకు గల సప్లిమెంటరీ డిమాండ్ల పద్దుకు లోక్‌సభ నేడు ఆమోదించింది.

ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వం చేయగల ప్రయత్నాలన్నింటినీ చేస్తున్నదని అన్నారు.

మొత్తం ఆర్థికరంగం కార్యకలాపాలన్నీ కేంద్ర ప్రభుత్వం చేతిలో లేనందున కేంద్ర ప్రభుత్వ చర్యలకు ఎన్ని అవరోధాలున్నాయని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార రంగం, దొంగ డబ్బు ఇవి కూడా ఆర్థికరంగంలో తమ తమ స్థానాలను కలిగివున్నాయని చెప్పారు.

'సహకార రంగానికి రిజర్వు బ్యాంకు ప్రస్తుతం 270 కోట్లు యిచ్చింది. ఈ మొత్తం నిధి ప్రభావం ధరలపై పడకుండా ఎలా వుంటుంది? అందువల్ల సహకార సంస్థల కార్యకలాపాలపైన రిజర్వుబ్యాంకుకు అజమాయిషీ అధికారం వుండాలని ప్రభుత్వం కోరుతుంది" అని శ్రీ టి. టి. కె. అన్నారు.

అత్యవసర సరకుల చట్టం క్రింద 339 మందిపై కేసులు

న్యూఢిల్లీ, మార్చి 2

1964 నవంబరు 15 డిసెంబరు 31 తేదీల మధ్య 8 రాష్ట్రాలలోనూ, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలోనూ అత్యవసర సరకుల చట్టం క్రింద 339 మందిపై కేసులు పెట్టడం జరిగిందని శ్రీ డి. యస్. ద్వివేది అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆహార మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం లోక్‌సభలో చెప్పారు.

వీరిలో 99 మందికి శిక్షలుపడ్డాయని, మిగతా కేసులు ఇంకా కోర్టు ముందున్నవని అన్నారు.

ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, మద్రాసు, ఢిల్లీ రాష్ట్రాలనుండి ఈ విషయమై సమాచారం లేదని అన్నారు.

రాజస్తాన్‌లో ఎక్కువ మందిపై కేసులు పెట్టడం జరిగింది.

మరో ప్రపంచ సంస్థ అనవసరం

ఐరాసనే బలపరచాలని శ్రీ శాస్త్రి ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 2

చెక్ ప్రధాని జోసెఫ్ లెనార్టుకు తాము ఇచ్చిన విందులో ప్రసంగిస్తూ ఐరాసనే నేడు దృఢపరచాలేగానీ, మరో ప్రపంచ సంస్థను నిర్మించరాదనీ, తగవులుంటే చర్చలద్వారా పరిష్కరించు కోవాలనీ భారత ప్రధాని శాస్త్రి నేడు అన్నారు.

దక్షిణ వియత్నాంలో ఘర్షణ తల్లారాలనీ, దానికి సంబంధించిన దేశాలు చర్చలకు దిగాలనీ భారత చెకోస్లోవాకియాలు ఏక విధంగా అభిప్రాయ పడుతున్నా యన్నారు.

శాంతి, నిరాయుధీకరణ, సామ్రాజ్యవాదం నిర్మూలన అవసరమని చెక్ ప్రధాని తమ వుపన్యాసంలో చెప్పారు.

బండీ, ఎడ్లు పోయినవి

ఒక ఎద్దు శిల్పకాయదోరరంగు, కొమ్ములు కొంచెం వెనుకగా వుంటాయి. మూడుకొర్లు, రెండవ ఎద్దు, ఎల్లెద్దు, నిటావుగల వంటిమీద ఎరుపు వెంట్రుకలు గలవు, మూడు కొర్లు. ఈ నెల 2 వ తేదీ తెల్లవారుఝామున పై గుర్తులు గల ఎద్లు, బండితోసహా ఎవరో తోలుకొనిపోయారు. జాడ తెలిసినా, అప్పగించినా తగిన బహుమతి యివ్వబడును.

ఆళ్ళ చిన వెంకటరెడ్డి,
తేలప్రోలు, గన్నవరం తాలూకా, కృష్ణాజిల్లా.

విజయవాడ సబ్ జైల్

విజయవాడ, మార్చి 3

విజయవాడ సబ్‌జైలులో బందోబస్తు బాధ్యత ఇంతవరకు పోలీసులకు నిర్వహణ క్రింద వుండేది. ఈ నెల మొదటి తేదీ సాయంత్రం నుండి బందోబస్తు బాధ్యతకూడా జైళ్ళశాఖకు ఒప్పగించబడింది. ఇకనుండి ఈ సబ్‌జైలులో మొత్తం 20 మంది వార్డర్లుండి ఆ బాధ్యతను కూడా నిర్వహిస్తారు. (వి. వి.)

కేరళ ఎన్నికల నిధికి తాడిపత్రి తాలూకా కమ్యూనిస్టుపార్టీవిరాళం

తాడిపత్రి మార్చి 1

కేరళ కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల నిధికి, అనంతపురంజిల్లా తాడిపత్రి తాలూకా కమ్యూనిస్టు సమితితరపున రు. 50 లను మొన్న మనియార్డర్‌ద్వారా పంపించారు. (వి. వి.)

రంగుజాతులపట్ల బ్రిటన్‌లో వివక్ష

లండన్, మార్చి

బ్రిటన్‌లోకి రంగుజాతులవారు ప్రవాసం రాకుండా నివారించే బిల్లును కామన్స్ సభలో చర్చకు రాకుండా నిరోధించాలని లేబరుపార్టీ, కన్సర్వేటివ్‌పార్టీ, లిబరల్ పార్టీలకు చెందిన ఆరుగురు పార్లమెంటు సభ్యులు నేడు నిర్ణయించారు.


శ్రీ వాణీ ఫిలింస్
నాదీ ఆడజన్మే
దర్శకత్వం: A.C.త్రిలోక్‌చందర్ M.A.
నిర్మాత: S.V.రంగారావు B.Sc.
9 వ వారము
చూచినవారే మళ్ళీ మళ్ళీ చూస్తున్న మనోహర సాంఘిక చిత్రం
మాటలు: D.V.నరసరాజు B.A.
పాటలు: దాశరథి B.A.
సంగీతం: R.సుదర్శనం
SRI VANI FILMS
స్టూడియో: ఏ.వి.ఎమ్
మదరాసు: శ్రీ కృష్ణాలో 2 వ వారము


నేడే!
50 వ రోజు...
తెలుగు చలనచిత్ర చరిత్రలో మున్నెన్నడూ కనీవినీ యెరుగని ఘనవిజయాన్నిసాధించి అశేష ప్రజల.... ఆదరాభిమానాలను చూరగొన్న మహత్తర పౌరాణిక చిత్ర ప్రబంధం!
MADHAVEE Productions
మాధవి ప్రొడక్షన్స్
పాండవ వనవాసము
STUDIO: ERANKI
దర్శకత్వం: K.కామేశ్వరరావు B.A.
నిర్మాత: A.S.R.ఆంజనేయులు...

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కొల్లగట్ల రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్ విజయవాడ 4. ప్రధాన సంపాదకుడు: ఏటుకూరు బలరామమూర్తి.